PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 42 సంచిక : 354 | విజయవాడ, సోమవారం 24 జూలై 2023 | 6 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Monday 24 July 2023 | Rs

అమరావతిలో షేర్‌వాల్ టెక్నాలజీతో ఇళ్లు

- నేడు శంకుస్థాపన చేయనున్న సిఎం జగన్
- ఏర్పాట్లను పరిశీలించిన మంత్రులు

లోపలి పేజీలో..

ఎమర్జింగ్ ఆసియా కప్

- విజేత పాకిస్తాన్
- ఫైనల్లో భారత్‌పై ఘన విజయం

6

అస్సాం వాసి మృతి ఘటనలో

సిఐ గంగాధర్ సస్పెండ్

- ఎఎస్ఐ, కానిస్టేబుల్ కూడా...
- మరో నలుగురిని విఆర్‌కు బదిలీ
- మొత్తం ఏడుగురిపైనా కేసు
- ఐజి పాల్‌రాజు ఉత్తర్వులు జారీ

సస్పెండ్ అయిన సిఐ గంగాధర్ (ఫైల్)

ప్రజాశక్తి- నెల్లూరు

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో అస్సాం రాష్ట్రం కుకీ తెగకు చెందిన గిరిజనుడు ఇమ్మానియేల్ మృతి కేసులో వెంకటాచలం పోలీస్ స్టేషన్‌కు చెందిన సిఐతోపాటు మొత్తం ఏడుగురు సిబ్బందిపై పోలీసు ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నారు. ఈ మేరకు శనివారం అర్ధరాత్రి ఉత్తర్వులు జారీ అయ్యాయి. పోలీసుల నిర్లక్ష్యం కారణంగానే ఆ వ్యక్తి మృతి చెందారన్న కారణంతో సిఐ గంగాధరరావు, ఎఎస్ఐ శ్రీనాథ్, కానిస్టేబుల్ లక్ష్మీకాంత్‌లను సస్పెండ్ చేశారు. ఎస్ఐ అయ్యప్ప, కానిస్టేబుళ్లు నాగేంద్ర, మదన్, హోంగార్డులు ఎ.మధు, మధుసూదన్‌లను విఆర్‌కు బదిలీ చేశారు. ఈ ఏడుగురిపై వేదాయపాళెం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేయాలంటూ గుంటూరు రేంజ్ ఐజి పాల్‌రాజు ఆదేశించారు.

ఏమి జరిగిందంటే....

పోలీసులు చెప్తున్న కథనం ప్రకారం... ఇమ్మానియేల్ తన భార్యతో కలిసి ఈ నెల 16న రైలులో కేరళకు వెళ్తూ మార్గమధ్యంలో నెల్లూరు జిల్లా వెంకటాచలం రైల్వే స్టేషన్‌లో కొందరిపై దాడికి ఉపక్రమించాడు. ఈ నేపథ్యంలో కొందరు 112 నెంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేశారు. వెంకటాచలం పోలీసులు ఇమ్మానియేల్‌ను అదుపులోకి తీసుకొని పోలీసు వాహనంలో నెల్లూరుకు తీసుకొస్తున్నారు. బుజబుజనెల్లూరు, పడారుపల్లి మార్గమధ్యంలో ఆయన తప్పించుకొని పారిపోయేందుకు ఓ వంతెన వద్ద వాహనం నుంచి కిందకు దూకాడు. ఈ ఘటనలో తీవ్ర గాయాలపాలైన ఇమ్మానియేల్‌ను వైద్యం నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ ఆయన మృతి చెందారు. ఈ ఘటన నెల్లూరు నగరంలోని వేదాయపాళెం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. కాగా, ఈ విషయాన్ని వెంకటాచలం పోలీసులు రహస్యంగా ఉంచారు. దీనిపై ఇమ్మానియేల్ కుటుంబసభ్యులు అస్సాంలో ఆందోళనకు దిగారు. పోలీసులు కొట్టడం వల్లే చనిపోయాడని ఆరోపించారు. ఈ నేపథ్యంలో అస్సాం ప్రభుత్వం దీనిపై విచారణ చేయాలని మన రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు గుంటూరు రేంజ్ ఐజి పాల్‌రాజు, ఎస్‌పి డాక్టర్ కె.తిరుమలేశ్వరరెడ్డి శాఖాపరమైన విచారణ చేపట్టారు. పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే ఈ దుర్ఘటన చోటుచేసుకుందని నిర్ధారించి పోలీసు సిబ్బందిపై చర్యలు తీసుకున్నారు.

మంత్రాలయంలో

108 అడుగుల శ్రీరాముని విగ్రహం

- వర్చువల్‌గా కేంద్ర హోం మంత్రి అమిత్ షా శంకుస్థాపన

3

స్వాతంత్ర్య సమరయోధుడి భార్య సజీవ దహనం

మణిపూర్‌లో వెలుగుచూసిన మరో ఘాతుకం

ఇంఫాల్ : సంఘ్ పరివార్ మతోన్మాద విద్వేష భావజాలం తలకెక్కిన మానవ మృగాల మారణకాండలో స్వాతంత్ర్య సమరయోధుడి సతీమణి సజీవ దహనమైన హృదయవిదారక ఘటన తాజాగా వెలుగులోకి వచ్చింది. మణిపూర్ కాక్చింగ్ జిల్లా సెరౌ గ్రామంలో నివాసముంటున్న స్వాతంత్ర్య సమరయోధుడు ఎస్ చురచంద్ సింగ్ భార్య ఇబెటోంబి (80)ని దుండగులు సజీవ దహనం చేశారు. ఈ ఘటన మే 28 తెల్లవారుజామున జరిగింది. అదే రోజు గ్రామంలో భారీ హింసాత్మక ఘటనలతోపాటు కాల్పులు కూడా జరిగాయి.

80 ఏళ్ల ఇబెటోంబి ఇంట్లో ఉండగా.. సాయుధ దుండగులు ఆ ఇంటి బయట గడియ పెట్టి, నిప్పుపెట్టారు. ఆమెను రక్షించేందుకు కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకొనేసరికే ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. మరోవైపు తూటాలతో కాల్పులు జరిపారు. ఈ విషయాన్ని ఇబెటోంబి మనవడు 22 ఏళ్ల ప్రేమ్‌కాంత్ వెల్లడించారు. ఆ దారుణం నుంచి తాను తృటిలో తప్పించుకున్నానని చెప్పారు. తన అమ్మమ్మను రక్షించడానికి ప్రయత్నించినప్పుడు బుల్లెట్లు తన చేయి, కాలు నుంచి దూసుకుపోయినట్లు తెలిపారు. "మాపై కాల్పులు జరగడాన్ని గమనించిన మా అమ్మమ్మ ముందు అక్కడి నుండి పరుగెత్తి వెళ్లిపొమ్మని చెప్పింది. కొంత సమయం తర్వాత తన కోసం తిరిగి రావాలని చెప్పింది. అవే ఆమె చివరి మాటలు" అని భావోద్వేగంతో మీడియాకు వివరించారు. తమ తాతయ్య చురచంద్ సింగ్‌ని అప్పటి రాష్ట్రపతి ఎపిజె అబ్దుల్‌కలామ్ ఘనంగా సత్కరించిన ఫొటో తన అమ్మమ్మకి అత్యంత ఇష్టమైనదంటూ ఆ ఫొటో మీడియాకు చూపిస్తూ, కన్నీటి పర్యంతమయ్యారు. తన శరీరంపై బుల్లెట్ గాయాలను ప్రేమ్‌కాంత్ మీడియాకు చూపించారు.

నాడు సుందర గ్రామం.. నేడు వల్లకాడుగా మారింది...

మే 3న హింస ప్రారంభంకావడానికి ముందు, ఇంఫాల్‌కు 45 కిలోమీటర్ల దూరంలో ఉన్న సుందరమైన గ్రామం సెరౌ. ఇప్పుడు అగ్నికి ఆహుతైన నివాసాలు, మొండి గోడలపై బుల్లెట్ రంధ్రాలు కనిపిస్తున్నాయి. ఒకప్పుడు వ్యాపారాలతో కళకళలాడిన ఆ గ్రామం శ్మశాన వైరాగ్యంతో నిశ్శబ్దంగా మారింది. మెయితీ – కుకీ ఘర్షణల్లో అత్యంత దారుణంగా దెబ్బతిన్న గ్రామాల్లో ఇది ఒకటి. ఇబెటోంబి శరీర అవశేషాలను సేకరించే సమయంలో తీసిన వీడియోను ఎన్‌డి టివి చూసింది. ఆమె మంచం ఉన్న ప్రదేశం చుట్టూ పుర్రె, శిథిలాలలో కాలిన ఎముకలు చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. కాల్పుల నుంచి ప్రాణాలు దక్కించుకునేందుకు ఆ గ్రామ ప్రజలు పారిపోయారు. మరో సెరో నివాసి, ఇబెటోంబి కోడలు ఎస్.తమ్‌పక్సానా మాట్లాడుతూ 'సాయుధ మూక దాడులకు పాల్పడుతుండటంతో మే 28వ తేదీ తెల్లవారుజామున

మిగతా 2లో

సెరౌ గ్రామంలో ధ్వంసమైన ఈ ఇంటిలోనే స్వాతంత్ర్య సమరయోధుడి భార్య ఇబే తోంబీని దుండగులు సజీవ దహనం చేశారు, (ఇన్‌సెట్‌లో) మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాంతో స్వాతంత్ర్య సమరయోధుడు ఎస్.చుర్‌చంద్‌సింగ్ (ఫైల్)

ఇజ్రాయిల్ నిరసనల హోరు

ఇజ్రాయిల్‌లో అన్యాయ సంస్కరణలను వ్యతిరేకిస్తూ ఆందోళన చేస్తున్న ప్రజలు

(వార్త 7లో..)

'బైజూస్' భారం ఎవరు భరిస్తారు?

- వచ్చే ఏడాది ఉచితమేనా? కొంటారా?
- ప్రభుత్వాన్ని ప్రశ్నించిన పవన్‌కల్యాణ్

2

పవన్ వద్ద ట్యూషన్ తీసుకుంటా..

- ఆయనకు పాఠాలు చెప్పిన టీచర్లూ సిగ్గుపడతారు!
- జనసేనానిపై బొత్స వ్యంగ్యాస్త్రాలు

'కాంట్రాక్టు' క్రమబద్ధీకరణకు

ఐదేళ్ల నిబంధన సడలించాలి

- ఎపి జెఎసి అమరావతి డిమాండ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణకు కోసం విధించిన ఐదు సంవత్సరాల నిబంధన తొలగించాలని ఎపి జెఎసి అమరావతి ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, జనరల్ సెక్రటరీ పలిశెట్టి దామోదర్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం నిర్ణయం తీసుకునే తేదీ నాటికి పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులందరినీ క్రమబద్ధీకరించాలని కోరారు. విజయవాడలోని గాంధీనగర్‌లో ఉన్న రెవెన్యూ భవన్‌లో ఆదివారం కాంట్రాక్టు ఉద్యోగుల ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా బొప్పరాజు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా వివిధ విభాగాల్లో వేలాది మంది కాంట్రాక్టు ఉద్యోగులు 22 ఏళ్లుగా పనిచేస్తున్నారని తెలిపారు. వారు రిటైర్‌మెంట్‌కు దగ్గరపడుతున్నా క్రమబద్ధీకరణకు నోచుకోలేదన్నారు. ఈ సమావేశంలో ఎపి కాంట్రాక్టు లెక్చరర్స్ జెఎసి నాయకులు కుమ్మరికుంట సురేష్, కల్లూరి శ్రీనివాస్, పి.సాయిరాజ్, ఎం.దుర్గామల్లేశ్వరి పాల్గొన్నారు.

పార్టీ ఏదైనా ప్రత్యర్థి వేణునే

- రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్ చంద్రబోస్
- రామచంద్రపురం నుంచే పోటీ చేస్తా : మంత్రి వేణు

రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్

మంత్రి వేణుగోపాలకృష్ణ

ప్రజాశక్తి- రామచంద్రపురం

వచ్చే ఎన్నికల్లో పార్టీ ఏదైనా తన ప్రత్యర్థి మాత్రం ప్రస్తుత మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణనే అని రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్ చంద్రబోస్ తేల్చి చెప్పారు. రామచంద్రపురంలోని తన కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎంపి బోసు మాట్లాడారు. పార్టీ సీటు ఇచ్చినా, ఇవ్వకపోయినా తాను లేదా తన కుమారుడు రామచంద్రపురం నుంచి పోటీ చేస్తామన్నారు. పార్టీ టికెట్ వేణుకు ఇస్తే స్వతంత్రంగా పోటీ చేస్తానని చెప్పారు. అవసరమైతే రాజ్యసభ సభ్యత్వానికి సైతం రాజీనామా చేస్తానని తెలిపారు. మంత్రి వేణు విధానాలను తాను వ్యతిరేకిస్తున్నానని చెప్పారు. వేణు పాల్పడిన వ్యవహారాలన్నీ ముఖ్యమంత్రి జగన్ దృష్టికి తీసుకెళ్లానని తెలిపారు. ముగ్గురం కూర్చుని మాట్లాడుకుందామని ముఖ్యమంత్రి తనకు తెలిపారన్నారు. వేణుతో ముఖాముఖి మాట్లాడే ప్రసక్తే లేదని, ఆయన వ్యవహార శైలిని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నానని చెప్పారు. ఎన్నికలకు ఇంకా చాలా సమయం ఉందని, పార్టీ మారడంపై ఎలాంటి నిర్ణయమూ ఇంకా తీసుకోలేదని ఆయన ఒక ప్రశ్నకు సమాధానమిచ్చారు. ఎన్నికల్లో మాత్రం తప్పకుండా పోటీలో ఉంటామని స్పష్టం చేశారు. కాగా, ఇప్పటికే జరుగుతున్న పరిణామాలతో వేడెక్కిన రామచంద్రపురం రాజకీయం... బోస్ వ్యాఖ్యలతో మరింత కాకను పుట్టించాయి. ఆయన 2014 ఎన్నికల్లో రామచంద్రపురం నుంచి వైసిపి అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి చెందారు. అనంతరం ఆయనకు అధిష్టానం రాజ్యసభ సీటు కేటాయించింది. 2019 ఎన్నికల్లో కాకినాడకు చెందిన చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణకు రామచంద్రపురం టికెట్ ఇచ్చింది. అప్పట్లోనే స్థానికేతరుడంటూ వైసిపి కార్యకర్తలు వ్యతిరేకించారు. అయితే, బోసు సహకారంతో వేణు ఎంఎల్‌ఎగా గెలిచారు. అనంతరం మంత్రి పదవి పొందారు. అప్పటి నుంచి బోసు అనుచరులను

మిగతా 2లో

సాగుదార్లకే అసైన్డ్ భూములపై హక్కులు

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు డిమాండ్
- మంత్రులు, ఎమ్మెల్యేల కుటుంబాలకు వేల ఎకరాలు అన్యాక్రాంతమయ్యాయి
- వరికపూడిశెల పనులను ఇప్పటికైనా చేపట్టండి
- యుసిసి, మణిపూర్ ఘటనలపై కేంద్రాన్ని అన్ని పార్టీలూ నిలదీయాలి

విలేకర్లతో మాట్లాడుతున్న వి.శ్రీనివాసరావు, పక్కన వి.కృష్ణయ్య, గుంటూరు విజయ్‌కుమార్

ప్రజాశక్తి- పల్నాడు జిల్లా

అసైన్డ్ భూములను సాగు చేసుకుంటోన్న పేద రైతులకే వాటిపై హక్కులు కల్పించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఇప్పటికే రాష్ట్రంలోని పేద రైతులు తమ అనుభవంలోని రెండు లక్షల ఎకరాలకు హక్కులు కల్పించాలని పోరాడుతున్నారని తెలిపారు. అన్యాక్రాంతం పేరుతో ప్రభుత్వం, మంత్రులు, ఎమ్మెల్యేలు, వారి కుటుంబీకులు ఈ భూములను లాగేసుకుంటున్నారని, పల్నాడు జిల్లాలోని చిలకలూరిపేట, పెదకూరపాడు, గురజాల నియోజకవర్గాలలో వేల ఎకరాల భూములు అన్యాక్రాంతం అయ్యాయని విమర్శించారు. పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటకు ఆదివారం వచ్చిన ఆయన స్థానిక కోటప్పకొండ రోడ్డులోని పల్నాడు విజ్ఞాన కేంద్రంలో విలేకర్లతో మాట్లాడారు. ఉమ్మడి రాష్ట్రంలో 25 లక్షల ఎకరాల ప్రభుత్వ, పోరంబోకు భూములు పేదలకు పంచడానికి వీలుగా ఉన్నట్లు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఏర్పాటు చేసిన కోనేరు రంగారావు కమిటీ నిర్ధారించిందని గుర్తు చేశారు. అయితే, వైసిపి కేవలం 50 వేల ఎకరాలే పంపిణీ చేస్తామని ప్రకటించడం విడ్డూరంగా ఉందని పేర్కొన్నారు. కాంగ్రెస్, టిడిపి, వైసిపి ప్రభుత్వాలు భూ పంపిణీ చేయలేదన్నారు. యడవల్లి దళిత సొసైటీ భూములను మైనింగ్ పేరిట కడపకు చెందిన ప్రభుత్వ పెద్దలకు మంత్రి రజని ప్రోత్సాహంతో లాక్కోవడానికి ప్రయత్నిస్తున్నారని, దీనికి వ్యతిరేకంగా సిపిఎం ఆధ్వర్యంలో దళితులు అలుపెరగని పోరాటం చేస్తున్నారని గుర్తు చేశారు. పరిశ్రమల పేరుతో ప్రభుత్వం లాగేసుకున్న లక్షల ఎకరాల భూములు అన్యాక్రాంతం అయ్యాయని, ఆ భూములను పేదలకు పంచకుంటే సిపిఎం ఉద్యమిస్తుందని హెచ్చరించారు. ప్రభుత్వ, పోరంబోకు, గ్రామకంఠం భూముల్లో ఏళ్ల తరబడి నివాసముంటున్న వారి నుంచి ఇంటి పట్టాల మంజూరు కోసం ఐదు లక్షలకుపైగా దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఆ నివాసాలు ఖాళీ చేయాలని, అమరావతి ప్రాంతంలో ఒక సెంటు స్థలం ఇస్తామని చెబుతోందని అన్నారు. ఇతర జిల్లాల నుండి ఉన్న ఇంటిని వదిలి అమరావతి ప్రాంతానికి వెళ్లి ఏం చేస్తారని ప్రశ్నించారు. కనీసం రాజధాని అమరావతిగా ప్రకటించి అభివృద్ధి పనులు చేపడితే పేదలకు కొంతమేర ఉపాధి లభించే అవకాశం ఉందన్నారు. నివాసం ఉంటున్న చోటే ఇంటి పట్టా ఇవ్వడంతోపాటు ఒకే ఇంట్లో ఎక్కువ కుటుంబాలున్న ఉంటే జగనన్న కాలనీలో ఇంటి స్థలాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. రాజధాని ప్రాంత పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వకుండా, భూములిచ్చిన రైతులకు కౌలు చెల్లించకుండా ప్రభుత్వ మోసం చేస్తోందన్నారు. చుక్కల భూముల సమస్యలు పరిష్కరిస్తామంటూ

మిగతా 2లో

రాజమహేంద్రవరంలో హేవలాక్ వంతెన వద్ద వరద నీటి ప్రవాహం



నీటితో కళకళలాడుతున్న శ్రీశైలం జలాశయం

శ్రీశైలానికి వరద ప్రవాహం

ప్రజాశక్తి- యంత్రాంగం

కృష్ణా నది ఎగువ పరివాహక ప్రాంతాలు మహారాష్ట్ర, కర్ణాటకలో కురుస్తున్న భారీ వర్షాల వల్ల శ్రీశైలం జలాశయానికి నీటి ప్రవాహం కొనసాగుతోంది. ఆదివారం సాయంత్రం ఏడు గంటల సమయానికి ఎగువ జూరాల నుంచి విద్యుత్ ఉత్పాదన అనంతరం 37,930 క్యూసెక్కుల నీరు శ్రీశైలం జలాశయానికి వచ్చి చేరుతోంది. అదే సమయానికి జలాశయ పూర్తి స్థాయి నీటిమట్టం 885 అడుగులకుగాను ప్రస్తుతం 809.10 అడుగులు ఉంది. నీటి నిల్వ సామర్థ్యం 215.8070 టిఎంసిలకుగాను ప్రస్తుతం 33.7658 టిఎంసిలుగా నమోదైంది. ప్రకాశం బ్యారేజీకి ఎగువ నుంచి 15,488 క్యూసెక్కుల నీరు వస్తోంది. తూర్పు డెల్టాకు 4,667 క్యూసెక్కులు, పశ్చిమ డెల్టాకు 1,366 క్యూసెక్కులు, గుంటూరు ఛానల్‌కు 81 క్యూసెక్కులు, సముద్రంలోకి 9,374 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ఖమ్మం, నల్గొండ జిల్లాల్లో భారీ వర్షాలతోపాటు పులిచింతల దిగువన, ప్రకాశం బ్యారేజి ఎగువన వర్షాలతో మున్నేరు నుంచి వరద ప్రవాహం వస్తోంది.

గోదావరికి మళ్లీ వరద

ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు, తెలంగాణాలోని ప్రాజెక్టుల్లో సామర్థ్యానికి మించి ఉన్న నీటిని దిగువకు వదలడంతో గోదావరికి క్రమంగా వరద పెరిగి మళ్లీ పెరుగుతోంది. వరద ఉధతి హెచ్చు తగ్గులు ఉన్నప్పటికీ పూర్తి స్థాయిలో తగ్గే వరకు గోదావరి పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విపత్తుల నివారణ సంస్థ కోరింది. ఆదివారం రాత్రి భద్రాచలం వద్ద 42.40 అడుగులు నమోదైంది. మొదట ప్రమాద హెచ్చరిక కొనసాగుతోంది. ధవళేశ్వరంలోని కాటన్ బ్యారేజీ వద్ద 10.90 అడుగుల నీటిమట్టం నమోదైంది. దీంతో, ఈ బ్యారేజీ నుంచి 8,63,562 క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి విడిచిపెడుతున్నారు. పంట కాలువలకు 12,100 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. కె.గంగవరం మండలం కోటిపల్లిలో లాంచీలరేవును, గోదావరి నదీ పరివాహక ప్రాంతంలో స్నానఘట్టాలను మూసేశారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్

మిగతా 2లో

ఢిల్లీ ఆర్డినెన్స్‌పై బిల్లును అనుమతించొద్దు

- రాజ్యసభ ఛైర్మన్‌కు ఆప్ లేఖ

న్యూఢిల్లీ : ఢిల్లీ పరిపాలనా కార్యకలాపాల నియంత్రణపై కేంద్రం తీసుకొచ్చిన ఆర్డినెన్స్‌కు సంబంధించిన బిల్లును రాజ్యసభలో ప్రవేశపెట్టడానికి అనుమతించవద్దని ఆప్ కోరింది. ఈ మేరకు ఆప్ ఎంపి రాఘవ్ చద్దా ఆదివారం రాజ్యసభ ఛైర్మన్ జగదీప్ ధన్‌ఖర్‌కు లేఖ రాశారు. మే 11న సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తీర్పు ప్రకారం ఢిల్లీలోని ప్రభుత్వంలో పనిచేస్తున్న సివిల్ సర్వెంట్లు ప్రజల చేత ఎన్నికైన ముఖ్యమంత్రి నేతృత్వంలోని మంత్రిమండలికి బాధ్యత వహించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

అందుకు భిన్నంగా లెఫ్టినెంట్ గవర్నర్‌కు పెత్తనం అప్పగించేలా ఉన్న కేంద్రం ఆర్డినెన్స్ రాజ్యాంగ విరుద్ధమని, అందుకు సంబంధించిన బిల్లును ఉపసంహరించుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరారు. పార్లమెంటు చేసే ఏదైనా చట్టం ఆర్టికల్ 239 ఎఎ నిబంధనలకు అనుబంధంగా ఉండాలని, ఆ నిబంధనలకు విరుద్ధమైన ప్రతిపాదిత బిల్లు పార్లమెంటులో చెల్లుబాటు కాదని తెలిపారు. ఈ బిల్లును ప్రవేశపెట్టడానికి అనుమతించవద్దని అభ్యర్థిస్తున్నట్లు లేఖలో పేర్కొన్నారు.

బిసివై పార్టీ ఆవిర్భావం

- ప్రజా సింహగర్జన సభలో ప్రకటించిన పార్టీ వ్యవస్థాపకులు రామచంద్ర యాదవ్
- వైసిపి పాలనలో సహజ వనరుల దోపిడీ
- బిసిలను విస్మరించిన టిడిపి

సభలో మాట్లాడుతున్న రామచంద్ర యాదవ్

ప్రజాశక్తి- మంగళగిరి రూరల్ (గుంటూరు జిల్లా)

రాష్ట్ర రాజకీయాల్లో మరో పార్టీ ఆవిర్భవించింది. భారత చైతన్య యువజన (బిసివై) పేరుతో పార్టీని ఏర్పాటు చేస్తున్నట్లు పార్టీ వ్యవస్థాపకులు బోడె రామచంద్ర యాదవ్ ప్రకటించారు. ప్రజా సింహగర్జన పేరుతో భారీ బహిరంగ సభను గుంటూరు జిల్లాలోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఎదుట ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎందరో వీరుల త్యాగ ఫలితంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడిందని, వనరులన్నీ ఉన్న రాష్ట్రం నేడు దీనావస్థలో ఉందని, రైతులు, యువత, మహిళలు ఇబ్బందులు అన్నీఇన్నీ కావని అన్నారు. రాష్ట్ర సంపద దోపిడీ చేసేందుకు, భూములను కాజేసేందుకు ప్రాజెక్టులు తెస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు తెలుగువారి ఆత్మగౌరాన్ని ఢిల్లీలో తాకట్టు పెట్టిందని, టిడిపి 20 ఏళ్ల పాలనలో వారికి వెన్నుదన్నుగా ఉన్న బిసిల అభ్యున్నతికి కృషి చేయలేదని విమర్శించారు. టిడిపి తన అనుయాయులకు భూమిని దోచిపెట్టడం కోసం తాత్కాలిక రాజధాని అమరావతి పేరుతో రాష్ట్ర ప్రజలను వంచించిందని, పోలవరం ప్రాజెక్టుకు తన కాంట్రాక్టర్ల లబ్ధి కోసం చంద్రబాబు వాడుకున్నారని దుయ్యబట్టారు. 50 శాతానికిపైగా ఉన్న బిసిలకు అదనపు రిజర్వేషన్లు ఇవ్వాలని కమిషన్లు చెప్పిన నాడు పట్టించుకోలేదని విమర్శించారు. వైసిపి ప్రభుత్వ హయాంలో ప్రయివేటు భూములు, ఆస్తులకు రక్షణ లేకుండా పోయిందని, గనులు, ఇసుక, ఎర్రచందనం దోపిడీకి గురవుతున్నాయని, మద్యం వ్యాపారంలో డిజిటల్ లావాదేవీలకు తావులేకుండా చేసి 50 శాతానికిపైగా డబ్బులు సిఎం ఇంటికి చేరుస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో కంపెనీలను నడిపించాలంటే 25 శాతం కప్పం ఎందుకు

మిగతా 2లో

సునీత వాంగ్మూలంపై సిఎం ఏం చెబుతారు?

- టిడిపి నేత బొండా ఉమా

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మాజీమంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్యకేసులో సునీత సిబిఐకి ఇచ్చిన వాంగ్మూలంపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఏం చెబుతారని టిడిపి పొలిట్ బ్యూరోసభ్యులు బొండా ఉమామహేశ్వరరావు ప్రశ్నించారు. టిడిపి కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వివేకా హత్యను టిడిపిపై నెట్టేసి జగన్ ఎన్నికల్లో లబ్ధి పొందారని, ఇప్పుడు ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. హత్యకేసు వ్యవహారం కొలిక్కివస్తున్న తరుణంలో ఇప్పటికీ వైఎస్ అవినాష్‌రెడ్డిని కాపాడేందుకు ప్రయత్నిస్తున్నారని నిలదీశారు. భారతి ద్వారా అవినాష్‌ను రక్షించడానికి జరిగిన ప్రయత్నమంతా జగన్ కనుసన్నల్లో జరిగిందేనని తెలిపారు. ముఖ్యమంత్రి హోదాను మరిచి జగన్ మాట్లాడడం తగదని టిడిపి పొలిట్ బ్యూరోసభ్యులు వర్ల రామయ్య తెలిపారు. చంద్రబాబుపై అనుచిత వ్యాఖ్యలతో కించపరిచేలా మాట్లాడటం సిఎం హోదాకు కళంకం అని పేర్కొన్నారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు. అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

'బైజూస్' భారం ఎవరు భరిస్తారు?

- వచ్చే ఏడాది ఉచితమేనా? కొంటారా?
- ప్రభుత్వాన్ని ప్రశ్నించిన పవన్‌కల్యాణ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రభుత్వ పాఠశాలల్లోని 8వ తరగతి విద్యార్థుల కోసం రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేసిన ట్యాబ్‌లకు సంబంధించిన 'బైజూస్' ఒప్పందంపై జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ఆదివారం ప్రశ్నల వర్షం కురిపించారు. రూ.580 కోట్లు ఖర్చు చేసి విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేసినట్లు ప్రభుత్వం పేర్కొందని తెలిపారు. అయితే రూ.750 కోట్ల విలువైన కంటెంట్‌ను సిఎస్ఆర్ కింద ఈ ట్యాబ్‌లలో ఉచితంగా అప్‌లోడ్ చేస్తామంటూ బైజూస్ సంస్థ ఒప్పందం చేసుకుందని రాష్ట్ర ప్రభుత్వం ఇదివరకే ప్రకటించిందని, మరి వచ్చే ఏడాది కూడా ఉచితంగానే కంటెంట్ ఇస్తారా లేదా రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందా? అని ఆయన ప్రశ్నించారు. ఒక వేళ కొనుగోలు చేస్తే రూ.750 కోట్ల కంటెంట్ భారాన్ని ప్రభుత్వమే భరిస్తుందా, వచ్చే ఏడాది కూడా రూ.580 కోట్లు ఖర్చు చేసి ట్యాబ్‌లు కొంటారా? అస్సలు ఒప్పందంలో వివరాలేమిటో బయటపెట్టాలని ఆయన డిమాండ్ చేశారు. బహిరంగ మార్కెట్లో ఒక్కో ట్యాబ్ విలువ రూ.18 నుంచి రూ.20 వేలు ఉంటోందని పవన్ తెలిపారు. బైజూస్ కంటెంట్ సిబిఎస్‌సి పాఠ్యాంశాలను ఆధారం చేసుకొని ఉంటోందని, అది కూడా ఆంగ్ల మాధ్యమంలో ఉంటోందని పవన్ పేర్కొన్నారు. ఇప్పటికైనా బైజూస్ ఒప్పందంపై ప్రభుత్వం సమాధానాలు ఇవ్వాలని కోరారు.

పవన్ వద్ద ట్యూషన్ తీసుకుంటా..

- ఆయనకు పాఠాలు చెప్పిన టీచర్లూ సిగ్గుపడతారు!
- జనసేనానిపై బొత్స వ్యంగ్యాస్త్రాలు

'బైజూస్'తో రాష్ట్ర ప్రభుత్వ ఒప్పందంపై జనసేన అధినేత పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలపై రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. 'ఈ రోజు నుండి పవన్ కళ్యాణ్ వద్ద ట్యూషన్ తీసుకుంటాను. కానీ ఒక షరతు. హోమ్‌వర్క్ చేస్తానని ఆయన హామీ ఇచ్చారు.. అందుకోసం ఆయనకు ముందుగా ఒక అసైన్‌మెంట్ ఇస్తున్నాను, ఏడు పాఠాలను క్షుణ్ణంగా చదవడమే నేటి అసైన్‌మెంట్' అంటూ బొత్స ఎద్దేవా చేశారు. 'మీ మెదడులో పదును పెంచేందుకు నేను ప్రత్యామ్నాయ ట్యూషన్లు ఇవ్వడానికి సిద్ధం' అని పవన్‌ను ఉద్దేవించి బొత్స ట్వీట్ చేశారు. పబ్లిక్ ప్రొక్యూర్‌మెంట్ టెండర్‌లకు సంబంధించినంత వరకూ అర్హత వుందా లేదా పరిధిని నిర్ణయించే అధికారాన్ని న్యాయాధికారికి అందించిన ప్రపంచంలోని ఏకైక ప్రభుత్వం మాప్రభుత్వమేనని బొత్స పేర్కొన్నారు. ప్రతీసారి ప్రజలను తప్పుదోవ పట్టించడానికి పవన్ కల్యాణ్ చేస్తున్న ప్రయత్నాలను చూసి ఆయనకు పాఠాలు చెప్పిన టీచర్లు కూడా సిగ్గుపడటం ఖాయమని మంత్రి పేర్కొన్నారు. అది చూసి తనకు కూడా పవన్ పట్ల జాలేస్తోందన్నారు.

ఉపాధ్యాయులపై ఒత్తిడి తగదు

- జెవికె కిట్లు పూర్తిస్థాయిలో అందించాలి
- యుటిఎఫ్ కార్యవర్గం డిమాండ్

యుటిఎఫ్ కార్యవర్గ సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

జగనన్న విద్యాకానుక (జెవికె) కిట్లను పూర్తిస్థాయిలో పంపిణీ చేయకుండానే.. విద్యార్థులకు అందజేసినట్లుగా వారిచేత బయోమెట్రిక్ అథంటిఫికేషన్ పూర్తిచేయాలని ఉపాధ్యాయులపై ఒత్తిడి చేయడం సరికాదని యుటిఎఫ్ పేర్కొంది. పాఠశాలల ప్రారంభం నాటికి కిట్లు ఇస్తామని చెప్పినా ఆచరణలో నేటికీ పూర్తిస్థాయి కిట్లు రాలేదని తెలిపింది. యుటిఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఆదివారం ఆ సంఘం రాష్ట్రకార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా యుటిఎఫ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎన్ వెంకటేశ్వర్లు, కెఎస్ఎస్ ప్రసాద్ మాట్లాడుతూ నూతన విద్యాసంవత్సరం ప్రారంభంలో యాప్‌ల భారం తగిస్తామని, ఒకే యాప్‌లో వివరాలన్నీ నమోదు చేసేలా చూస్తామని విద్యాశాఖ అధికారులు హామీ ఇచ్చారని పేర్కొన్నారు. యాప్‌లను కుదించకపోగా అదనంగా 'ప్రశస్త' అనే మరో యాప్‌ను తెచ్చారని తెలిపారు. పాఠశాల విద్యార్థుల ఆరోగ్యానికి సంబంధించిన సర్వేను జులై 29లోపు ముగించాలంటూ గడువు విధించడం కూడా సరికాదన్నారు. పాఠశాలకు రాని విద్యార్థులను డ్రాప్‌బాక్స్‌లో ఉంచి ఆ విద్యార్థులను పాఠశాలల్లోకి చేర్చుకోవాలని కూడా ఒత్తిడి చేస్తున్నారని తెలిపారు. అలా చేర్చుకున్న విద్యార్థులకు జెవికె అథంటిఫికేషన్ ఎందుకు పూర్తిచేయలేదంటూ ఉపాధ్యాయులను అధికారులు ఇబ్బందులకు గురి చేయడాన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని వెల్లడించారు.

అవసరమైన నిధులు సమకూర్చకుండా 'నాడు-నేడు' పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులు ఒత్తిడి తేవడం సరైంది కాదన్నారు. ఉపాధ్యాయులపై బోధనేతర పనుల భారం తగ్గించాలని డిమాండ్ చేశారు. పాఠశాలల ప్రారంభమైన జూన్ 12 నుంచి ఏదో ఒక శిక్షణ పేరుతో ఉపాధ్యాయులు బోధనేతర కార్యక్రమాల్లో ఉండాల్సివస్తోందన్నారు. ఎఫ్ఎ-1 పరీక్షల షెడ్యూల్‌ను మరో వారం రోజులు పొడిగించాలని కోరారు. ఇంగ్లీష్ మీడియంలోనే పరీక్షలు రాయాలని విద్యాశాఖ అధికారులు చెప్పడం సరికాదని అభ్యంతరం వ్యక్తం చేశారు. తెలుగు, ఇంగ్లీష్ మీడియాలలో ఏదో ఒక మీడియంలో రాసే విధంగా చూడాలని కోరారు. మున్సిపల్ అర్బన్ ఎంఇవో పోస్టులు మున్సిపల్ ఉపాధ్యాయులకే వచ్చే విధంగా ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. సర్వీస్ రూల్స్ త్వరగా ఆమోదించి బదిలీలు, ప్రమోషన్లు నిర్వహించాలన్నారు.

ఉపాధ్యాయులు ఎలాంటి ర్యాలీలు, నిరసనలో పాల్గొనకూడదని కడప డిఇవో ఇచ్చిన మెమోను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే కడప డిఇవో కార్యాలయం ముట్టడికి పిలుపునిస్తామని హెచ్చరించారు. ఎయిడెడ్ ఉపాధ్యాయుల రేషనలైజేషన్ పారదర్శకంగా నిర్వహించాలని, గిరిజన పాఠశాలల్లో పండిట్, పిఇటి పోస్టులను అప్‌గ్రేడ్ చేయాలని కోరారు.

పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, 2003 డిఎస్సి ఉపాధ్యాయులకు పాత పెన్షన్ అమలు చేస్తూ ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. కోర్టు ఉత్తర్వుల మేరకు 2008 డిఎస్సిలో ఎంపికై ప్రస్తుతం ఎంటిఎస్ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న వారిని రెగ్యులర్ చేయాలని కోరారు. చిత్తూరు జిల్లాలో 12 ఏళ్ల స్కేలు ఇవ్వడానికి డిపార్ట్‌మెంట్ టెస్ట్‌లు ఉత్తీర్ణత కావాలని చెప్పడం నిబంధనలకు విరుద్ధమని పేర్కొన్నారు. 12ఏళ్ల స్కేల్ వెంటనే మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, ఫెడరేషన్ సహాధ్యక్షులు కె సురేష్ కుమార్, ఎఎన్ కుసుమకుమారి, కోశాధికారి బి గోపిమూర్తి, కార్యదర్శులు లక్ష్మిరాజా, సిహెచ్ రవీంద్ర, డివి రాఘవులు, ఎన్ నవకోటేశ్వరరావు, ఎస్ఎస్ నాయుడు, ఎన్ నాగమణి తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్ ఘటనపై 25న కలెక్టరేట్ల వద్ద నిరసన

మణిపూర్‌లో జరుగుతున్న అల్లర్లు ప్రత్యేకించి మహిళలపై జరుగుతున్న మారణకాండను యుటిఎఫ్ తీవ్రంగా ఖండించింది. హింసాకాండని నిలువరించాలని, మహిళలపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ ఈ నెల 25వ తేదిన అన్ని జిల్లా కలెక్టరేట్ల వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించాలని యుటిఎఫ్ పిలుపునిచ్చింది. మణిపూర్‌లో సంఘ్ పరివార్ సాగిస్తున్న అరాచక దాడుల పట్ల తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.

అసైన్డ్ చట్ట సవరణలపై రాష్ట్ర వ్యాప్త ఆందోళనలు

- ఆగస్టులో ప్రజాసంఘాలతో చర్చా వేదికలు
- రౌండ్‌టేబుల్ సమావేశంలో నిర్ణయం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

దళితుల భూములను పెత్తందార్లకు కట్టబెట్టడానికే అసైన్డ్ చట్టానికి ప్రభుత్వం అన్యాయంగా సవరణలు చేసిందని, 9/77 చట్టాన్ని కాపాడుకునేందుకు రాష్ట్ర వ్యాప్త ఐక్య ఉద్యమాలు చేపట్టాలని పలు ప్రజాసంఘాలు నిర్ణయించాయి. ఈ మేరకు ఆదివారం విజయవాడలోని మాకినేని బసవ పున్నయ్య విజ్ఞానకేంద్రంలో దళిత, వ్యవసాయ కార్మికసంఘం, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. డిబిఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షులు కొరివి వినయ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో అసైన్డ్ చట్ట సవరణలను వ్యతిరేకిస్తూ ఏకగ్రీవంగా తీర్మానం చేయడంతో పాటు ఉద్యమకార్యాచరణను నిర్ణయించారు. ఆగస్టులో రాష్ట్ర వ్యాప్త దళిత రక్షణ ప్రజాసంఘాలతో చర్చావేదికలు ఏర్పాటు చేయడం, అధికారులను కలిసి అర్జీలు ఇవ్వాలని నిర్ణయించారు. అప్పటికీ ప్రభుత్వం దిగిరాకపోతే ఆందోళనలు చేపట్టాలని సమావేశం తీర్మానించింది. ఈ సమావేశంలో ప్రజాసంఘాల నాయకులు మాట్లాడుతూ అసైన్డ్ భూములను ప్రభుత్వమే కొనుగోలు చేసి దళితులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. 2013 భూ సేకరణ చట్టం కింద నష్టపరిహారం ఇవ్వాలని, రాష్ట్రంలో మిగులు భూములను భూమిలేని దళిత, గిరిజన పేదలకు ఇవ్వాలన్నారు. రౌండ్‌టేబుల్ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి వెంకటేశ్వర్లు, డిబిఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి మేళం భాగ్యరావు, మాదిగ రిజర్వేషన్ పోరాట స మితి ఛైర్మన్ పేరుపోగు వెంకటేశ్వరరావు, కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంద్రమాల్యాద్రి, రెల్లి సంక్షేమ సంఘం నాయకులు నాగేంద్ర, సునీల్‌కుమార్, చెంగయ్య, జార్జ్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు కోట కళ్యాణ్, అప్పల స్వామి పాల్గొన్నారు.

పొగాకు గిట్టుబాటు ధరకు కృషి

- యువగళం పాదయాత్రలో లోకేష్

ప్రజాశక్తి-పొదిలి (ప్రకాశం జిల్లా)

పొగాకు రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు ఎఫ్‌డిఐలను తీసుకొచ్చేందుకు కృషి చేస్తామని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ హామీ ఇచ్చారు. యువగళం పేరుతో లోకేష్ చేపట్టిన పాదయాత్ర ఆదివారం ప్రకాశం జిల్లా పొదిలి తలమళ్ల క్యాంపు నుంచి ప్రారంభమైంది. క్యాంపు వద్ద పొగాకు రైతులతో లోకేష్ ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. ఫారిన్ డైరెక్ట్ ఇన్‌వెస్ట్‌మెంట్ వస్తే పొగాకు రైతుకు మంచి రేటు వస్తుందని, పంటకు ఇన్స్యూరెన్స్ లేకపోవడం వలన అకాల వర్షాలతో అనేక ఇబ్బందులు పడుతున్నామని వివరించారు. లోకేష్ మాట్లాడుతూ.. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే కేంద్రం ఇచ్చే సహాయంతో సంబంధం లేకుండా అన్నదాత సుఖీభవ పథకం కింద ప్రతి రైతుకు రూ.20 వేల సాయం అందిస్తామని తెలిపారు. గతంలో టిడిపి అధికారంలో ఉన్నప్పుడు రూ.50 వేలలోపు రైతు రుణాలు అన్ని మాఫీ చేశామని గుర్తు చేశారు. పొగాకు రైతుల పెట్టుబడి తగ్గించేందుకు డ్రిప్ ఇరిగేషన్, ఎరువులపై రుణాలు అందిస్తామని హామీనిచ్చారు.

హింసకు కారణమైతే మూసేయడం మంచిది

- దేవాలయాలపై మద్రాస్ హైకోర్ట్ వ్యాఖ్య

చెన్నయ్ : హింసకు దేవాలయాలే కారణమైతే వాటిని మూసేయడమే మంచిదని మద్రాస్ హైకోర్ట్ వ్యాఖ్యానించింది. దేవాలయ ఉత్సవం విషయంలో రెండు మత సంస్థల మధ్య నెలకొన్న వివాదంపై విచారణ జరుపుతున్న సందర్భంగా కోర్టు ఈ వ్యాఖ్య చేసింది. మత సంస్థలు తమ ఆధిపత్యాన్ని ప్రదర్శించడానికి దేవాలయ ఉత్సవాలను ఉపయోగించుకుంటున్నాయని న్యాయమూర్తి జస్టిస్ ఆనంద్ వెంకటేష్ అన్నారు. 'ఉత్సవాల నిర్వహణలో భక్తి ఏమీ లేదు. పైగా మత సంస్థలు బల ప్రదర్శన కోసం వీటిని ఉపయోగించుకుంటున్నాయి' అని ఆయన అసహనం వ్యక్తం చేశారు. మయిలదుత్తురై నగరంలోని అమ్మవారి దేవాలయంలో ఉత్సవ నిర్వహణకు పోలీసు రక్షణ కల్పించాలంటూ దాఖలైన పిటిషన్‌ను న్యాయస్థానం తోసిపుచ్చింది. దేవాలయానికి వంశపారంపర్య ధర్మకర్తగా చెప్పుకుంటున్న తంగరసు ఈ పిటిషన్ దాఖలు చేశారు. వారం రోజుల పాటు జరిగే ఉత్సవం సందర్భంగా అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకునే అవకాశం ఉన్నందున పోలీసు రక్షణ కల్పించాలని ఆయన కోరారు. ఉత్సవం సమయంలో దేవాలయంలోని విగ్రహాన్ని ఎవరు ఊరేగించాలన్న విషయంపై మత సంస్థల మధ్య వివాదం చెలరేగింది. సమస్యను పరిష్కరించడంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన శాంతి కమిటీ విఫలమైంది. ఈ నేపథ్యంలో ఉత్సవం నిర్వహిస్తే శాంతి భద్రతల సమస్య ఉత్పన్నమవుతుందని తమిళనాడు ప్రభుత్వం కోర్టుకు తెలిపింది. పోలీసులు తమ విలువైన సమయాన్ని రెండు మత సంస్థల మధ్య నెలకొన్న వివాదాన్ని పరిష్కరించేందుకు వృథా చేయకూడదని విచారణ సందర్భంగా న్యాయమూర్తి వ్యాఖ్యానించారు.

పోలీసు కస్టడీలో ఉన్న కుకీ యువకుడి దారుణ హత్య

- మణిపూర్‌లో మరో ఘాతుకం

ఇంఫాల్ : మణిపూర్‌లో జరుగుతున్న దారుణాలు ఒక్కొక్కటీ వెలుగులోకి వస్తున్నాయి. పోలీసుల కస్టడీలో ఒక యువకుడ్ని లాక్కుని మరీ సాయుధ గూండాలు తీవ్రంగా కొట్టి హత్య చేశారు. మే 4న ఈ దారుణం జరిగింది. ముఖ్యమంత్రి బీరేన్ సింగ్‌కు వ్యతిరేకంగా సోషల్ మీడియాలో పోస్టులు చేసినందుకు చురచందర్‌పూర్ జిల్లాలో 21 ఏళ్ల హంగ్లాల్‌మువాన్‌ను పోలీసులు అరెస్టు చేశారు. ఇతన్ని కోర్టులో హాజరుపర్చి సాజివా జైలుకు తీసుకుని వెళుతుండగా పోరంపట్ ప్రాంతంలో సాయుధ దుండగులు అడ్డుకున్నారు. పోలీసుల నుంచి ఆయుధాలను స్వాధీనం చేసుకుని, మువాన్‌ను కూడా తమ ఆధీనంలోకి తీసుకున్నారు. వారికి భయపడి పోలీసులు తలా ఒకవైపునకు పారిపోయారు. మువాన్‌ను దుండగులు దారుణంగా చనిపోయే వరకూ కొట్టారు. ఈ ఘటనపై పోరంపట్ పోలీస్ స్టేషన్‌లో అల్లర్లు, హత్య వంటి సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్ నమోదయింది. ఎఫ్ఐఆర్ నమోదైన రెండు రోజుల్లో దీనిపై ఎన్‌హెచ్‌ఆర్‌సికి ఫిర్యాదు చేశారు. దీనిని కస్టడీ మృతిగా గుర్తించింది. రాష్ట్ర ప్రభుత్వానికి, ఎస్‌హెచ్‌ఆర్‌సికి నోటీసులు జారీ చేసింది. ఇప్పటి వరకూ నిందితులు ఎవ్వరినీ అరెస్టు చేయలేదు.

మహిళలపై లైంగిక వేధింపులు అమానుషం : ఐరోమ్ షర్మిల

కోల్‌కతా : మహిళలను వివస్త్రలను చేసి, ఊరేగించిన ఘటన అమానుషమని పౌర హక్కుల కార్యకర్త ఐరోన్ షర్మిల అన్నారు. శనివారం బెంగళూరులో పిటిఐకి ఆమె ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ ఘటన వీడియో చూసి కన్నీళ్లు ఆపుకోలేకపోయానని అన్నారు. పరిస్థితిని చక్కదిద్దడానికి ప్రధాని జోక్యం చేసుకోవాలని కోరారు. సిఎం బీరేన్‌సింగ్ తన వైఫల్యాన్ని అంగీకరించి, ప్రజలకు క్షమాపణ చెప్పాలని అన్నారు. మణిపూర్‌లో రాష్ట్రప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. మణిపూర్‌లో రాష్ట్రప్రభుత్వం పరిస్థితిని అదుపు చేయలేనప్పుడు ప్రధాని ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు.

మణిపూర్‌లో పౌర సమాజంపై దేశద్రోహం, పరువునష్టం కేసులు..

ఇంఫాల్ : మణిపూర్‌లోని పౌర సమాజం 'కోఆర్డినేషన్ కమిటీ ఆఫ్ మణిపూర్ ఇంటెగ్రిటీ (సిఒసిఒఎంఐ - కొకొమి)'పై దేశద్రోహం, పరువునష్టం కేసులు దాఖలయ్యాయి. అస్సాం రైఫిల్స్ ఫిర్యాదు మేరకు ఈ కేసులను నమోదు చేసినట్లు అధికారులు ఆదివారం తెలిపారు. "ఆయుధాలను అప్పగించవద్దని" ప్రజలకు పిలుపునివ్వడంతో జులై 10న కొకొమిపై ఎఫ్ఐఆర్ నమోదైనట్లు రక్షణ శాఖ వర్గాలు తెలిపాయి. ఐపిసి సెక్షన్ 124 ఎ దేశద్రోహం కింద, సెక్షన్ 153 ఎ ప్రకారం మతం, జాతి, పుట్టిన ప్రదేశం, నివాసం, భాష మొదలైన వాటి ఆధారంగా వివిధ సమూహాల మధ్య శతృత్వాన్ని ప్రోత్సహించడం కింద కేసులు నమోదైనట్లు తెలిపారు. చురచంద్‌పూర్ పోలీస్ స్టేషన్‌లో కొకొమి కన్వీనర్ జితేంద్ర నింగోంబాపై ఎఫ్ఐఆర్ నమోదైనట్లు ఆ వర్గాలు తెలిపాయి.

జూన్ 30న బిష్ణుపూర్‌లోని మొయిరాంగ్‌లో పలువురు మహిళా ఆందోళనకారులపై సైన్యం దాడి చేసినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. అస్సాం రైఫిల్స్ స్థానంలో ఏదైనా ఇతర కేంద్ర సాయుధ పోలీసు బలగాలను నియమించాలని డిమాండ్ చేస్తూ కొకొమి జూన్ 4న కేంద్ర హోం మంత్రికి ఒక మెమొరాండం సమర్పించింది. స్థానిక యువకులు ఆయుధాలను సమర్పించేందుకు సిద్ధంగా లేరని పేర్కొంది. వాస్తవానికి కొకొమి జూన్‌లో రాష్ట్ర గవర్నర్ అనుసూయిూ ఉయికే నియమించిన శాంతి కమిటీలో భాగంగా ఉంది. డ్రగ్స్ ఉగ్రవాదులు, మయన్మార్ నుండి వచ్చే అక్రమ వలసదారులపై చర్య తీసుకునే వరకు శాంతి కమిటీలో పాల్గొనేందుకు నిరాకరించింది. మే 3న రాష్ట్రంలో హింసాకాండ నెలకొన్న అనంతరం దుండగులు పోలీస్ స్టేషన్ల నుండి 4,000కు పైగా ఆయుధాలను, లక్షల కొద్దీ మందుగుండు సామగ్రిని దోచుకున్న సంగతి తెలిసిందే.

శ్రీశైలానికి వరద ప్రవాహం

మొదటి పేజీ తరువాయి

కోనసీమ జిల్లా మలికిపురంలోని దిండి రిసార్ట్స్ బోట్లను నిలిపివేశారు. మామిడికుదురు మండలం అప్పనపల్లి, పెదపట్నం లంక మధ్య పాటరేవు ప్రాంతం నీటమునిగింది. పాశర్లపూడి కరకట్ట దిగువన కాజ్‌వేకు ఇరువైపులా వరద నీరు చేరింది. కోనసీమ జిల్లా రాజోలులో ఏటిగట్టు చెంతన ఉన్న పార్కులోకి వరద నీరు చేరింది.

వరద నీరు వరద ఉధృతి పెరిగే అవకాశం ఉందని సిడబ్ల్యుసి అధికారులు అంచనా వేస్తుండడంతో అల్లూరి సీతారామరాజు జిల్లాలోని విఆర్.పురం, కూనవరం, చింతూరు, ఎటపాక మండలాల ప్రజలు భయాందోళన చెందుతున్నారు. చింతూరు వద్ద శబరి వద్ద నీటిమట్టం 28 అడుగులకు చేరింది. ఎగువన వర్షాలు కురుస్తుండడం, గోదావరి, శబరిల్లో నీరు పెరగడంతో ఈ మండలంలోని ముకునురు, ఎజి.కొడేరు, పెద్ద సీతనపల్లి, కుమ్మూరు పంచాయతీలు సహా విఆర్ పురం మండలంలోని కుందులూరు గ్రామ పంచాయతీలో ఉన్న 20 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. విఆర్.పురం మండలం వడ్డుగూడేనికి చెందిన పోరుతుల వెంకటరమణ మాట్లాడుతూ తమ గ్రామం చుట్టూ నీరు రావడంతో రేఖపల్లి వచ్చి గుడారాలు వేసుకున్నామని, ప్రభుత్వం నుంచి ఎటువంటి సాయమూ అందలేదని వాపోయారు. బరకాలు, కిరోసిన్, బియ్యం, కూరగాయలు ఇవ్వాలని కోరారు. విషపురుగుల మధ్యనే జీవిస్తున్నామని 'ప్రజాశక్తి'కి తెలిపారు. కూనవరం మండలంలోని కూనవరం, టేకులబోరు గ్రామాల్లోకి నీరు రావడంతో ప్రజలు పునరావాస కేంద్రాలకు వెళ్లారు. పోలవరం ప్రాజెక్టు నుండి తొమ్మిది లక్షల క్యూసెక్కుల వరద జలాలను దిగువకు విడుదల చేసినట్లు ప్రాజెక్టు అధికారి పి.వెంకటరమణ తెలిపారు. పోలవరం ప్రాజెక్టు స్పిల్ వే ఎగువన 32.180, దిగువన 23.780, ఎగువ కాపర్ డ్యామ్ వద్ద 32.950, దిగువ కాఫర్ డ్యాం వద్ద 23.250 మీటర్ల నీటిమట్టం నమోదైంది. పోలవరంలో గోదావరి నీటిమట్టం 22.687 మీటర్లకు చేరుకుంది. పోలవరంలో గోదావరి నీటిమట్టం గంటకు రెండు మీటర్ల చొప్పున పెరుగుతోందని సిడబ్ల్యుసి అధికారులు తెలిపారు. కుక్కునూరు మండలంలోకి వరద నీరు భారీగా చేరుతోంది. కుక్కునూరు మండలం ముత్యాలంపాడు, వింజరం మధ్యగల పాలవాగు కాజ్‌వేను వరద ముంచెత్తడంతో ముత్యాలంపాడు, కౌండిన్యముక్తి గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఎప్పటికప్పుడు వరద ప్రవాహాన్ని పర్యవేక్షిస్తూ సంబంధిత జిల్లాలకు సూచనలను జారీ చేస్తున్నామని రాష్ట్ర విపత్తుల సంస్థ తెలిపింది. అత్యవసర సహాయక చర్యల కోసం కూనవరం, పి గన్నవరంలో రెండు ఎన్‌డిఆర్ఎఫ్ బృందాలను సిద్ధంగా ఉంచామని పేర్కొంది. మామిడికుదురు, అయినవిల్లి, కుకునూరు, వేలేరుపాడులో నాలుగు ఎన్‌డిఆర్ఎఫ్ బృందాలు సిద్ధంగా ఉన్నాయని తెలిపింది,

మూడు రోజులపాటు వర్షాలు : వాతావరణ శాఖ

రాష్ట్ర వ్యాప్తంగా మరో మూడు రోజులపాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. ఐఎండి అంచనా మేరకు సోమవారం వాయువ్య బంగాళాఖాతంలో ఆవర్తనం ఏర్పడే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎండి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. బంగాళాఖాతంలో ఏర్పడిన ఆవర్తన ప్రభావంతో 24 గంటల్లో అదే ప్రాంతంలో అల్పపీడనం ఏర్పడనున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో ఆదివారం అత్యధికంగా విశాఖపట్నం రూరల్ మండలాల్లో 91 మిల్లీమీటర్లు, విజయనగరం జిల్లా కొత్తవలసలో 60, పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేటలో 59, శ్రీకాకుళం జిల్లా హీరమండలంలో 58 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

ఇద్దరు కాశ్మీరీ రచయితల రచనల తొలగింపు

శ్రీనగర్: విమర్శకుల ప్రశంసలు పొందిన ఇద్దరు కాశ్మీరీ రచయితల రచనలను కాశ్మీర్‌లోని రెండు ప్రముఖ విశ్వవిద్యాలయాలు వివరణ లేకుండా పాఠ్యాంశాల నుంచి తొలగించాయి. లోయలోని ప్రధాన ఉన్న విద్యా సంస్థగా ఉన్న యూనివర్శిటీ ఆఫ్ కాశ్మీర్ (యూఓకే) ఆంగ్లంలో పోస్ట్-గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్ పాఠ్యాంశాల నుంచి రచయిత, పాత్రికేయుడు బషరత్ పీర్ జ్ఞాపకాలతో పాటు కాశ్మీరీ-అమెరికన్ కవి అఘా షాహిద్ అలీ మూడు కవితలను తొలగించింది. షాహిద్ ప్రసిద్ధ పద్యాలు 'పోస్ట్‌కార్డ్ ఫ్రమ్ కాశ్మీర్', 'ఇన్ అరబిక్', 'ది లాస్ట్ సఫ్రాన్', పీర్‌కు చెందిన 'కర్ఫ్యూడ్ నైట్' విశ్వవిద్యాలయంలో మాస్టర్స్ ఆఫ్ ఆర్ట్స్ (ఇంగ్లీష్) కోర్సు యొక్క మూడో సెమిస్టర్‌లో బోధించబడ్డాయి. అయితే, ఈ ఏడాది నుంచి ఇవి పాఠ్యాంశాల్లో భాగంగా ఉండవని విశ్వవిద్యాలయానికి చెందిన వర్గాలు తెలిపాయి. మార్చిన సిలబస్ త్వరలో అందుబాటులోకి వస్తుందని వెల్లడించాయి.

దీక్షా శిబిరంలో కూర్చున్న పోరాట కమిటీ నాయకులు, ఉక్కు కార్మికులు

స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణతో రాష్ట్రానికి తీవ్ర నష్టం

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

వైజాగ్ స్టీల్‌ప్లాంట్ అమ్మకంతో రాష్ట్రానికి తీవ్ర నష్టం వాటిల్లుతుందని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్లు డి ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్ అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు ఆదివారానికి 892వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షల్లో ఐఎన్‌టియుసి కార్యకర్తలు కూర్చున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేసేందుకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కుట్రలను తీవ్రతరం చేసిందని అన్నారు. దేశ ఖజానాకు పన్నుల రూపంలో క్రమం తప్పకుండా వేల కోట్ల రూపాయలను చెల్లిస్తున్న ప్రభుత్వ రంగ సంస్థలు దేశానికి మూల స్తంభాలువంటివని తెలిపారు. వేలాది మందికి ఉపాధి కల్పిస్తూ, రాష్ట్ర ప్రగతిలో కీలకపాత్ర పోషించిన స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. సొంత గనులు కేటాయించి, పూర్తి సామర్థ్యంతో ప్లాంట్‌ను నడిపేంత వరకూ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. దీక్షలకు విశ్రాంత ఉద్యోగి మన్యం బాబూరావు మద్దతు తెలిపారు. పోరాట కమిటీ కన్వీనర్ కెఎస్ఎన్ రావు, నాయకులు వరసాల శ్రీనివాసరావు, కారు రమణ, పివి రమణమూర్తి, నాగిరెడ్డి, నగేష్, ఎంఎస్ఆర్ ప్రసాద్, కొవిరి అవతారం, గంగవరం గోపి, బైరెడ్డి రమణ, బి కృష్ణ, అప్పారావు, సత్తయ్య, ఎల్లాజీ పాల్గొన్నారు.

రూ.25 వేల గౌరవ వేతనం ఇవ్వాలి

- ఎపి రేషన్ డీలర్ల మహాసభ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని రేషన్ డీలర్లకు గ్రామీణ ప్రాంతంలో రూ.20 వేలు, అర్బన్ ప్రాంతాల్లో అయితే రూ.25 వేలు గౌరవ వేతనంగా ఇవ్వాలని ఎపి రేషన్ డీలర్ల మహాసభ డిమాండ్ చేసింది. ఆదివారం విజయవాడలో ఆంధ్రప్రదేశ్ రేషన్ డీలర్ల మహాసభ జరిగింది. తమపై రాజకీయ కక్ష సాధింపులను నివారించాలని, కమీషన్‌ను పెంచాలని, అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజన పథకానికి బియ్యం పంపిణీ బిల్లులను చెల్లించాలని, హెల్త్ కార్డులను ఇవ్వాలని కోరింది. రాష్ట్రంలోని 29,793 మంది డీలర్లకు భద్రతను కల్పించాలని మహాసభ తీర్మానించింది. ఈ మహాసభకు రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. డీలర్ల సమస్యల పరిష్కరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా వుందని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు, రేషన్ డీలర్ల సంఘం నాయకులు టి చిట్టిరాజు, పసుపులేటి శివప్రసాద్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

బిసిపై పార్టీ ఆవిర్భావం

మొదటి పేజీ తరువాయి

కట్టాలని ప్రశ్నించారు. 75 శాతానికిపైగా ఉన్న ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీలను ఎదగనీయకుండా గత పాలకులందరూ పాలన సాగించారని, ఆ రాజకీయాలకు చరమగీతం పాడాలని కోరారు.

ఈ సందర్భంగా పార్టీ లక్ష్యాలను రామచంద్ర యాదవ్ ప్రకటించారు. ప్రాథమిక విద్య నుండి ఇంటర్మీడియట్ వరకు పూర్తి ఉచిత విద్య, మహిళల ఉన్నత చదువులు ఉచితంగా అందిస్తామని, సోమవారం నుండి శుక్రవారం వరకు విద్యా బోధన, శనివారం క్రీడలకు అవకాశం కల్పిస్తామని అన్నారు. కార్పొరేట్ వైద్యం పేరుతో జరుగుతున్న దోపిడీని అరికట్టి ఉచిత వైద్యం ప్రభుత్వ, ప్రయివేటు ఆస్పత్రుల్లో అందేలా ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తామని వివరించారు. రైతులను ఆదుకునేందుకు, కౌలు రైతులకు ఆర్థిక సహాయం అందించేందుకు కృషి చేస్తామన్నారు. అప్పుల ఊబి నుండి బయటపడేసేందుకు పంటల రుణమాఫీ చేస్తామని, రైతుల ఆత్మహత్యలను నివారిస్తామని, వ్యవసాయ రంగంలో సమూల మార్పులు తెచ్చేందుకు రెగ్యులేటరీ విధానాన్ని తెస్తామని, 25 శాతం సబ్సిడీపై ఎరువులను అందిస్తామని హామీ ఇచ్చారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు, వలసలను నివారించేందుకు ప్రత్యేక వ్యవస్థను రూపొందిస్తామని, చైనా తరహాలో చిన్న తరహా పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేయడంతోపాటు ప్రతి ఇంటి నుండి ఉత్పత్తులు, ఉపాధి అందేలా ప్రత్యేక చర్యలు చేపడతామన్నారు. సిపిఎస్ రద్దు చేస్తామని, వారానికి ఐదు రోజులే పనిదినాలు ఉండేలా చూస్తామని హామీ ఇచ్చారు. పార్టీ ఆవిర్భావం తర్వాత నిరుద్యోగ సమస్య పరిష్కారానికి, వలసల నివారణకు మేఫ్గా జాబ్ మేళా మొట్టమొదటి కార్యక్రమంగా నిర్వహించబోతున్నామని ప్రకటించారు. తొలుత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ మనవడు ప్రకాశ్ అంబేద్కర్, బిపి మండల్ మనవడు సూరజ్ మండల్ ప్రసంగించారు. పార్టీ జెండాను రామచంద్ర యాదవ్ ఆవిష్కరించారు.

పార్టీ ఏదైనా ప్రత్యర్థి వేణునే

మొదటి పేజీ తరువాయి

మంత్రి వేణు దూరం పెడుతూ వచ్చారు. ఇదిలా ఉండగా, ఇటీవల బోసు కుమారుడు రాజకీయాల్లోకి వచ్చారు. ఆయనకు టికెట్ కేటాయించాలంటూ బోసు అనుచరులు ఇటీవల ఆత్మీయ కలయిక పేరుతో రామచంద్రపురంలో సమావేశం నిర్వహించారు. మంత్రి వేణుపై పలు ఆరోపణలు చేశారు. స్థానికేతరుడు అంశాన్ని లేవనెత్తింది. ఈ సమావేశానికి కౌంటర్‌గా మంత్రి వేణు ఆదివారం కార్యకర్తల ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఏదేమైనా కార్యకర్తలతోనే ఉంటానని, వచ్చే ఎన్నికల్లో ఇక్కడ నుంచే పోటీ చేస్తానని తెలిపారు. ఇదే సమయంలో బోసు ప్రెస్‌మీట్ నిర్వహించడంతో రామచంద్రపురం రాజకీయం మరింత వేడెక్కింది.

స్వాతంత్ర్య సమరయోధుడి భార్య సజీవ దహనం

మొదటి పేజీ తరువాయి

2.10 గంటల సమయంలో మేము భయపడి పారిపోయాం. అదే సమయంలో మా అత్తగారు ఇబెటొంబిని కూడా రావాలని పట్టుబట్టాం. ముందు మీరు భద్రంగా వెళ్లండి. ఆ తరువాత రక్షించేందుకు ఎవరైనా ఒకరిని పంపండి. అని ఆమె చెప్పారు. దీంతో మేము వెళ్లి స్థానిక ఎమ్మెల్యే వద్ద ఆశ్రయం పొందాం. తెల్లవారుజామున 5.30-6 గంటలకు మా అబ్బాయిలు వెళ్లేటప్పటికి ఇల్లు పూర్తిగా కాలిపోయింది. ఆమె సజీవ దహనమైపోయారు' అని చెప్పారు. హింసాకాండలో తమ ఆత్మీయులని కోల్పోయిన కుటుంబాలు, తమ కళ్ల ముందు జరిగిన ఘోరాల నుంచి కోలుకోలేకపోతున్నారు. ఇప్పటికీ తమ నివాసాలకు తిరిగి వెళ్లాలంటేనే గ్రామస్తులు భయపడిపోతున్నారు.

సాగుదార్లకే అసైన్డ్ భూములపై హక్కులు

మొదటి పేజీ తరువాయి

జిఒల మీద జిఒలు ఇస్తున్నా, క్షేత్రస్థాయిలో పరిష్కారం కావడం లేదని తెలిపారు. ఎకరాకు రూ.లక్షకుపైగా రెవెన్యూ అధికారులు మామూళ్లు అడుగుతున్నట్లు తమ దృష్టికొచ్చిందన్నారు. దేవాదాయ భూములను పెత్తందారులు, అధికార పార్టీ నాయకులు తక్కువ లీజుకు వేలంలో పాడుకుని సాగుదారులకు అధిక కౌలుకు ఇస్తున్నారని తెలిపారు. పల్నాడు జిల్లా అభివృద్ధికి కీలకమైన వరికపూడిశెల ప్రాజెక్టును అన్ని రాజకీయ పార్టీలూ తమ స్వార్థ రాజకీయాలకు వాడుకుంటున్నాయని, ఇద్దరు ముఖ్యమంత్రులు శంకుస్థాపన చేసినా పనులు ముందుకు సాగలేదని విమర్శించారు. ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి కూడా మరోసారి శంకుస్థాపన చేసేందుకు సిద్ధమవుతున్నారని, అలా కాకుండా పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి పౌరస్మృతి పేరుతో అన్ని మతాల్లోని మహిళలనూ అణచివేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్రలు చేస్తోందని విమర్శించారు. దీన్ని అన్ని రాజకీయ పార్టీలూ వ్యతిరేకించాలని కోరారు. దేశం మొత్తమ్మీద మతోన్మాద విధానాలను రుద్దడానికి ఆర్ఎస్ఎస్, బిజెపి యత్నిస్తున్నాయని దుయ్యబట్టారు. మణిపూర్‌లో ఘటనపై కేంద్రం దారుణంగా వ్యవహరిస్తోందన్నారు. దీనిపై పార్లమెంట్‌లో అన్ని రాజకీయ పార్టీలూ కేంద్రాన్ని నిలదీయాలని కోరారు. మహిళలపై దారుణ హింసకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు వి.కృష్ణయ్య, పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ఆదివాసీ మహిళలకు రక్షణ కరువు

- రక్షించలేని ప్రభుత్వాలకు పాలించే అర్హత లేదు
- మణిపూర్ ఘటనను నిరసిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు, రౌండ్‌టేబుల్ సమావేశాలు

అరుకులో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న ఏపి ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర

కర్నూలులో జరిగిన జనకవనంలో ప్రసంగిస్తున్న విరసం నాయకులు నాగేశ్వరచారి, వేదికపై సాహితీస్రవంతి రాష్ట్ర అధ్యక్షులు కెంగార మోహన్, కార్యదర్శి జంధ్యాల రఘుబాబు

ప్రజాశక్తి - యంత్రాంగం

మణిపూర్‌లో ఆదివాసి మహిళలను వివస్త్రను చేసి ఊరేగించిన నిందితులను కఠినంగా శిక్షించాలని, మహిళలపై దాడులను నిరసిస్తూ ఆదివారం ఐద్వా, ఎపి ఆదివాసి గిరిజన, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు, మానవహారాలు, రౌండ్‌టేబుల్ సమావేశాలు, కొవ్వొత్తులతో ప్రదర్శనలు నిర్వహించారు. మణిపూర్ అల్లర్లను అరికట్టడంలోనూ, ఆదివాసీ మహిళలకు భద్రత కల్పించడంలోనూ విఫలమైన ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి రాజీనామా చేయాలని పలువురు నాయకులు డిమాండ్ చేశారు. కర్నూలులో జనకవనం నిర్వహించారు.

అరకులోయలో ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యాన రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది.ఈ సమావేశంలో గిరిజన మహిళా సంఘం, నేర నిరోధక సంఘం, యుటిఎఫ్, ఎపిటిఎఫ్ పిర్‌టియు, దండకారణ్య సంఘం, ఎపిఎస్, ఆదివాసీ కాఫీ రైతు సంఘం, ట్రైబల్ జర్నలిస్టుల సంఘం, ఎస్ఎఫ్ఐ, ఆదివాసీ మాతృభాషా సంఘం నాయకులు పాల్గొన్నారు. ఎపి ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర మాట్లాడుతూ.. ఆదివాసీ మహిళలను వివస్త్రలను చేసి ఊరేగించిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. మణిపూర్ ఇంత ఘోరం జరుగుతున్నా ప్రధాని మోడీ పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. మణిపూర్ అల్లర్లను అరికట్టడంలోనూ, ఆదివాసీ మహిళలకు భద్రత కల్పించడంలోనూ విఫలమైన ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. మణిపూర్‌లోని అమానవీయ ఘటనలు మానవత్వానికి మాయని మచ్చ అని అన్నారు. అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో సాహితీవేత్తల సమావేశం జరిగింది. మణిపూర్ హింసాకాండను, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్య వైఖరిని ఈ సమావేశం ఖండిస్తూ తీర్మానం చేసింది. సాహితీ స్రవంతి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ మాట్లాడుతూ.. ప్రమాదంలో పడిన ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడంలో రచయితలు, కవులు ముందుండాలని కోరారు. విశాఖ జిల్లా ఆనందపురం జంక్షన్‌లో వెలుగు విఒఎలు భారీ ర్యాలీ నిర్వహించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.రూపాదేవి, జిల్లా గౌరవాధ్యక్షులు పి.మణి మాట్లాడారు. అల్లూరి సీతారామరాజు జిల్లా కొయ్యూరు మండల కేంద్రంలో ఆందోళన చేపట్టారు.

సాహితీస్రవంతి ఆధ్వర్యంలో కర్నూలులో జనకవనం నిర్వహించారు. సాహితీ స్రవంతి రాష్ట్రకార్యదర్శి జంధ్యాల రఘుబాబు సభాధ్యక్షతన జరిగిన సభలో రాష్ట్ర అధ్యక్షులు కెంగారమోహన్ ప్రసంగించారు. రక్షణ కల్పించాల్సిన పాలకులు మౌనం పాటిస్తున్నారని, జాతుల మధ్య చిచ్చుపెట్టి రెచ్చగొడుతున్నారని విమర్శించారు. రఘుబాబు మాట్లాడుతూ.. మహిళలను రక్షించలేని ప్రభుత్వాలకు పాలించే అర్హత లేదన్నారు. ఈ అంశంపై త్వరలో కవితా సంకలనం తీసుకువస్తామని, ప్రగతిశీల కవులతో నిరసన కార్యక్రమాలు కొనసాగిస్తామన్నారు. కవులు జి.వెంకటకృష్ణ, కవితా వెంకటేశ్వర్లు, తెలుగు వెంకటేష్, ఆవుల చక్రపాణి యాదవ్, పులిచేరి మహేష్, చౌశా, ముర్తుజా, విజయులు, నాగముని, ఇనాయతుల్లా, లక్ష్మణ్, విశ్వనాథరెడ్డి, పానుగంటి చంద్రయ్యలు కవితలు చదివారు. సభ అనంతరం నల్లబ్యాడ్జీలు ధరించి మతోన్మాదం నశించాలని, మణిపూర్‌లో శాంతి నెలకొల్పాలని నినాదాలు చేసి నిరసన తెలిపారు. అన్నమయ్య జిల్లాలోని అంబేద్కర్ కూడలిలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మదనపల్లి - తిరుపతి జాతీయ రహదారిపై రాస్తారోకో చేశారు. పార్వతీపురం మన్యం జిల్లాలో నిరసన ప్రదర్శన, మానవహారం, రౌండ్‌టేబుల్ సమావేశం, గుమ్మలక్ష్మీపురం, సీతంపేటలో కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహించారు. విజయనగరం జిల్లాలోని డెంకాడ మండలంలో అక్కివరం వద్ద, పూసపాటిరేగలో నిరసనలు జరిగాయి. విజయవాడ లోని బీసెంట్ రోడ్డులోని ఎల్ఐసి ఆఫీసు నుంచి లెనిన్ సెంటర్ వరకు సంగమం, భారీ ప్రజాప్రదర్శన జరిగింది. వర్షాన్ని సైతం లెక్క చేయకుండా నిర్వహించిన ఈ ర్యాలీలో మహిళలు ఎక్కువ సంఖ్యలో పాల్గొన్నారు. ముస్లిమ్ మహిళలు సైతం ప్రదర్శనలో నడిచారు. మణిపూర్ మారణ కాండను నిలువరించాలని, బిజెపికి దేశ ప్రజలు బుద్ధిచెప్పాలని ప్రదర్శనలో నినాదాలు చేశారు. సంగమం నాయకులు శాంతిశ్రీ, సమన్విత నాయకులు, ప్రజాశక్తి బుక్ హౌస్‌మాజీ ఎడిటర్ కె ఉషారాణి, ప్రముఖ న్యాయవాది బి శ్రీదేవి, సేఫ్ సంస్థ నాయకులు జ్యోత్స్న, ఐద్వా నాయకులు కె స్వరూపరాణి, కె.సరోజ, పిఒడబ్ల్యు నాయకులు పద్మా, సిఐటియు, తదితర నాయకులు పాల్గొన్నారు. 58వ డివిజన్ ఆర్‌సిఎం చర్చి వద్ద సిపిఎం ఆధ్వర్యంలో సంతకాల సేకరణ ఏర్పాటు చేశారు.

నెల్లూరు జిల్లా రాపూరులో ర్యాలీ, గుంటూరు జిల్లా వ్యాప్తంగా నిరసనలు తెలిపారు. పల్నాడు జిల్లా వినుకొండలో బస్టాండ్ సెంటర్ నుండి శివయ్య స్తూపం సెంటర్ వరకు ప్రదర్శన చేశారు. శ్రీకాకుళం జిల్లా పలాసలో లక్కీ షాపింగ్ మాల్ కూడలి వద్ద అంగన్‌వాడీలు రాస్తారోకో చేపట్టారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు జి.బేబీరాణి, కె.సుబ్బరావమ్మ, పాల్గొన్నారు.

సంస్మరణ సభలో మాట్లాడుతున్న మధు

దేశం కోసం బిజెపిని గద్దెదించాలి

- కోటేశ్వరరావు సంస్మరణ సభలో పలువురు వక్తలు

ప్రజాశక్తి-విజయవాడ:

దేశ భవిష్యత్తు కోసం బిజెపిని గద్దె దించాల్సిందేనని పలువురు వక్తలు అన్నారు. సిపిఎం విజయవాడ నగర కమిటీ సభ్యులుగా, సిఐటియు నేతగా, ఎస్‌డబ్ల్యుఎఫ్ ఉమ్మడి కృష్ణా జిల్లా మాజీ కార్యదర్శిగా సుదీర్ఘకాలం పని చేసిన రాజమహేంద్రవరపు కోటేశ్వరరావు సంస్మరణ సభ సిపిఎం విజయవాడ సెంట్రల్ సిటీ కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్ అధ్యక్షతన ఆదివారం జరిగింది. ముందుగా కోటేశ్వరరావు చిత్రపటానికి మాజీ ఎంపి పి.మధు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యులు వి.ఉమామహేశ్వరరావు, సిహెచ్.బాబూరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ... మతోన్మాద, కార్పొరేట్ విధానాలను అవలంభిస్తోన్న బిజెపికి వ్యతిరేకంగా పోరాటాలు నిర్వహించడమే కోటేశ్వరరావుకు అర్పించే నిజమైన నివాళి అని అన్నారు. ఎన్ని కష్టాలు వచ్చినా వెరవకుండా, ప్రజాఉద్యమాల్లో ఎంతో చురుకుగా పని చేశారని కొనియాడారు. మణిపూర్‌లో రెండు తెగల మధ్య మారణహోమాన్ని సృష్టించి, వందలాది మంది గిరిజనుల మృతికి కేంద్ర ప్రభుత్వం కారణమైందని ధ్వజమెత్తారు. ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ.. మార్క్సిజాన్ని నమ్మి చివరి వరకు అనేక ప్రజా ఉద్యమాల్లో రాజీలేని పోరాటం చేసిన ఆర్‌కె ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నరసింగరావు, ఎస్‌డబ్ల్యుఎఫ్ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకులు గంగాధర్, ఆర్‌కె మేనల్లుడు సాంబశివరావు మాట్లాడారు.

శిరోముండనం కేసులో బాధితుడి మృతి

- 27 ఏళ్లుగా కోర్టులో కొలిక్కిరాని కేసు

ప్రజాశక్తి - రామచంద్రపురం(డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా)

రాష్ట్రంలో సంచలనం కలిగించిన శిరోముండనం కేసులో బాధితుడు పువ్వల వెంకటరమణ (49) ఆదివారం మృతి చెందాడు. ఇటీవల ఆయన అనారోగ్యానికి గురయ్యాడు. పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. వెంకటరమణ కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఆయనకు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా వెంకటాయపాలెం గ్రామానికి చెందిన వెంకటరమణ శిరోముండనం బాధితుల్లో ఒకడు. 1996 డిసెంబర్ 29న వెంకటాయపాలెంలో అప్పటి ఎమ్మెల్యే, ప్రస్తుతం ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులుపై శిరోముండనం కేసు నమోదైంది. ఈ కేసులో దళితులు చల్లపూడి పట్టాభి, కోటి చినరాజు, దడాల వెంకటరత్నం, తనికెళ్ల గణపతి, పువ్వుల వెంకటరమణ బాధితులుగా ఉన్నారు. ఈ కేసు 27 ఏళ్లుగా కోర్టు పరిధిలో ఉంది. వైసిపి సర్కారు వచ్చిన తరువాత బాధితులకు కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయాలని నిర్ణయించింది. అయితే అనంతరం జరిగిన రాజకీయ పరిణామాల్లో తోట త్రిమూర్తులు వైసిపిలో చేరారు. తరువాత అదే పార్టీ నుంచి ఎమ్మెల్సీ పదవి పొందారు. దీంతో ఈ కేసులో మళ్లీ జాప్యం చోటుచేసుకుంది. తోట త్రిమూర్తులు పార్టీలు మారుతూ ప్రభుత్వం అండదండలతో కేసు నుంచి తప్పించుకుంటున్నారని ప్రజా, దళిత సంఘాలు విమర్శిస్తున్నాయి. ఈ కేసులో ఒకరు చనిపోగ మిగతా నలుగురు బతికున్నారు.

వెంకటరమణ (ఫైల్)

ప్రాథమిక విద్య అస్తవ్యస్తం : ఆలపాటి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రాష్ట్రంలో విద్యా వ్యవస్థను ప్రభుత్వం అస్తవ్యస్తంగా మారుస్తోందని విద్యాశాఖ మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ విమర్శించారు. గుంటూరులోని టిడిపి కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. పేద విద్యార్థులకు ప్రాథమిక విద్య మిధ్యగా మారిపోయిందన్నారు. పాఠశాలలో కనీస వసతులు లేకుండా రాబోయే రోజుల్లో ప్రతిఒక్కరు ఇంగ్లీష్ మాట్లాడాలని ఎలా చెబుతారని ప్రశ్నించారు. విలీనం పేరుతో రాష్ట్రంలోని వందలాది పాఠశాలలను మూయించారని విమర్శించారు. ఇప్పటికి ఆరు లక్షల మంది విద్యార్థుల భవిష్యత్‌ను అంధకారంలోకి నెట్టేసిన సిఎం జగన్ ఈ విషయంపై సమాధానం చెప్పాలన్నారు. కెజి టు పిజి వరకు ఉచిత విద్య అని మేనిఫెస్టోలో పెట్టి పిజి చదివే విద్యార్థులకు ఫీజ్ రీయింబర్స్‌మెంట్ లేకుండా చేసి ఉన్నత విద్యకు దూరం చేశారని విమర్శించారు. ఇంటర్ కళాశాలలు తెరచి నెల దాటినా ఇంతవరకు పాఠ్యపుస్తకాలు అందుబాటులోకి తేలేకపోయారని దుయ్యబట్టారు. సమావేశంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాసరి రాజామాస్టారు, రాష్ట్ర అధికార ప్రతినిధి పిల్లి మాణిక్యరావు, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చిట్టాబత్తిన శ్రీనివాసరావు (చిట్టిబాబు) పాల్గొన్నారు.

ప్రజలను విభజించడానికే 'యుసిసి'

రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

ప్రజాశక్తి - కడప అర్బన్

రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న చంద్రశేఖర్

ప్రజలను విభజించడానికే యుసిసి ప్రస్తావనను ఎన్నికల ముందు బిజెపి ప్రభుత్వం తీసుకొచ్చిందని వక్తలు విమర్శించారు. 'యుసిసిని వ్యతిరేకించండి - దేశాన్ని రక్షించండి' అనే అంశంపై కడప పాతబస్టాండ్ సమీపంలోని సిపిఎం కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి జి. చంద్రశేఖర్ అధ్యక్షతన ఆదివారం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. దీనికి పలు పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు ప్రసంగిస్తూ... భారతదేశంలోని హిందూ, ముస్లిం, క్రైస్తవులు, బౌద్ధులు, జైనులు, పారశీకులందరికీ ప్రత్యేక పర్సన్ లాను భారత రాజ్యాంగం కల్పించిందని చెప్పారు. 2018 జాతీయ లా కమిషన్ ఈ చట్టాలకు రాజ్యాంగ రక్షణ ప్రకటించిందన్నారు. భారత రాజ్యాంగాన్ని మట్టిలో కలిపి ఆర్ఎస్ఎస్ హిందూత్వ అజెండాను అమలు చేసేందుకు బిజెపి కుట్ర పన్నుతోందని దుయ్యబట్టారు. ఇందులో భాగంగానే ఆర్టికల్ 370, 35-ఎ రద్దు చేయడం వంటి దుశ్చర్యకు పాల్పడిందని విమర్శించారు. దేశంలో 'కామన్ క్రిమినల్ కోడ్' ఐపిసి, సిఆర్‌పిసి , ఎవిడెన్స్ యాక్ట్ ఉన్నాయని, ఇప్పుడు ప్రత్యేకంగా 'యూనిఫామ్ సివిల్ కోడ్' అవసరం లేదని అన్నారు. బిజెపి అతివాద హిందుత్వ దుందుడుకు విధానాలను దేశ ప్రజలందరూ ఐక్యంగా ఎదుర్కోవాలని కోరారు. సమావేశంలో ముస్లిం మైనార్టీ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు బాబుబాయ్, సంఘ సేవకులు సల్లావుద్దీన్ , మైనార్టీ హక్కుల నాయకులు దస్తగిరి, టిడిపి కడప నియోజకవర్గం నాయకులు అమిర్ బాబు, లక్ష్మిరెడ్డి, నసీర్, కాంగ్రెస్ నాయకులు ఎస్.ఎ.సత్తార్, చార్లెస్, సిపిఐ. నాయకులు సావత్ సుధాకర్, బిఎస్‌పి జిల్లా అధ్యక్షులు గుర్రప్ప, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఐఎన్ సుబ్బమ్మ, బి.మనోహర్, లోక్‌సత్తా, సిపిఐ(ఎంఎల్) నాయకులు, న్యాయవాది అమీన్ పాల్గొన్నారు.

బీల భూముల రక్షణకు చర్యలు చేపట్టండి

ముఖ్యమంత్రికి ఇఎఎస్ శర్మ లేఖ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

రాష్ట్రంలోని కొల్లేరు, పులికాట్, కోరింగ, ఉప్పలపాడు, భావనపాడు, సోంపేటల్లో ఎంతో విలువైన బీల భూములను రాజకీయ నేతలు, ఆక్రమణదారుల నుంచి కాపాడాలని మాజీ విశ్రాంత ఐఎఎస్ అధికారి ఇఎఎస్ శర్మ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సిఎం జగన్ మోహన్ రెడ్డికి లేఖ రాశారు. రాజ్యాంగంలో 48 (ఎ) ఆర్టికల్, జాతీయ పర్యావరణ పరిరక్షణ విధానం ప్రకారం బీల భూముల పరిరక్షణ చట్టానికి అనుగుణంగా ఆ భూములను కాపాడాలని కోరారు. ఇప్పటికే కొల్లేరు పరిమితి ఏటా తగ్గుతుండటంపై ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ అటవీ విభాగ సమాచారం ప్రకారం.. రాష్ట్రంలో 35 శాతం బీలలు ఇప్పటికే ధ్వంసమయ్యాయని తెలిపారు. ఈ భూములపై ప్రఖ్యాత ఆర్థిక శాస్త్రవేత్త ప్రొఫెసర్ దాస్ గుప్తా కమిటీ రిపోర్టును అధికారులు అధ్యయనం చేయాల్సిన అవసరముందని తెలిపారు. పర్యావరణ వనరులకు, జీవ వైవిధ్యానికి నష్టం కలిగితే రాష్ట్ర ఆర్థిక సంపదకు నష్టం కలిగినట్టేనని పేర్కొన్నారు. సోంపేట బీల భూముల రక్షణకు చర్యలు చేపట్టాలని జాతీయ హరిత ట్రిబ్యునల్ 2022 ఏప్రిల్ 13న ఆదేశాలు ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. అనంతర కాలంలో ఆ భూములపై రాష్ట్ర ప్రభుత్వం నియమించిన నిపుణుల కమిటీ నివేదిక సమర్పించిందని, అయినప్పటికీ భూముల రక్షణకు చర్యలు తీసుకోలేదని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఎన్‌జిటి ఆదేశాలను అమలు చేయాలని కోరారు.

విద్యుదాఘాతంతో ఇద్దరు దుర్మరణం

- సినీహీరో సూర్య, స్నేహితుని పుట్టినరోజు ఫ్లెక్సీ ఏర్పాటు చేస్తుండగా ప్రమాదం

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

వెంకటేష్ (ఫైల్)

సాయి (ఫైల్)

కోలీవుడ్ స్టార్ హీరో సూర్య, తమ స్నేహితుని పుట్టినరోజు సందర్భంగా ఫ్లెక్సీ ఏర్పాటు చేస్తున్న క్రమంలో విద్యుత్‌షాక్‌కు గురై ఇద్దరు విద్యార్థులు మరణించారు. పల్నాడు జిల్లా నరసరావుపేట మండలం యక్కలవారిపాలెంలో శనివారం అర్ధరాత్రి ఈ ఘటన జరిగింది. మృతుని బంధువులు, పోలీసుల వివరాల ప్రకారం.. యక్కలవారిపాలెం గ్రామానికి చెందిన నక్కా వెంకటేష్ (19), బాపట్ల జిల్లా జె.పంగులూరు మండలం నార్నెవారిపాలేనికి చెందిన పోలూరి సాయి (19) పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని వేర్వేరు కాలేజీల్లో డిగ్రీ రెండో సంవత్సరం చదువుతున్నారు. యక్కలవారిపాలేనికి చెందిన మిత్రుడు గోపాల్ యాదవ్‌కు, సినీ హీరో సూర్యకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలుపుతూ ఫ్లెక్సీ ఏర్పాటు చేయాలని ముగ్గురూ భావించారు. శనివారం అర్ధరాత్రి యక్కలవారిపాలెంలో ఫ్లెక్సీని అమర్చే క్రమంలో పైన ఉన్న విద్యుత్ తీగలు ఫ్లెక్సీ ఇనుప పైపులకు తగలడంతో వెంకటేష్, సాయి అక్కడికక్కడే మృతి చెందారు. గోపాల్ అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం నరసరావుపేట ఏరియా ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేశారు. తమ అనుమతి లేకుండా పిల్లవాడిని బయటకు ఎందుకు వెళ్లనిచ్చారని సాయి కుటుంబీకులు, బంధువులు కాలేజీ వద్ద ఆందోళన చేయడంతోపాటు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అమరావతిలో షేర్‌వాల్ టెక్నాలజీతో ఇళ్లు

- నేడు శంకుస్థాపన చేయనున్న సిఎం జగన్
- ఏర్పాట్లను పరిశీలించిన మంత్రులు

ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రులు ఆది మూలపు సురేష్, విడదల రజిని, ఎమ్మెల్సీ తలశిల రఘురాం, జిల్లా కలెక్టర్ ఎం.వేణు గోపాలరెడ్డి తదితరులు

ప్రజాశక్తి - తుళ్లూరు (గుంటూరు)

షేర్‌వాల్ టెక్నాలజీతో అమరావతిలో ఇళ్లను వేగంగా నిర్మిస్తామని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ తెలిపారు. గుంటూరు జిల్లా మంగళగిరి మండలం కృష్ణాయపాలెం లే అవుట్‌లలో ఇళ్ల నిర్మాణాలకు సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం శంకుస్థాపన చేస్తారు. అనంతరం తుళ్లూరు మండలం వెంకటపాలెంలో బహిరంగ సభలో పాల్గొంటారు. ఈ నేపథ్యంలో ఏర్పాట్లను మంత్రులు ఆదిమూలపు సురేష్, విడదల రజిని, జోగి రమేష్ తదితరులు పరిశీలించారు. మంత్రి సురేష్ మాట్లాడుతూ.. పేదలందరికీ ఇళ్ల పథకంలో సిఆర్‌డిఎ పరిధిలో 25 లే అవుట్‌లలో గుంటూరు, ఎన్‌టిఆర్ జిల్లాలకు చెందిన దాదాపు 50 వేల మందికి ఇళ్ల పట్టాలు పంపిణీ చేసిన సమయంలో లబ్ధిదారులకు సిఎం ఇచ్చిన మాట ప్రకారం ఇళ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేస్తారని చెప్పారు. ప్రతి ఇంటికి నీరు, విద్యుత్ సౌకర్యంతో పాటు, పూర్తి స్థాయిలో రహదారులు, డ్రెయినేజీ వ్యవస్థలను ఏర్పాటు చేసి గేటెడ్ కమ్యూనిటీలుగా ఆరునెలల్లో తీర్చిదిద్దుతామని తెలిపారు. ఎంపి నందిగం సురేష్, సిఆర్‌డిఎ కమిషనర్ వివేక్ యాదవ్, ఎమ్మెల్సీ తలశిల రఘురామ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

భూ పోరాట యోధుడు రాజేష్

- సంస్మరణ సభలో బి.వెంకట్

ప్రజాశక్తి- కృష్ణాప్రతినిధి

సంస్మరణ సభలో మాట్లాడుతున్న వెంకట్

ప్రజలతో మమేకమై భూ పోరాటాలను, కూలి పోరాటాలను, కుల వివక్షతకు వ్యతిరేకంగా పోరాటాలను ముందుకు తీసుకెళ్ళిన పోరాట యోధుడు మురాల రాజేష్ అని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బి. వెంకట్ కొనియాడారు. భూ పోరాటయోధుడు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.రాజేష్ సంస్మరణ సభ కృష్ణాజిల్లా గుడివాడ కొత్త మున్సిపల్ కార్యాలయం రోడ్డులో ఆదివారం జరిగింది. సిపిఎం పట్టణ కార్యదర్శి ఆర్‌సిపి రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సభలో వెంకట్ మాట్లాడుతూ.. ప్రజలతో నాయకులు మమేకమవ్వాలని పుచ్చలపల్లి సుందరయ్య చెప్పిన మాటలను ఆచరణాత్మకంగా చూపారన్నారు. చల్లపల్లి ప్రాంతంలో భూ పోరాటాలంటే రాజేశ్వరరావు, గుంటూరు బాపనయ్య, పాటూరు రామయ్యలు గుర్తుకు వస్తారని, వారికి వారసుడిగా రాజేష్ వచ్చారని అనుకున్నామన్నారు. చిన్నతనంలోనే ఆయన చనిపోవడం కుటుంబ సభ్యులకు, సిపిఎం పార్టీకి, వ్యవసాయ కార్మిక సంఘ ఉద్యమాని తీరని లోటన్నారు. అతని త్యాగాన్ని స్మరించుకుని ఆ పోరాటాలను ముందుకు తీసుకెళ్ళడం మన ముందున్న కర్తవ్యం అని అన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ..ఉపాధి హామీ కార్మికుల సమస్యలపైన రాజేష్ అనేక పోరాటాలను నిర్వహించారని గుర్తు చేశారు. రాజేష్ కుటుంబానికి వ్యవసాయ కార్మిక సంఘం, సిపిఎం అండగా నిలుస్తుందన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు.. మాట్లాడుతూ ప్రజాపోరాటాలను నిర్వహించిన రాజేష్ చిరస్మరణీయుడని అన్నారు. తొలుత రాజేష్ చిత్రపటానికి బి.వెంకట్, వి.వెంకటేశ్వర్లు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిబాబు, సిపిఎం కృష్ణా, ఏలూరు జిల్లాల కార్యదర్శులు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు, తదితరులు పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా రాజేష్ తల్లి మేరియమ్మకు రూ. 2.50 లక్షల నగదును అందించారు.

ఏనుగులు ధ్వంసం చేసిన అరటి తోట

పంట పొలాలపై ఏనుగుల దాడి

- నేలమట్టమైన అరటి తోట
- లక్షల్లో నష్టపోయిన రైతు

ప్రజాశక్తి- వికోట (చిత్తూరు జిల్లా)

లక్షలు ఖర్చు చేసి సాగుచేసిన పంటలపై ఏనుగుల గుంపు దాడి చేయడంతో రైతులకు అపారనష్టాన్ని మిగిల్చిన సంఘటన చిత్తూరు జిల్లా వికోట మండలంలో చోటు చేసుకుంది. బాధిత రైతులు తెలిపిన వివరాల మేరకు... చిత్తూరు జిల్లా వికోట మండల పరిధిలోని అటవీ సరిహద్దు ప్రాంతమైన నాయకనేరి బీటు పరిధిలో కోత దశలోని అరటి తోటపై ఏనుగుల గుంపు గత రెండు రోజులుగా దాడిచేసింది. 14 ఏనుగులు గుంపుగా తమిళనాడు ప్రాంతం నుంచి నాయకనేరి బీటులోకి ప్రవేశించాయి. ముదరందొడ్డి గ్రామపంచాయతీ మద్దిమాకులపల్లి గ్రామానికి చెందిన రైతు నాగభూషణ రెండు ఎకరాల్లో అరటి తోట సాగుచేశారు. కోతదశకు చేరిన అరటి తోటపై ఏనుగులు దాడి చేసి నేలమట్టం చేశాయి. దీంతో సుమారు రూ. ఐదు లక్షల రూపాయల నష్టం మిగిలిందని బాధిత రైతులు వాపోయారు. రెండు రోజులుగా ఒకే తోటపై ఏనుగులు దాడి చేస్తున్నప్పటికీ అటవీశాఖ అధికారులు పట్టించుకోకపోవడంపై రైతు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏనుగులను నియంత్రించాలని సమాచారాన్ని ఇచ్చినా అటవీ శాఖ అధికారులు తీవ్ర అలసత్వం వహించారని వాపోయారు. సంబంధిత అధికారులు నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వం నుండి పరిహారం అందించాలని రైతు డిమాండ్ చేశారు.

విద్యుత్ భారాలు రద్దు చేయాలని ప్రజా బ్యాలెట్

ప్రజాశక్తి - విజయవాడ వన్‌టౌన్ , అజిత్ సింగ్‌నగర్

విజయవాడ సింగనగర్ పైపులు రోడ్డు వద్ద ప్రజా బ్యాలెట్‌లో పాల్గొన్న ప్రజలు

విద్యుత్ ఛార్జీల భారాలను నిరసిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో విజయవాడలోని సితార సెంటర్, సింగనగర్ పైపులు రోడ్డు వద్ద ప్రజా బ్యాలెట్ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. విద్యుత్ సంస్కరణ పేరిట కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నెలనెలా పెంచుతున్న కరెంటు ఛార్జీలు ఉపసంహరించాలని ప్రజాబ్యాలెట్‌లో పాల్గొన్న ప్రజలు డిమాండ్ చేశారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబురావు మాట్లాడుతూ.. విద్యుత్ ఛార్జీల ధరల నియంత్రణకు శ్రీకరణ నిధి ఏర్పాటు చేస్తానని, ప్రజలపై భారాలు వేయబోమని మాట ఇచ్చిన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి గడిచిన నాలుగు సంవత్సరాల పరిపాలనలో రూ. 25 వేల కోట్లు భారాలు ప్రజలపై వేయడం దుర్మార్గమన్నారు. కార్పొరేట్ల లాభాల కోసం బిజెపి, వైసిపి ప్రభుత్వాలు వెంపర్లాడుతున్నాయని తెలిపారు. ఇప్పటికే నిత్యావసర ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని, దీనికి తోడు విద్యుత్ బిల్లులు కూడా షాక్ కొడుతున్నాయని విమర్శించారు. సిపిఎం పశ్చిమ ఫ్లోర్‌లీడర్ బోయి సత్యబాబు మాట్లాడుతూ.. ప్రజా వ్యతిరేకతను గమనించి పెంచిన కరెంటు ఛార్జీలు, ట్రూఅప్ ఛార్జీలు, స్మార్ట్ మీటర్ల భారాలు రద్దు చేయాలని, లేనియెడల 2024 ఎన్నికల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తగిన బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు.

మంత్రాలయంలో 108 అడుగుల శ్రీరాముని విగ్రహం

- వర్చువల్‌గా కేంద్ర హోం మంత్రి అమిత్ షా శంకుస్థాపన

ప్రజాశక్తి - మంత్రాలయం

కర్నూలు జిల్లా మంత్రాలయం ఎమ్మిగనూరు రోడ్డులో దాదాపు రూ.300 కోట్లతో 108 అడుగుల పంచలోహ విగ్రహం ఏర్పాటుకు కేంద్ర హోం శాఖా మంత్రి అమిత్‌షా వర్చువల్ విధానం ద్వారా ఆదివారం శంకుస్థాపన చేశారు. శ్రీరాముడి పంచలోహ విగ్రహం ఏర్పాటుతో ప్రపంచ ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా మంత్రాలయం విరాజిల్లుతుందని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ఆకాంక్షించారు. మంత్రాలయ పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు మాట్లాడుతూ.. శ్రీరాముని పంచలోహ విగ్రహం ఏర్పాటు వల్ల పర్యాటక ఆధ్యాత్మిక కేంద్రంగా శ్రీమఠం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. జైశ్రీరామ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విగ్రహ నిర్మాణం జరగనుంది. గుజరాత్‌లో సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ భారీ విగ్రహాన్ని రూపొందించిన శిల్పి రామ్ వాంజీ సుతార్‌కు శ్రీరాముని విగ్రహ రూపకల్పన బాధ్యతలు అప్పగించారు. మంత్రాలయం శ్రీమఠానికి సుమారు కిలోమీటరు దూరంలో పదెకరాల సువిశాల స్థలంలో ఆలయ నిర్మాణం జరగనుంది. ఆలయ ఆకృతుల రూపకర్తల్లో ప్రముఖుడైన డాక్టర్ ఎ.వేలుకు ఈ ఆలయ నిర్మాణ బాధ్యతలు అప్పగించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం, రాజ్యసభ ఎంపి టిజి వెంకటేశ్, బిజెపి నాయకులు హైకోర్టు న్యాయవాది పురుషోత్తం రెడ్డి, వైసిపి రాష్ట్ర యువజన విభాగం నాయకులు వై.ప్రదీప్‌రెడ్డి పాల్గొన్నారు.

అక్షరం

ప్రజాశక్తి
www.prajasakti.com
facebook/prajasakti, twitter/prajasakti

4 | విజయవాడ
సోమవారం 24 జులై 2023



సమాజం మతం మత్తులో పడకుండా వుండాలంటే, మూఢనమ్మకాలు తొలగిపోవాలంటే విద్యావిధానంలో మార్పు రావాలి.

- థామస్ అల్వా ఎడిసన్, ప్రపంచ ప్రసిద్ధ శాస్త్రవేత్త.

ప్రమాదపుటంచున ...

మన ఆడబిడ్డను ఊరేగిస్తున్నారు నగ్నంగా
నిస్సహాయమైన మూగదేశం పిరికి కళ్ళతో చూస్తోంది!
మతం విద్వేషమనే భక్తిలో తరిస్తోంది
విఫలమైనవారే వాడుకుంటారు కులాన్ని మతాన్ని
జీవించే హక్కును కాల్చేస్తూ
వ్యాపిస్తున్నాయి మతం మంటలు
ఆకాశం సైతం చిరునవ్వును మరచినట్టు, సర్వత్రా భయం!

స్వేచ్ఛాదారి దగ్గర్లోనే ముగిసిపోతుందని తెలుస్తోంది
ఏం జరిగినా నవ్వుతున్నవాళ్ళు కొందరు
ఎలాంటి ప్రతిఘటనా లేకుండా
లొంగిపోతున్నవాళ్ళు ఇంకొందరు
ఇక లోపల మరణించి పైకి బతికుంటాం!

మాకే దేవుడూ తెలియదు
తాగడానికి కొన్ని నీళ్ళివ్వండి
సహపంక్తి భోజనం చేయనివ్వండి
మా అభి'మతం' ద్వేషం కాదు
ఆత్మగౌరవం.....
దాని కోసమే మా పోరాటం

నిప్పు పెట్టిన కళాకారుడివి
చాలా తీరుబడిగా ఉంటావు
శూద్రుల కన్నీరు మీరు
ఆమె కన్నీళ్ళను దొంగిలించేందుకు పూనుకున్నారు
కంటి మూలలో చిక్కుకున్న
మిగిలిన కాటుకనూ కడిగేసింది కన్నీరు!

– శాంతయోగి యోగానంద
9110770545

కొత్త తెగులు..

అక్కడ ఓ అమాయక కన్యత్వం
మదమెక్కిన పశుత్వం ముందర
పత్తా లేకుండా పోయింది..
అక్కడ మానవత్వం
తెగల మధ్య పుట్టిన కొత్త తెగులును
చూసి దిగాలు పడింది..
అక్కడ సౌశీల్యం నైతిక వైకల్యం ముందు
మానసిక దౌర్బల్యం ముంగిట
వెక్కివెక్కి ఏడ్చి మోకరిల్లింది..!

తెగల మధ్య పుట్టిన తెగులు
మానవత్వ పంటనాశిస్తోంది
అక్కడ పుట్టిన చీడ సర్వత్రా
ప్రశాంతతను చెడగొడ్తుంది..

భారతావని కీర్తి కిరీటంలో
మణిదీపమైన మణిపూర్
నేడు శోకతప్త హృదయంతో తల్లడిల్లుతోంది
తెగల మధ్య అంతర్యుద్ధంతో
తెగ బాధపడుతోంది..

ఈ చంద్రయాన్ జమానాలో
మనిషి అలవోకగా ఈ గ్రహం నుండి
ఇతర గ్రహాలకు నిర్భయంగా చేరుకుంటున్నాడు..

కానీ ఎందుకో..?
తెగల తెగుళ్ల పడ్డ పక్క గల్లీని
కులం గీసిన కూడలిని,
జాతి గీసిన జాడల్ని
మత పారవశ్యంలో మైమర్చిన
ఆ పక్క వీధిని దాటడానికి జంకుతున్నాడు..!

– సర్ఫరాజ్ అన్వర్
9440981198

పొడుసుకొత్తాది రేపు ఎర్రటిపొద్దు

తండ్రీ సూర్యనారాయణ మూర్తీ
ఆ గోరకలి సూడ్డానికే తూరతన్నావా?

అమ్మా, భూదేవతా
ఇంత అంతకానికొడిగడితే నీ గుండె బద్దలవ్వలేదా?
ఆ దగుడుబాజి దారవాతల్ని దమటైమండి
బుగ్గిసెయ్యప్పోతే నిన్నగ్గిదేముడని ఎందుకు మొక్కాల?
రాళ్ళవరసం కురిపించి ఆ రాకాసుల్ని రయిం సెయ్యకపోతే
వానదేముడా అని నీకేల పూజ్జెయ్యాల?
గాడుపై రానేకపోనావా గాలిదేముడా
ఆ గండల్ని యీడ్సికెలిపోనేకపోనావా?

రత్తం మరిగిపోతంది!
కడుపుడికిపోతంది!
ఇలమీదెప్పుడైనా ఇలపింటిదుందా?
ఒక నాయం నేదా? ఒక దరమ్ము నేదా?
ఆళ్ళు మీ తోడబుట్టినోళు కాదా
ఆళ్ళది మీ రత్తసొర్కి కాదా?
మీ ఇంట్ల ఆడోళు నేరా?
ఆళు మీ ఆడోళ్ళాటోలు కారా?
సందిరిడు సాతీ వుంతే సరా
సోకులు సేసుకోని అన్నంటన్నంట తిరిగొత్తే అదే పాలనా?

ఇంత నరుకూతలోళ్ళేట్రా మీరు
ఇంత నరకాసురులేట్రా మీరు
పశివిలు సేనిమేసీకుంట ఎలుగని నమ్ముకుంతే
మీరే పశువుల్లాగ పొలాన పడి తగడకుమ్మెత్తారా?
సంరచ్చన సెయ్యమంతే సిగుర్లు సిక్కెత్తారా?
మారాజా అని మనివిసేత్తే మర్రొండు తన్నమంతారా?
బాగుంది నాయినా మీ తిత్తవ
మా గొప్పగుంది నాయినా మీ పరిపాలన తీరవ
సన్నాసుల్లారా ..సాగిపోతందని సంబరపడిపోకండి
ఎర్రిపువ్వుల్లారా.. ఎలిగిపోతన్నామని ఇరగబడిపోకండి

ఉట్టిగట్టుకోని మీరిలగే వుగమ్మీద వుండిపోరు
బాబక్కరంతోటి ఎల్లకాలం బతికీలేరు
ఎద్దెప్పుడూ ఒకపక్కే తొంగోదు
పొద్దెప్పుడూ పడమర దిక్కునే ఉండిపోదు

మీరూ ఏడుకట్లు సవ్వారి ఎక్కక తప్పదు
మీ దిబ్బల మీదా దివ్వలెట్టే రోజులు రాకమానవు

ఒకరోజు ఎనకాముందూ.. ఇంతే!
ఈరోజు ఇందమ్మా అంతే రేపు అందమ్మ .. ఔనంతే !
మీ బతుకూ తెల్లారిపోద్ది.. గాబరపడొద్దు
పొడుసుకొత్తాది సూసుకోండి రేపు 'ఎర్రటిపొద్దు'

– లాంగుల్య

అమృత కాలంలో ...

నడిచే దేవతల్ని
నగ్నంగా చేసి
నడి వీధిలో ఊరేగించారు
వివస్త్రను చెయ్యడమేదో
వీరోచిత కార్యంలా
కేరింతలు కొట్టినారు
తలదించిన ఆ దేవతలు
ఒకరు నాగరికత
మరియొకరు మానవత!
వెంటాడిన ఆ గుంపులు
ఒకటి రాజకీయం
మరియొకటి విద్వేషం!
ఆధునిక దేశంలో...
అమృత కాలంలో ...!

– డా. డి.వి.జి.శంకర రావు, మాజీ ఎంపీ,
94408 36931

మానం మంటగలిసిన దేశంలో ...

బహిరంగంగా
దేహాలను దిగంబరంగా
ఊరేగించిన ఉన్మాదుల రాజ్యమిది
విలువలు, వలువలై
ఆత్మాభిమానం అమ్ముడుబోయిన
ఆటవిక కబోదుల్లున్న
దుర్మార్గపు కాషాయ కాలమిది
నువ్వు సిగ్గుపడకు తల్లీ...
ఎక్కడ పుడితేనేం... ఎవ్వరికి పుడితేనేం...
నీ మర్మస్థలం వారికి జన్మ స్థానం

చట్టాల్ని ఏ చూరులో చుట్టారో
అర్థం కాని అయోమయం...!
అధికారం, అహంకారం
ఏ ఏసీల్లో నిదురబోయిందో అని
సామాన్యుని ఆక్రోశం...
మానం మంటగలిసిన దేశంలో
మనిషిగా ఎటు వెళ్తున్నామో
తెలియని అనిశ్చితి
పాలకులూ కళ్ళు తెరవండి
దేశ, మాన ప్రాణాలను కాపాడండి..!

– మహబూబ్ బాషా చిల్లెం

వాళ్లంతా చచ్చిపోతే బాగుండు!

మానవత్వం లేనోళ్ల
మనిషిగా బతకలేనోళ్ళంతా
సామూహికంగా సచ్చిపోతే బాగుండు
ఇంకా మనం
స్వతంత్ర దేశంలోనే వున్నామా...
మానవ మాత్రులుగా బతుకీడుస్తున్నామా...
క్రూరమృగాలు సైతం
ఇలా చేయవు కదా
ఇది మెదడు బుద్ధీ వున్న
మనుషుల కృత్యమేనా
ఈ హేయమైన
విశృంఖలమైన దుస్సంఘటనను చూస్తూ
రక్తం సలసలా మరగలేదా ఎవ్వరికీ
చీము నెత్తురుతో ఒళ్లంతా వుడికిపోలేదా ఎవ్వరికీ

దేశాన్ని రక్షించిన సైనికుడు
కళ్లముందే జరిగిన దుశ్శాసన పర్వం నుంచి
తన వాళ్ళను రక్షించుకోలేని
అచేతనం లోకి నెట్టివేయబడ్డాడా
ప్రాణభయం దుర్భర దృశ్యాలకు తలొగ్గిందా
అక్కడ
మనిషితనం పూర్తిగా చచ్చిపోయిందా?
అందరూ మూట గట్టుకొండి
తిలా పాపం తలా పిడికెడు

రక్షణ వ్యవస్థలు దిగంబరమై పోయాయా
ఈ ఉన్మాద రాక్షస క్రీడకు స్వస్తి వాక్యం ఎప్పుడు
అభి'మానం' నిలువెల్లా అల్లాడి
విలువల వలువలూడి పోయాక
దేశమంతా ప్రాణం లేని కళేబరమే కదా
అక్కడి
అమానవీయతకు చితులు పేర్చండి
పాపాత్ములను బూడిద చేసే ఖననానికి
మనుషులేవరైనా హాజరు కాండి ...

వంట గరిటల్ని పట్టిన అమ్మలారా
గొడ్డళ్లు.. గునపాలు... తుపాకులు పట్టండి
కలుపు మొక్కల్ని తొలగించే
మీ చేతి కొడవళ్ళతోనే
మీ నూలు పోగుల్ని వొలిచిన చేతుల్ని
మీ మానాన్ని తాకిన దిసమొలల్ని
తెగనరకండి తల్లులారా...!

మానవ చరిత్రను మనిషి గమనాన్ని
నీచాతి నీచంగా లిఖిస్తున్న
ఈ చండాలపు జాతి జాతంతా
చచ్చిపోతే బాగుండు!
తలారా స్నానం చేసి
నాలుగు మంచి వాక్యాలు రాసుకుంటాను..!

– డాక్టర్ కటుకోర్ఘ్వుల రమేష్
99490 83327

అగ్గివాన

ఎన్నో రోజులు తరబడి
ఈ మట్టి గొంతు కోసినా
పోరుపాట చిగురిస్తూనే ఉంది
ఆ అడవి కాళ్ళు నరికినా
ఉద్యమనడక సాగుతూనే ఉంది
అదిగో.. ఆ నింగి మెడలు తుంచినా
ఆత్మగౌరవం కురుస్తూనే ఉంది

అమాయకంగా ఎగిరిపోతున్న
మా ఆయువు గాలులు
అగ్గివానలై కసిగా కురవకపోవు
మీ చీకటిదాడుల కంచెలు దాటి
ఈశాన్య కొండలంచుల్లోంచి
పవిత్ర రక్తమరకలంటిన
సరికొత్త పోరు సూరీడు
ఏదోక పొద్దు ఉదయించకపోడు

పశువులనేమో అమ్మలంటూ
మా అమ్మలనేమో పశువుల్లెక్క
నగ్నంగా ఈడ్చుకుపోయే
మీ నీతిమాలిన గాలూపులకి
గుప్పెడు ఆకులు పూలు తప్ప
నింగిలోని చుక్కలు రాలవు !

మా తోబుట్టువుల మానాలే
మీ సిగ్గులేని అముఖాలకు
ముసుగులయ్యే రోజు
హోరుగ పారే వారి ముట్టు ధారల్లో
మీ ఉత్తుత్తి ఊపిరిగుడ్డలు
రంగుమారి వేల సమూహాలుగా
కొట్టుకుపోయే క్షణం రానే వస్తుంది

దేశభక్తి వేషం గట్టిన మీరు
నగ్నంగా ఊరేగిస్తూ
ఊరి చివర ఊపిరి తీసేసింది
మా ఆడబిడ్డలనే కాదు
మీ కసాయి ధర్మం సాక్షిగా
సిగ్గుతో సగం చచ్చిన
ఈ దేశమాతని కూడా !
ఇప్పుడు బోసిమొలల చిత్రపటమే
మువ్వన్నెల జెండాగా మారి
రాజ్యాంగంపై నమ్మకంతో
తడితడిగా తలవంచుకొనెగురుతోంది!

– మిరప మహేష్
9948039026

మౌనం మాట్లాడింది!

మణిపూర్‌పై దేశం భగ్గుమన్నాక
పార్లమెంట్ మౌనం మాట్లాడింది
దొంగలు పడిన ఆర్నెల్లకు
కుక్కలు లేచి మొరిగినట్టు ..

తెల్లవారు ఝామున కూయాల్సిన
మణిపూర్ పాలక కోడీ కూసింది
బారెడు పొద్దు ముఖం మీద పడ్డాక
మే దురాగతంపై కాదు, ట్విట్టర్పై కోపంతో ...

మొన్నటి గుజరాత్ నిన్నటి కాశ్మీరుల్లో
రాజేసిన ఉన్మాదపు కాష్టం
నేడు మణిపూర్ని తగలేసింది
రేపో దేశమో .. మైనార్టీలో కావొచ్చు

దిగ్గున లేచిన దేశానికి దణ్ణం పెట్టారు
పడమటి పొద్దుపొడుపు చూడమన్నారు
నిందితుడు హరిదాస్ అబ్దుల్లా అయ్యాడు
ఇప్పుడందరూ చప్పట్లు కొట్టండంటారేమో!

– ఉన్నం వెంకటేశ్వర్లు

నగ్న కవాతు

రాయాలనే అనుకున్నా
కానీ ఆమె మీద పాకిన చేతులు చూసి
నా వేళ్ళు ముడుచుకుపోయాయి ...
ఒక్క కవితలో ఐనా
ఆమె కన్నీళ్లను నావిగా చేసుకుని
ప్రవహిద్దామనుకున్నా
నన్నెక్కడ ఊరేగిస్తారోనని భయపడిపోయా...
చదువంటే భయాన్ని నేర్పించే ఆయుధమైనప్పుడు
చదువంటే సంస్కారాన్ని మాయం చేసే శాసనమైనప్పుడు
చదువుకు చెదలు పట్టి చాలారోజులైనప్పుడు
ఒక రాత, ఒక గీత
ఎవరిని మార్చుతుంది?
ఇంకెవరిని ఉద్ధరిస్తుంది?
పుస్తకాల్లో చదువుకున్న
హిట్లర్లు ప్రాణం పోసుకుని
ఉరుకుతూ వచ్చినట్టుంది
ఎర్రకోట సాక్షిగా ఇప్పుడు నా మణిపూర్ శకటం
బట్టలిప్పుకుని ఊరేగుతోంది...
ఇక్కడ ప్రశ్నించడం నిషేధం
ఎందుకంటే మాటలొచ్చిన ఆయుధాల ముందు
నా దుస్తులు కూడా ముడుచుకుని
రాలిపోవాల్సిందే !
shame is a small word
no meaning in this world
shame became rapped
shame became paraded
వెనకటి తరాలు నాటిన
కుల విత్తులు మతం మత్తులు
ఇప్పుడిప్పుడే అగ్నిపర్వతాల్ని విరబూస్తున్నాయి...
ఆమె ఆత్మాభిమానాన్ని కాపాడలేకపోయిన
దేశప్రజలంతా
సోషల్ మీడియాలో జెండాను
కప్పి కాపాడామని
మా జడలను, మీసాలను ముడేసి మరీ విర్రవీగాం
ఓ మణిపూర్ మహిళా,
నీకు ఎన్ని కన్నీళ్లతో కళ్ళు కడిగినా తక్కువే ..
ఎందుకంటే, దేశాన్ని కాపాడే సైనిక కవాతు చూసాను
హిట్లర్ల చేతిలో దేశాన్ని ప్రశ్నిస్తూ
సిగ్గు విడిచిన నీ కవాతును చూసాను
నువ్వు నిజంగా ఒక నగ్న సైనికురాలివి
ఎంతోమంది స్త్రీలను మేల్కొలిపిన
సాధారణ కుకీ మణిపూర్ మహిళవి
నీకు నా జోహార్లు...

– అమూల్యచందు

వాస్తవిక సృజనకారుడు మున్షీ ప్రేమ్‌చంద్

సందర్భం

31 జులై వచ్చిందంటే భారతీయ మహారచయిత మున్షీ ప్రేమ్‌చంద్ గుర్తుకు వస్తారు. కేవలం ఉరుదూ, హిందీ భాషల వారికే కాదు; అన్ని భారతీయ భాషల వారికీ ఆయన గుర్తుకొస్తారు. ఎందుకంటే వారి వారి భాషల్లో ఆయన నవలో, కథో చదివే ఉంటారు. మా తరం ప్రేమ్‌చంద్ రచనలు చదువుతూ పెరిగాం. ప్రేమ్‌చంద్ పేరు మన తెలుగు రచయిత గోపీచంద్ లాగ ఉండడం వల్ల, ఈయన మరో తెలుగు రచయిత అనుకునే వాళ్ళం. చాలాకాలం వరకూ ఆయన బెంగాలీ అని తెలియదు.

రచనలు ఊహల్లోంచి, భ్రమల్లోంచి కాదు – వాస్తవాల్లోంచి, నిజాల్లోంచి వెలువడాలన్నది ఆయన రచనలు చదివిన వారికి అర్థమవుతుంది. గొప్ప గొప్ప చదువులు చదవకపోయినా, భాషా పాండిత్యం సంపాదించకపోయినా, జీవిత పాఠాల్ని క్షుణ్ణంగా నేర్చుకుంటే మహారచయితలు కాగలరన్న విషయాన్ని ప్రేమ్‌చంద్ చెప్పకనే చెప్పారు. తల్లి ప్రేమను పొందలేక, తండ్రి నిరాదరణకు గురై, తన బాహ్య, అంతర ప్రపంచాల్లో పెనుభూతంలా పెరిగిన 'ఒంటరి తనాన్ని' పుస్తకాలతో దెబ్బ కొట్టారాయన. చిన్నప్పుడు పుస్తకాల షాపులో పనిచేయాల్సి వచ్చినా, ట్యూషన్లు చెప్పినా, ఉపాధ్యాయుడిగా ఉద్యోగం చేసినా, ఎన్ని ఊర్లు మారినా, ఎక్కడ ఉన్నా పుస్తకపఠనం మానలేదు. తన ఒంటరితనాన్ని సాహిత్య పఠనంతో నింపుకునేవారు. తర్వాత కాలంలో మెల్లమెల్లగా తనూ రాయడం ప్రారంభించారు.

ప్రేమ్‌చంద్ (31 జులై 1880 – 8 అక్టోబర్ 1936) వారణాసి దగ్గర 'లంహి' అనే గ్రామంలో అజైత్ రాయ్, ఆనందదేవి దంపతులకు పుట్టారు. పుట్టినప్పుడు పెట్టిన పేరు ధనపత్ రాయ్. చిన్నప్పుడు ఊళ్లోని మదరసాలో ఉరుదూ, పర్షియన్ నేర్చుకున్నారు. చిన్నతనంలోనే తల్లి చనిపోయినందువల్ల అమ్మమ్మ సంరక్షణలో పెరిగాడు. వీరి మేనమామ ఒకాయన సరదాగా ధనపత్ రాయ్‌ని 'నవాబ్' అని ముద్దుగా పిలుస్తుండేవాడు. అదే పేరుతో ఆ యువకుడు చిన్న చిన్న కథలు రాయడం ప్రారంభించాడు. నవాబ్ రాయ్ అనే కలం పేరుతో కొంత కాలం రాసి, తర్వాత 'బాబూ నవాబ్ రాయ్ జన్సారి' పేరుతో రాసి, చివరికి 1909లో ప్రేమ్‌చంద్' అనే కలం పేరు స్థిరపర్చుకున్నాడు. పుస్తకాల్లోంచి ప్రపంచాన్ని చదవగలిగిన నైజం, నేర్పు ప్రేమ్‌చందుకు చిన్నతనంలోనే వచ్చింది. చిన్నప్పుడు తన తల్లిని చూసిన అనుభవం, ఆమె మాట, నడవడి, దయాగుణం ఆయన తర్వాతి కాలంలో బడే ఘర్ కి బేటి' నవలలో చిత్రించాడని అంటారు. ఏ పనీ నేర్చుకోకుండా పుస్తకాల పురుగులా ఎప్పుడూ చదువుతూ కూర్చుంటున్నాడని ఆయన చిన్నాన్న కోపగిస్తుండేవాడట. ఆ చిన్నాన్న ఒక తక్కువ జాతి యువతితో చేసే ప్రేమ వ్యవహారం తన రచనలో పొందుపరిచాడనీ.. ఆరకంగా ఆయనపై కసి తీర్చుకున్నాడనీ విమర్శకులంటారు. ఏది ఏమైనా జీవితాన్ని సాహిత్యీకరించడం ఎలాగో ప్రేమ్‌చంద్‌కు తెలిసినట్టుగా మరొకరికి తెలియదంటే అతిశయోక్తి కాదు. తర్వాత కాలంలో రాసిన దేవస్థాన్ రహస్య, దునియాక్ సబ్ సె అన్ మోల్ రతన్, ప్రేమాశ్రమ్ (1922), రంగభూమి (1924), నిర్మల (1925), కర్మభూమి (1931) వంటి రచనలు వందల సంఖ్యలో వెలువడ్డాయి. కొన్ని ఇతర భారతీయ భాషల్లోకి కూడా అనువాదమవుతూ వచ్చాయి.

తన ఎనిమిదో ఏటనే తల్లి చనిపోతే, తన తండ్రి మళ్ళీ పెళ్ళి చేసుకున్నాడు. ప్రేమ్‌చందుకు సవతి తల్లి వచ్చింది. ఆమె ఆజమాయిషీతో ఇంట్లో ప్రశాంతత కరువైంది. అప్పటికే ఆయన అక్క పెండ్లయి అత్తవారింటికి వెళ్ళిపోయింది. తండ్రి ఆయన



పనుల్లో ఆయన తిరుగుతుండేవాడు. ఈ బాల ధనపతితో గడిపేవారే లేరు. ఆ సమయంలో ఆయనను పుస్తకాలు ఆకర్షించాయి. అవే ఓదార్చాయి. పుస్తకాల్లోనే ఆదరణని, ప్రేమని,అనురాగాన్ని, స్నేహాన్ని వెతుక్కోసాగాడు. వాటితో ఉపశమనం పొందసాగాడు. అప్పుడే మరో సంఘటన జరిగింది. తన సవతితల్లి వైపు ధనికులైన బంధువులు వచ్చి, తమ కూతురినిచ్చి ధనపత్ రాయ్‌కి పెండ్లి చేశారు. అది 1895లో జరిగింది. అప్పుడాయన తొమ్మిదో తరగతి విద్యార్థి. వయసు 15. తీరా చూస్తే అమ్మాయే ఈయన కన్నా వయసులో పెద్దది. పైగా ధనవంతుల బిడ్డ గనక చాలా పొగరుగా ఉండేది. సవతి తల్లి ఒక వైపైతే, ఆమెతో పోట్లాడేందుకు తన భార్య రూపంలో మరో అమ్మాయి రావడంతో అ పసి హృదయం చాలా దెబ్బతింది. ఇంట్లో జరిగే గొడవల వల్ల ప్రేమ్‌చంద్ మానసికంగా కృంగిపోయాడు. తెలివైన కుర్రాడై ఉండి కూడా, మెట్రిక్యులేషన్ ద్వితీయ శ్రేణిలో (1897) ఉత్తీర్ణుడయ్యాడు. మార్కులు సరిగా లేవని మంచి కళాశాలల్లో ఎక్కడా సీటు దొరకలేదు. ట్యూషన్లు చెపుతూ, దొరికిన పుస్తకాలు చదువుతూ కాలక్షేపం చేస్తున్న రోజుల్లో నెలకు అయిదు రూపాయల వేతనంతో ఒక పాఠశాలలో టీచర్ ఉద్యోగం దొరికింది. తర్వాతి కాలంలో అలహాబాదులో ట్రెయినింగ్ పూర్తి చేసుకుని, 1905లో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా స్థిరపడ్డారు.

స్వంత ఊరు లంహి వెళ్ళి హాయిగా సెలవులు గడుపుదామనుకున్న ప్రేమ్‌చంద్‌కు అనూహ్య పరిణామాలు ఎదురయ్యాయి. సవతి తల్లికి, తన భార్యకూ ఏదో విషయంలో పెద్ద గొడవ జరిగింది. చికాకు పడి ప్రేమ్‌చంద్ భార్యను గట్టిగా కోపగించుకున్నాడు. ఆమె ఆత్మహత్యాయత్నం చేసింది. తరువాత ఉక్రోషంతో పుట్టింటికి వెళ్ళిపోయింది. తిరిగి రాలేదు. బాల్య వివాహాల దుష్పరిణామాలు, దుష్ప్రభావాలు ఎలా ఉంటాయో ఆయన స్వయంగా అనుభవించారు. బొమ్మల పెళ్ళిళ్ళు చేసినట్టు బాల్యవివాహాలు చేసే పద్ధతి మారాలని ఆయన కోరుకున్నారు. అప్పటికి ఆయన వయసు ఇరవై అయిదు. తర్వాత కాలంలో చాలా చోట్ల ఆయన బాల్య వివాహాల ఉరించి, వితంతు వివాహాల గురించి రాస్తూ వచ్చారు.

సంస్కరణోద్యమంలో భాగంగా ఆయన 1906లో శివరాణి దేవి అనే వితంతువును మళ్లీ పెళ్ళి చేసుకున్నారు. ఎన్ని ఒడుదొడుకులొచ్చినా ఇద్దరూ కలిసి ఉన్నారు. ఆవిడ ఆయనను జాగ్రత్తగా చూసుకున్నారు. ప్రేమ్‌చంద్ మరణానంతరం ఆమె తన అనుభవాలను 'ప్రేమ్‌చంద్ ఘర్ మే' అనే పుస్తకం ప్రకటించారు. అతి సామాన్యమైన జీవితం గడుపుతూ, ఉన్నతాశయాల కోసం, విలువల కోసం, దేశం కోసం ఆయన చేస్తూ వచ్చిన కార్యక్రమాలన్నీ అందులో ఆమె నమోదు చేశారు.

ప్రభుత్వ విద్యాశాఖలో ఉపాధ్యాయుడిగా ఉంటూ 1919లో ప్రేమ్‌చంద్ అలహాబాదు విశ్వవిద్యాలయం నుండి బి.ఎ. పట్టా పొందారు. 1921లో ప్రమోషన్ పై స్కూలు ఇనిస్పెక్టరయ్యారు. జీవితం కాస్త బాగా సాగుతోందని అనుకుంటున్న సమయంలో ఉద్యోగం వదిలి, స్వాతంత్రోద్యమంలో పాలు పంచుకోవాలని గాంధీజీ నుంచి పిలుపు వచ్చింది. అంతే! ఉద్యోగం వదిలేసి ఉద్యమంలో చేరారు. చాలా ఇబ్బందులు పడ్డారు. గోపాల కృష్ణ గోఖలే, బాల గంగాధర తిలక్‌లను అభిమానించేవారు. కాన్పూర్, గోరఖ్ పూర్‌లో పని చేసిన ఆయన బతుకు దెరువు కోసం బొంబాయి వెళ్ళారు. మద్దూర్ సినిమా స్క్రిప్టు రాశారు. కార్మిక నాయకుడిగా సినిమాలో కూడా కనిపించారు. ఆ సినిమా విడుదలకు ఎన్నో ఆటంకాలు ఎదురయ్యాయి. చివరకు ఢిల్లీ, లాహోరులలో విడుదలైంది. కొద్ది కాలమే నడిచినా కార్మికలోకాన్ని కదిలించింది. కార్మిక లు ఐకమత్యంగా కదిలి రావడం బ్రిటీష్ పాలకులకు నచ్చలేదు. వెంటనే ఆ చిత్రాన్ని నిషేధించారు. దేశంలో ఆ సినిమా ఆ రోజుల్లో సంచలనం సృష్టించింది. రచయితే ఆర్థికంగా నిలదొక్కుకోలేక పోయాడు. అక్కడి పరిస్థితులకు విసిగి, ముంబైలోని ఇల్లు ఖాళీ చేసి వెళ్ళి పోయే ప్రయత్నంలో ఉండగా, బొంబే టాకీస్ అధినేత హిమాంశురామ్ ఎన్నో విధాల నచ్చజెప్పాడు. అయినా ప్రేమ్‌చంద్ వినలేదు. హిందీ సినీ పరిశ్రమకు వీడ్కోలు చెప్పారు.

రచనలు చేయడం, పత్రికలు నిర్వహించడం ముఖ్యమైన పనిగా పెట్టుకున్నారు. బాల సాహిత్యం, అనువాదాలు, జీవిత చరిత్రలు, కథలు, నవలలు 'జమానా' 'సరస్వతి' వంటి పత్రికల్లో విరివిగా రాస్తూ గడిపారు. ఇన్ని ప్రక్రియల్లో కృషి చేసేవారు చాలా అరుదుగా ఉంటారు. ఆస్కార్ వైల్డ్, గైడ్ మపాసా, లియో టాల్ స్టాయ్, చార్లెస్ డికెన్స్ వంటి పదిమంది విదేశీ సాహితీ దిగ్గజాల రచనలు హిందీలోకి అనువదించారు. వీరి రచనల ఆధారంగా ఆ రోజుల్లో ఎన్నో చెప్పుకోదగ్గ సినిమాలు రూపొందాయి. దేశం గర్వించదగ్గ చలనచిత్ర దర్శకుడు సత్యజిత్ రాయ్ ప్రేమ్ చంద్ కథల ఆధారంగా 'సద్గతి', 'షత్రంజ్ కి కిలాడీ' అనే సినిమాలు తీశారు. రాజులు, సంస్థానాధీశులు ఏకమై బ్రిటీష్ వారిని తన్ని తగిలేయాల్సిన సమయంలో కొందరు ఎంత మూర్ఖంగా ప్రవర్తించారో ప్రేమ్‌చంద్ ఇందులో వ్యంగ్యంగా చిత్రించారు. సత్యజిత్ రాయ్ దాన్ని మరింత అద్భుతంగా చిత్రీకరించారు. 'ప్రేమ్‌చంద్ 'రేషన్ ' కథను మృణాల్ సేన్ 'ఒక ఊరి కథ' తెలుగుసినిమా తీశారు. ఇది సోమరిపోతులు, తాగుబోతులూ అయిన తండ్రీ కొడుకుల కథ! కొడుకు భార్య చని పోతుంది. శవ సంస్కారానికి కూడా డబ్బులుండవు. శవం మీద గుడ్డ కప్పి అందరినీ డబ్బు అడుగుతారు. కొంత డబ్బు సమకూరుతుంది. ఆ డబ్బు తీసుకుని మందు తాగడం కోసమని ఆ తండ్రీ కొడుకులు మళ్ళీ పాకకు వెళతారు. మానవీయ విలువలు నశించిపోతే పరిణామాలు ఎలా ఉంటాయో చెప్పిన కథ ఇది.

వాస్తవ జీవితాన్ని చిత్రించిన తొలి హిందీ రచయితగా ప్రేమ్‌చంద్‌కు పేరుంది. పట్టణాల్లోని మధ్య తరగతి సమస్యల్ని బాగా ఎత్తి చూపుతూ, అవినీతి, బాల్య వివాహాలు, వ్యభిచారం, ఫ్యూడల్ దుర్మార్గాలు, పేదరికం, కొలోనియలిజంలపై బలమైన రచనలు చేశారు. అందుకే వాస్తవిక సృజనకారుడయ్యారు. ప్రఖ్యాత పరిశోధకుడు డేవిడ్ రూబిన్ ప్రేమ్‌చంద్ జీవితంపై 'ద వరల్డ్ ఆఫ్ ప్రేమ్‌చంద్' అనే గ్రంథం రాశారు. దాన్ని 2001లో ఆక్స్‌ఫర్డ్ వారు ప్రచురించారు. అందులో ఆయన ప్రేమ్‌చంద్ గురించి ఇలా అంటారు : భక్తి, మూఢ నమ్మకాలపై వచ్చే సాహిత్యం నుంచి, ప్రేమ కథా సాహిత్యం నుంచి ప్రేమ్‌చంద్ భారతీయ సాహిత్యానికి విముక్తి కలిగించారు. జన జీవన సమస్యల్ని వాస్తవిక దృక్కోణంలోంచి చిత్రించి, ఒక కొత్త ఒరవడికి నాంది పలికారు. అంతేకాదు; యూరోపియన్ మహారచయితల స్థాయికి ఎదిగారు.' ఆ మాటలు అక్షర సత్యాలు.

– డాక్టర్ దేవరాజు మహారాజు

నేరం చేశాను ..!

నేను నేరం చేశాను, వాడికి ఓటేసి ...
బుద్ధిజీవులు వద్దు వద్దంటున్నా వినలేదు
కమ్యూనిస్టులు అరిచి మొత్తుకుంటే
వాళ్లు అతిగా చెబుతున్నారని అపోహపడ్డాను
భారతమ్మ భవిష్యత్తు వాడి చేతిలో పెట్టాను
ఆడవాళ్లను దేవతలన్నాడని ఉప్పొంగిపోయాను
ఇలా నడివీధిన నగ్నంగా ఊరేగిస్తాడనుకోలేదు!
56 అంగుళాల ఛాతీ అంటే దన్ను అనుకున్నాను
దాని వెనుక గుప్పెడంత హృదయం లేదని
తెలుసుకోలేకపోయాను
సాధు గెడ్డం, సుదీర్ఘ మౌనం హుందాతనం అనుకున్నా
వాడి కనుసైగల్లోని క్రూరహాసం గుర్తించలేకపోయాను

అంతెత్తున వాడు ఎగరవేసిన జాతీయజెండాను
తన్మయత్వం తల ఎత్తి చూశాను తప్ప
వాడి వేటుకు రాలి కింద పడుతున్న
బడుగుల మాన ప్రాణాలను గమనించలేకపోయాను
సతీ సహగమనం ఎంతో గొప్ప ఆచారమని
వాడి పరివారం పరవశించినప్పుడు ఉలిక్కిపడ్డాను
ఆటల్లో ప్రపంచ కీర్తి తెచ్చిన
ఆడబిడ్డలతో ఆటలాడుతున్నప్పుడు
బచావో భేటీ అర్థం ఇదా అని కలవరపడ్డాను
మణిపూర్‌లోని ఆటవిక పర్వం చూశాక
వాడసలు మనిషే కాదని నిర్ణయానికొచ్చాను!
నిద్ర పట్టటం లేదు
కళ్ల మూస్తే ఊరేగింపు పీడకలలు
కళ్ల తెరిస్తే ధార కడుతున్న కన్నీళ్ల
ఊపిరాడ్డం లేదిప్పుడు
నాకే కాదు; దేశానికి కూడా ..!
మరొక్కసారి ఈ మూకను పీఠం ఎక్కిస్తే
దెయ్యాలే దేశాన్నేలతాయి
ఊరేగింపులు నిత్యకృత్యమవుతాయి ...

– ఎల్.శాంతి

రచనలకు ఆహ్వానం

ఈ పేజీలో ప్రచురణార్థం రచయితల నుంచి సాహిత్య వ్యాసాలను, సాహిత్య విమర్శలను ఆహ్వానిస్తున్నాం. వ్యాసాలను కంపోజు చేసి పంపేవారు సాఫ్ట్ కాపీని, పిడిఎఫ్‌ని కలిపి పంపాలి. సమకాలీన రచనలపై విమర్శనాత్మక వ్యాసాలకు ప్రాధాన్యం ఉంటుంది. పుస్తకాలను, వ్యాసాలను కింది చిరునామాకు పంపాలి. అక్షరం, ప్రజాశక్తి కార్యాలయం, తాడేపల్లి, అరవిందా స్కూలు దగ్గర, గుంటూరు జిల్లా..
prajasavvadi@gmail.com

కెప్టెన్ లక్ష్మీ సెహగల్‌కు సిపిఎం నివాళి

న్యూఢిల్లీ : స్వాతంత్ర్య సమరయోధురాలు, అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) వ్యవస్థాపక ఉపాధ్యక్షులు కెప్టెన్ లక్ష్మీ సెహగల్‌కు సిపిఎం ఘన నివాళులర్పించింది. ఆమెను స్మరించుకుంటూ పలుచోట్ల ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించింది. మహిళల పట్ల వివక్షకు తావులేని, సమానత్వం, న్యాయం పరిఢవిల్లే సమ సమాజ నిర్మాణం కోసం పోరాటాన్ని ముందుకు తీసుకెళ్తామని ఈ సందర్భంగా ప్రతినబూనుదామని సిపిఎం పిలుపునిచ్చింది. అమరవీరులు, స్వాతంత్ర సమరయోధుల కలలను సాకారం చేసేందుకు ప్రతీక్షణం వెచ్చిద్దామని పేర్కొంది. ప్రజల హృదయాల్లో సజీవంగా ఉండే లక్ష్మీ సెహగల్ వంటి యోధులకు మనమిచ్చే ఘన నివాళి ఇదేనని సిపిఎం తెలిపింది.

మిజోరంను వీడుతున్న మెయితీలు

న్యూఢిల్లీ : మణిపూర్‌లో హింసాకాండ మిజోరంలోనూ ప్రకంపనలు సృష్టిస్తోంది. దీంతో ఇక్కడ నివసిస్తున్న మెయితీలు రాష్ట్రం వీడి వెళుతున్నారు. మిజో నేషనల్ ఫ్రంట్‌కు చెందిన పిఎంఆర్ఎ రెండో రోజుల క్రితం చేసిన ప్రకటనే ఇందుకు కారణం. మిజోరంలో నివసిస్తున్న మెయితీలు తమ భద్రత కోసం రాష్ట్రం విడిచి వెళ్లాలని పిఎంఆర్ఎ ప్రకటనలో విజ్ఞప్తి చేసింది. ఈ నేపథ్యంలో మెయితీలు మిజోరం వీడి వెళుతున్నారు. మిజోరం రాష్ట్రం నుంచి మెయితీలను తీసుకురావడానికి ఛార్టెడ్ విమానాలు ఏర్పాటు చేస్తామని మణిపూర్ ప్రభుత్వం కూడా ప్రకటించింది. మరోవైపు మిజోరంలో మెయితీల భద్రతకు ఎలాంటి ప్రమాదం లేదని మిజోరం రాష్ట్ర హోం శాఖ ప్రకటించింది. శాంతిభద్రతలు కాపాడటం కోసం ముందు జాగ్రత్తగా మిజోరం యూనివర్శిటీ, వేటీ కాలేజ్, ఫాల్కావన్ ప్రాంతాల్లో భద్రతా దళాలను ఏర్పాటు చేసినట్లు తెలిపింది.

మధ్యప్రదేశ్‌లో మరో దారుణం..

భోపాల్ : మధ్యప్రదేశ్‌లో దారుణాలకు అంతూపొంతూ లేకుండా పోతోంది. పొరపాటున తనను తాకిన ఓ దళితుడి ముఖం, శరీరంపై మానవ విసర్జితాలను చల్లాడో వ్యక్తి. చత్తర్‌పూర్ జిల్లాలో జరిగిన ఈ ఘటన మరోమారు చర్చనీయాంశమైంది. నిందితుడు రామ్‌కపాల్ పటేల్ ప్రస్తుతం తమ అదుపులో ఉన్నట్టు పోలీసులు తెలిపారు. అతడిపై పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేసినట్టు పేర్కొన్నారు. తనపై జరిగిన దారుణంపై బాధితుడు దశరథ్ అహిర్వార్ శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బుకౌరా గ్రామంలో పంచాయతీ కోసం శుక్రవారం డ్రెయిన్‌ను నిర్మిస్తున్నప్పుడు పొరపాటున గ్రీజుతో ఉన్న తన చేయి నిందితుడికి తాకినట్టు ఆయన పేర్కొన్నాడు. ఆ వెంటనే ఆగ్రహంతో ఊగిపోయిన పటేల్ సమీపంలో పడి వున్న మానవ వ్యర్థాలను మగ్గులో తీసుకొచ్చి ముఖంపైనా, శరీరంపైనా పోసినట్టు ఆరోపించాడు. అంతేకాకుండా కులం పేరుతో దూషించినట్టు తెలిపాడు.

ఖేలో ఇండియాకు శిక్షణ పొందండి

- మణిపూర్ క్రీడాకారులకు సిఎం స్టాలిన్ ఆహ్వానం

న్యూఢిల్లీ : వచ్చే ఏడాది తమిళనాడులో నిర్వహించనున్న ఖేలో ఇండియా క్రీడలకు శిక్షణ పొందేందుకు మణిపూర్ క్రీడాకారులను తమిళనాడు సిఎం ఎంకె స్టాలిన్ ఆహ్వానించారు. మణిపూర్‌లో క్రీడాకారులకు శిక్షణ ఇచ్చే ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర క్రీడల మంత్రి ఉదయనిధి స్టాలిన్‌ను ఆదేశించినట్లు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మణిపూర్‌లో నెలకొన్న పరిస్థితుల పట్ల రాష్ట్రం ఆందోళన చెందుతోందని చెప్పారు. ఈశాన్య రాష్ట్రం ప్రపంచస్థాయి క్రీడాకారులకు, ముఖ్యంగా మహిళా క్రీడాకారులకు పేరుగాంచిందని తెలిపారు. శిక్షణ తీసుకోవాలనుకుంటున్న మణిపూర్ క్రీడాకారులు తమ పేర్లు, చిరునామాలు, ఐడెంటిటీ ప్రూఫ్‌లతోsportstn2023@gmail.com లేదా +91 8925903047 లకు సంప్రదించాలని సూచించారు. తమిళనాడు స్పోర్ట్ డెవలప్‌మెంట్ అథారిటీలో అందుబాటులో ఉన్న మౌలిక సదుపాయాలను ఉపయోగించుకోవడం ద్వారా శిక్షణ పొందవచ్చునని చెప్పారు.

ఆర్‌ఎస్‌ఎస్ దుష్ప్రచార ఫలితమే

మణిపూర్ చిచ్చు

- కుకీలు మయన్మార్ నుంచి వచ్చిన వారిగా చిత్రీకరణ
- అన్నదమ్ముల్లాంటి కుకీ, మెయితీల మధ్య విద్వేష వాతావరణం

న్యూఢిల్లీ నుంచి ప్రజాశక్తి ప్రతినిధి జె.జగదీశ్వరరావు

మణిపూర్‌లో సంఘ్‌పరివార్ ఏమి విత్తుతుందో అదే పంట వస్తోంది. ఇక్కడ, ఆర్‌ఎస్‌ఎస్ మద్దతు గల సంస్థలు ద్వేషపూరిత ప్రచారంలో విస్తృతంగా ఉపయోగించే రెండు అంశాలు కొండ ప్రాంతంలో గసగసాల సాగు, అటవీ నిర్మూలన. ఈ రెండు సమస్యలకు కుకీలే కారణమని కొన్నాళ్లుగా మెయితీల మెదళ్లలోకి ఆర్‌ఎస్‌ఎస్ బలంగా ఎక్కించింది. ఇందుకోసం ఆన్‌లైన్ మీడియాను పెద్దయెత్తున దుర్వినియోగపరిచింది. అన్నదమ్ముల్లాంటి కుకీ, మెయితీల మధ్య చిచ్చుకు దీన్నే ఆయుధంగా చేసుకుంది. మణిపూర్ హైకోర్టు మెయితీలకు షెడ్యూల్డ్ తెగ హోదాను ఇవ్వడాన్ని పరిగణలోకి తీసుకున్న తరువాత, రాష్ట్రంలో చెలరేగిన అల్లర్లు దాదాపు 82 రోజులుగా రగులుతున్నాయి.

మణిపూర్‌లోని పర్వత ప్రాంతంలో 15,000 ఎకరాలకు పైగా గసగసాలు పండిస్తున్నమాట నిజమే. దీనిని కుకీ రైతులే కాదు ఇతరులు కూడా పండిస్తారు. ఇదే వారి ప్రధాన ఆదాయ వనరు. డ్రగ్స్ మాఫియాతో గసగసాల సాగుకు ముడిపెట్టి ప్రచారం చేయడం దారుణం. గసగసాలు తినదగినవి. దీని పూలను డ్రగ్స్ తయారీకి వాడతారు. డ్రగ్స్ మాఫియా మెయితీ వర్గానికి చెందిన రాజకీయ నాయకులు, వ్యాపారుల చెప్పుచేతుల్లోనే ఉంది. అటవీ సంపద కొల్లగొట్టడంలోనూ మెయితీలే ముందుంటారు. నరికిన చెట్లను మెయితీ అధినేతలు కొనుగోలు చేస్తారు. కుకీలు దీని నుంచి చిన్న మొత్తాన్ని పొందుతారు. ఈ అడవిని మెయితీ వ్యాపారులు స్వాధీనం చేసుకోవాలని కుట్ర పన్నుతున్నారు. మాఫియా గ్రూపులను అణిచివేసేందుకు చర్యలు తీసుకోకపోగా, కుకీ వ్యతిరేక ప్రచారానికి సంఘ్ పరివార్, బిజెపి ప్రభుత్వం నాయకత్వం వహిస్తున్నాయి. మరోవైపు దశాబ్దాలుగా నివాసముంటున్న కుకీలు మయన్మార్ నుంచి అక్రమంగా వలస వచ్చిన వాళ్లగా చిత్రీకరిస్తూ పచ్చి అబద్ధాలు ప్రచారం చేస్తున్నారు. ఈ విషపూరిత వాతావరణమే మణిపూర్ తగలబడడానికి ప్రధాన హేతువు. ఇప్పుడు లోయలో కుకీలు, పర్వత ప్రాంతాల్లో మెయితీలు నివసించడం అసాధ్యం. ఇంతగా మతపరమైన దాడులు జరిగాయి. కుకీలు ఎక్కువగా క్రైస్తవులు కావడంతో సంఘ్ పరివార్ కుకీ వ్యతిరేక ప్రచారం ముసుగులో క్రైస్తవ వ్యతిరేకతను చాటగలిగింది. లోయలోని మెయితీ క్రైస్తవులకు చెందిన 276 చర్చిలను కూల్చివేయడమే ఇందుకు నిదర్శనం. ఈ చర్చిలు సాధారణంగా తాత్కాలిక నిర్మాణాలు. వీటితోపాటు బాగా కట్టిన 25 చర్చిలు కూడా ధ్వంసమయ్యాయి.

మణిపూర్ ఘర్షణల్లో బిజెపి రహస్యంగా, బహిరంగంగా మద్దతిచ్చే ఉగ్రవాద సంస్థలైన అరంబై తెంగోల్, మెయితీ లీపున్ ఒకవైపు, కుకీ సాయుధ గ్రూపులు మరోవైపు ఉన్నాయి. మెయితీ దుండగులు యథేచ్ఛగా చెలరేగుతుండగా రాష్ట్ర పోలీసులు మౌన ప్రేక్షకుల్లా ఉండిపోయారు. పోలీసు ఆయుధాల నుంచి నాలుగు వేలకుపైగా తుపాకులు ఎలా మాయమయ్యాయన్న ప్రశ్నకు సమాధానం లేదు. అదే సమయంలో, ముఖ్యమంత్రి ఎన్. బీరెన్ సింగ్ కూడా నలభై కుకీ ఉగ్రవాదులను చంపామని పేర్కొన్నారు. 2017 మణిపూర్ అసెంబ్లీ ఎన్నికల సమయంలో అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ మాత్రం కుకీ తిరుగుబాటు సంస్థలతో రహస్య చర్చలు జరిపారు.

హింసాకాండలో వంద మందికి పైగా మరణించినట్లు అధికారికంగా ధ్రువీకరించిప్పటికీ, వివిధ ఏజెన్సీలు సుమారు 200 దాకా మరణాలు సంభవించినట్లు సూచిస్తున్నాయి. వెయ్యి మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు. ఐదు వేలకు పైగా ఇళ్లు దగ్ధమయ్యాయి. దాదాపు రెండు వందల గ్రామాలు అగ్నికి ఆహుతయ్యాయి. 60,000 మంది శరణార్థులుగా మారారు. మూడు, నాలుగు అంతస్తుల ఇళ్లు నేలమట్టమయ్యాయి. రాష్ట్రంలోని సీనియర్ నేతలకు కూడా భద్రత లేదు. కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ప్రభుత్వోద్యోగుల ఇళ్లపై దాడులు జరుగుతున్నాయి. మాజీ సైనికుని భార్యతో సహా మరో ఇద్దరిని వివస్త్రలను చేసి ఊరేగించారు. మహిళలపై దాడులు, అత్యాచారాలు పెరిగాయి.

స్వాతంత్ర సమరయోధుని భార్యను సజీవ దహనం చేశారు. హత్యకు గురైన కుకీల మృత దేహాలు ఇంఫాల్‌కు కూడా చేరుకోలేక మార్చురీలో కుప్పలుగా పోసి ఉన్నాయి. రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా దెబ్బతిన్నాయని కేంద్ర విదేశాంగ శాఖ సహాయ మంత్రి, మణిపూర్ లోక్‌సభ సభ్యుడు రాజ్‌కుమార్ రంజన్ సింగ్ ఆవేదన వ్యక్తం చేశారు. మణిపూర్‌లో పరిస్థితిపై మాజీ ఆర్మీ స్టాఫ్ విపి మాలిక్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. జనరల్ నిశికాంత సింగ్ దీనస్థితిని ట్విట్టర్‌లో పంచుకున్నారు. మణిపూర్ పరిస్థితి లెబనాన్ పరిస్థితిని పోలి ఉందని, పాలన లేని భూమిగా మారిందని ట్వీట్ చేశారు. 40 ఏళ్లుగా సైన్యంలో పనిచేసిన ఓ అధికారి స్పందన ఇది. మణిపూర్ పరిస్థితి పొరుగు రాష్ట్రాల్లోనూ ప్రతిబింబిస్తోంది. మణిపూర్‌లో మైనారిటీలపై వేధింపులను అంతం చేసేందుకు మిజోరాంకు చెందిన మెయితీలు జోక్యం చేసుకోవాలని మిజోరం విద్యార్థుల ప్రజావేదిక ఎంఎస్‌డిపి డిమాండ్ చేసింది. మిజోరాంలో మెయితీలు క్షేమంగా ఉండగా, మణిపూర్‌లో తమ సోదరులు పడుతున్న కష్టాలను చూడనట్లు నటించలేరని, మణిపూర్ సమస్యను సత్వరమే పరిష్కరించకుంటే భవిష్యత్తు దుర్భరంగా మారుతుందని ఎంఎస్‌డిపి ప్రకటించింది. ఈశాన్య రాష్ట్రాల్లో నెలకొన్న అశాంతి బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్‌ల విద్వేష భావజాల ప్రభావమే.

న్యాయ సంస్కరణలపై తుది ఓటింగ్‌కు ముందు

ఇజ్రాయిల్ అంతటా నిరసనల హోరు

జెరూసలెం: న్యాయ వ్యవస్థలో మార్పులపై కీలక ఓటింగ్ జరగడానికి ముందు ఇజ్రాయిల్ అంతటా నిరసనలు హోరెత్తాయి. వేలాది మంది వీధుల్లోకి వచ్చి నెతన్యాహు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలిచ్చారు. న్యాయ వ్యవస్థను నిర్వీర్యం చేయొద్దంటూ ఇజ్రాయిలీయులు చేస్తున్న ఆందోళన 29వ వారానికి చేరుకుంది. ప్రభుత్వ నిర్ణయాలను, నియామకాలను సమీక్షించే కోర్టు అధికారాలను తొలగిస్తూ నెతన్యాహు ప్రభుత్వం తీసుకొచ్చిన వివాదాస్పద న్యాయ సంస్కరణల బిల్లుపై పార్లమెంట్ (నేసెట్)లో సోమవారం తుది ఓటింగ్‌కు రానున్నది. నెతన్యాహు నేతృత్వంలోని జాతీయవాద, మతతత్వ కూటమికి పార్లమెంటులో మెజార్టీ ఉన్నందున దీనిని బుల్డోజ్ చేసే అవకాశముంది. జెరూసలెంలో 35 వేల మంది టెల్ అవీవ్ నుంచి 70 కి.మీ పొడవునా పాదయాత్ర నిర్వహించారు. శని, ఆది వారాల్లో దేశవ్యాపితంగా భారీ నిరసన ర్యాలీలు నిర్వహించారు. పార్లమెంటు ఎదుట, అలాగే వివిధ మంత్రిత్వ శాఖల కార్యాలయాల వద్ద వేలాది మంది నిరసనకారులు గుమికూడి ఈ బిల్లుకు వ్యతిరేకంగా గళమెత్తారు. వీరికి ఇజ్రాయిలీ మిలిటరీ రిజర్విస్టులు కూడా మద్దతు పలికారు. పార్లమెంటులో ఈ బిల్లును ప్రవేశపెట్టడాన్ని వ్యతిరేకిస్తూ, విధులను బహిష్కరించాలని పిలుపునిచ్చారు. పదివేల మంది మిలిటరీ రిజర్విస్టులు విధుల బహిష్కరణకు మద్దతుగా సంతకాలు చేశారు. మరో వైపు ఇజ్రాయిల్‌లోని అతిపెద్ద లేబర్ యూనియన్ సార్వత్రిక సమ్మెకు వెళ్లాలని నిర్ణయించింది. న్యాయవ్యవస్థను నిర్వీర్యం చేస్తే, నెతన్యాహు ప్రభుత్వ నిరంకుశత్వానికి అడ్డు అదుపు ఉండదని నిరసనకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నెతన్యాహు మాత్రం ఈ బిల్లుపై వెనక్కి తగ్గేది లేదని మొండికేశారు. రాజకీయ అంశాల్లో న్యాయ వ్యవస్థ జోక్యం చేసుకోవడం వల్ల పాలన సజావుగా సాగడం లేదని, న్యాయ వ్యవస్థ బలీయమైన శక్తిగా ఎదిగేందుకు యత్నిస్తున్నందున దాని అధికారాలకు పరిమితులు విధించాల్సి వస్తోందని ఆయన వాదిస్తున్నారు.

హైతీ రాజధానిలో నిరసనకారులను బాష్పవాయువుతో చెదరగొడుతున్న పోలీసులు

హైతీ ప్రధాని రాజీనామాకు డిమాండ్

పోర్టు అవ్ ప్రిన్స్: హైతీ మళ్లీ రాజకీయ సంక్షోభంలో చిక్కుకుంది. ప్రధాని ఏరియల్ హెన్రీ వట్టి అసమర్థ పాలనపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పార్లమెంటుకు ఎన్నికలు నిర్వహించలేని అచేతనావస్థలో ప్రధాని ఉన్నారని, దేశ సమైక్యతను కాపాడేందుకు వివిధ రాజకీయ గ్రూపులను కలుపుకుపోవడంలో విఫలమయ్యారని ప్రతిపక్షాలు ఇప్పటికే తీవ్రంగా ధ్వజమెత్తుతున్నాయి. హెన్రీ పాలనలో ప్రజలు అనేక కష్టనష్టాలకు గురవుతున్నారని, ప్రజాస్వామ్యయుతంగా నిరసనలు తెలిపేందుకు కూడా అవకాశమివ్వడం లేదని హక్కుల కార్యకర్తలు విమర్శిస్తున్నారు. ఈ అభద్రత నుంచే తీవ్రవాదం పుట్టుకొస్తుందనే విషయం మరచిపోరాదని వారు హెచ్చరిస్తున్నారు. క్రిమినల్ గ్యాంగ్‌లు, అరాచక మూకలు చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకుంటుంటే ప్రభుత్వం చేష్టలుడిగినట్టు వ్యవహరిస్తోందని పేర్కొంటున్నారు.ప్రధాని తప్పుకోవాలంటూ శనివారం పోర్ట్ అవ్ ప్రిన్స్‌లో భారీ ర్యాలీ జరిగింది. పార్లమెంటుకు తిరిగి ఎన్నికలు జరపాలని, ప్రధాని తప్పుకోవాలని నిరసనకారులు డిమాండ్ చేశారు.

స్పెయిన్ ఎన్నికల్లో మందకొడిగా పోలింగ్

మాడ్రిడ్: స్పెయిన్ అధ్యక్ష పదవికి, పార్లమెంటు దిగువ సభలోని 350 స్థానాలకు, 208 సెనెటర్ల స్థానాలకు ఆదివారం నిర్వహించిన ఎన్నికల్లో పోలింగ్ మందకొడిగా సాగింది. సాయంత్రం 6 గంటల వరకు 53.12 శాతం ఓట్లు మాత్రమే పోలయ్యాయి. 2019 నాటి ఎన్నికలతో పోల్చితే 3.76 శాతం తగ్గింది. పోలింగ్ ఉదయం 9 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు నిర్వహించారు. మొత్తం 3.75 కోట్ల మంది ఓటర్లు ఉన్నారు. స్పెయిన్‌లో ప్రతి నాలుగేళ్లకొకసారి పార్లమెంటు, అధ్యక్ష ఎన్నికలు జరుగుతాయి. పీపుల్స్ పార్టీ నేతృత్వంలోని కన్సర్వేటివ్ కూటమికి, సోషలిస్టు పార్టీ నేతృత్వంలోని ప్రగతిశీల కూటమికి మధ్యే ప్రధానంగా పోటీ ఉంటుంది. ఇరు పక్షాలు హోరాహోరీగా సభలు నిర్వహించాయి. పీపుల్స్ పార్టీకి పచ్చి మితవాద వోక్స్ పార్టీతో జత కట్టగా, పోడెమస్ పార్టీ లెఫ్ట్ వింగ్ సమర్‌తో పొత్తు పెట్టుకుని బరిలోకి దిగింది. ఫలితాలు సోమవారం వెలువడే అవకాశముంది.

మణిపూర్ హింసాకాండ... బహుళత్వంపై దాడి

- సీతారాం ఏచూరి

మధురై : మణిపూర్ హింసాకాండ ఫెడరలిజంపైన, బహుళత్వంపైన దాడికి ఒక సంకేతమని సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి విమర్శించారు. లౌకిక ప్రజాస్వామ్య దేశంగా ఉన్న భారత్‌ను ఫాసిస్ట్ హిందుత్వ రాష్ట్రంగా మార్చడానికి బిజెపి యత్నిస్తోందని అన్నారు. ఆదివారం మదురైలో జరిగిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. విభిన్న భాషలు, సంస్కృతులు, మతాలతో కూడిన భారత వైవిధ్యాన్ని నిలబెట్టడమే స్వాతంత్ర్యోద్యమ లక్ష్యమని అన్నారు. అందుకు భిన్నంగా బిజెపి మతం ప్రాతిపదికన దేశాన్ని విభజించాలని చూస్తోందని విమర్శించారు. దళితులు, గిరిజనులు, మహిళలపై దాడులు పెరుగుతున్నాయని అన్నారు. అదానీ కుంభకోణంపై చర్చకు ప్రభుత్వం అనుమతించకపోవడం వల్లే గత పార్లమెంట్ సమావేశాలు నిరర్థకంగా ముగిసాయని అన్నారు. పార్లమెంటుకు జవాబుదారీగా ఉండాల్సిన ప్రభుత్వం దాన్ని అడ్డుకోవడం గర్హనీయమని అన్నారు. జాతీయ విద్యా విధానం, వ్యవసాయ చట్టాలను కేంద్రప్రభుత్వం ఏకపక్షంగా తీసుకొచ్చిందని అన్నారు. రాష్ట్రాలకు సంబంధించిన అధికారాల్లో చొరబడుతోందని విమర్శించారు. రాష్ట్రాల హక్కులు పరిరక్షించుకోవడం వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బిజెపిని ఓడించడం ద్వారానే సాధ్యమవుతుందని అన్నారు. డిఎంకె ఎంపి తిరుచ్చి ఎన్.శివ మాట్లాడుతూ.. కేంద్రంలో ఏకీకృత ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు బిజెపి చేస్తున్న యత్నాలను తిప్పికొట్టాలని అన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు సుదర్శన్ నాచియప్పన్, సిపిఎం తమిళనాడు రాష్ట్ర కార్యదర్శి కె. బాలకృష్ణన్, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి ఆర్. ముత్తరాసన్ తదితరులు పాల్గొన్నారు.

యమున మరోసారి ఉగ్రరూపం

న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. ఈ క్రమంలో దేశ రాజధాని ఢిల్లీలో యమునా నది ప్రవాహం ఆదివారం మరోసారి ప్రమాదకరస్థాయి (205.81 మీటర్లు)ని దాటింది. ముఖ్యంగా, ఓల్డ్ రైల్వే బ్రిడ్జి వద్ద యమునా నదిలో నీటిమట్టం శనివారం రాత్రి 10:00 గంటలకు 205.48 మీటర్లుగా నమోదైంది. దీంతో మరోసారి ఢిల్లీలో పలు ప్రాంతాల్లో వరదలు తలెత్తే ప్రమాదం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఆదివారం సాయంత్రం 6 గంటలకు యమున నీటిమట్టం 206.35 మీటర్లుగా నమోదైంది. ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్‌లోని పలు ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా హత్నికుండ్ బ్యారేజ్ నుంచి నదిలోకి నీటిని విడుదల చేశారు. దీంతో యమునా నదిలో నీటిమట్టం ప్రమాదకరస్థాయికి చేరుకుంది. ఢిల్లీలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో చేపడుతున్న సహాయక, పునరావాస కార్యక్రమాలపై ఇది ప్రభావం చూపించే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. 'హత్నికుండ్ బ్యారేజ్ నుంచి రెండు లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేయడం వల్ల ఢిల్లీలోని కొన్ని ప్రాంతాలు ముంపునకు గురయ్యే అవకాశం ఉంది. ఇప్పటికే లోతట్టు ప్రాంతాల్లో ఉన్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాం. ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది' అని ఢిల్లీ మంత్రి అతిషీ వెల్లడించారు. గతవారం వర్షాల కారణంగా యమునా నది నీటిమట్టం అత్యధికంగా 208.05 మీటర్లకు చేరింది. గత కొద్ది రోజులుగా నీటి మట్టం 205.02 మీటర్లుగా ఉంది. తాజాగా హత్నికుండ్ బ్యారేజ్ నుంచి నీటిని విడుదల చేయడంతో ఆదివారం ఉదయం 206.07 మీటర్లకు చేరుకుంది. మరోవైపు జులై 25 వరకు ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్‌లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని కేంద్ర వాతావరణ అంచనా వేసింది. హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్, హర్యానా సహా యమునా ఎగువ పరివాహక ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాల కారణంగా వరదలు తలెత్తాయి. వరదల కారణంగా 27,000 మందికి పైగా ప్రజలు తమ ఇండ్లను ఖాళీ చేసినట్టు అధికారులు తెలిపారు.

18 ఏళ్ల బాలికపై గ్యాంగ్‌రేప్

- మహిళలే సాయుధ మూకకు అప్పగించారు
- ఫిర్యాదులో పేర్కొన్న బాధిత బాలిక

ఇంఫాల్, న్యూఢిల్లీ : మణిపూర్‌లో మహిళలపై జరుగుతున్న అకృత్యాలు ఒక్కొక్కటీ వెలుగులోకి వస్తున్నాయి. మే 15న ఇంఫాల్ ఈస్ట్‌లో 18 ఏళ్ల బాలికను అపహరించి, గ్యాంగ్‌రేప్ చేసిన ఘటనపై ఈ నెల 21న జీరో ఎఫ్ఐఆర్ నమోదయింది. ఈ ఎఫ్ఐఆర్ ప్రకారం కొంతమంది మహిళల గుంపే ఈ బాలికను సాయుధ గూండాలకు అప్పగించింది. మే 15న ఆ ప్రాంతంలో కవాతు చేసుకుంటూ వెళుతున్న మెయితేలకు చెందిన 'మైరా పైబీస్' అనే మహిళల బృందం (దీనిని మదర్స్ ఆఫ్ మణిపూర్‌గా పిలుస్తారు) ముందుగా ఈ బాలికను గుర్తించింది. నలుగురు సభ్యులున్న సాయుధ గూండాల గ్రూపునకు బాలికను అప్పగించింది. తరువాత గ్యాంగ్ రేప్‌కు గురైన బాలిక తీవ్రగాయాలతో సమీప రాష్ట్రం నాగాలాండ్‌లోని ఒక ఆసుపత్రిలో చేర్చబడింది. ఈ నెల 21న శుక్రవారం కాంగ్పోక్పి పోలీసు స్టేషన్‌ను ఆశ్రయించింది. ఆమె ఫిర్యాదుతో వివిధ సెక్షన్ల కింద జీరోఎఫ్ఐఆర్‌ను నమోదు చేశారు. తరువాత ఈ కేసును ఇంఫాల్ ఈస్ట్ స్టేషన్‌కు బదిలీ చేశారు.

పోలీసులపై నమ్మకం లేదు...

మే 15న సాయంత్రం 5 గంటల సమయంలో తనను నలుగురు సాయుధ వ్యక్తులు కారులో అపహరించారని 18 ఏళ్ల బాలిక ఫిర్యాదులో పేర్కొంది. కారులోనే తీవ్రంగా కొట్టుకుంటూ ఒక కొండ ప్రాంతం వద్దకు తీసుకెళ్లారని, వారిలో ముగ్గురు తనపై అత్యాచారానికి పాల్పడ్డారని తెలిపింది. తరువాత కూడా తీవ్రంగా కొట్టారని, తనను చంపడానికే నిర్ణయించుకున్నారని ఫిర్యాదులో వెల్లడించింది. సురక్షితమైన ప్రదేశంలో చంపడానికి, తనను మళ్లీ కారులో ఎక్కించుకుని తీసుకుని వెళ్లడానికి ప్రయత్నిస్తుంటే కారు తగిలి కొండ కిందకు తాను పడిపోవడంతో వారు వెళ్లపోయారని తెలిపింది. తరువాత తాను రోడ్డు వద్దకు చేరుకుని ఒక ఆటో డ్రైవర్‌ను సహాయం కోరానని, తనను కూరగాయల కుప్ప కింద దాచి బిష్ణుపూర్ పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లాడని చెప్పారు. పోలీసులపై నమ్మకం లేక న్యూ లంబులనే ప్రాంతంలో దింపాలని డ్రైవర్‌ను వేడుకున్నట్లు తెలిపింది. తరువాత రోజు ఉదయం మే 16 ఉదయం 4:30 గంటలకు ఇంఫాల్ చేరుకున్నానని, అక్కడి నుంచి కాంగ్పోక్పి జిల్లా ఆసుపత్రికి వెళ్లానని చెప్పింది. పరిస్థితి విషమంగా ఉండటంతో అక్కడ సిబ్బంది తనను నాగాలాండ్‌లోని కోహిమా ఆసుపత్రికి తరలించారని తెలిపింది.

ఆరో నిందితుడి అరెస్టు

మణిపూర్‌లో మే 4న ఇద్దరు గిరిజన మహిళలను వివస్త్రను చేసి, ఊరేగించిన కేసులో ఆరో వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఆ రాష్ట్ర పోలీసులు తాజాగా వెల్లడించారు. ఇప్పటి వరకూ ఈ కేసులో ఆరుగుర్ని అరెస్టు చేశామని, ఒకరు 19 ఏళ్ల జువెనైల్ అని పోలీసులు తెలిపారు.

కోల్‌కతాలో ఐద్వా ఆధ్వర్యాన ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు

బీరేన్‌సింగ్ రాజీనామా చేయాలి

- దేశవ్యాప్తంగా కొనసాగుతున్న ఆందోళనలు

న్యూఢిల్లీ : మణిపూర్‌లో ఘోర హింసాకాండను అదుపు చేయడంలో పూర్తిగా విఫలమైన సిఎం ఎన్.బీరేన్‌సింగ్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ దేశవ్యాప్తంగా ఆందోళనలు కొనసాగుతున్నాయి. పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలో ఐద్వా ఆధ్వర్యాన మహిళలు భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. మణిపూర్‌లో మహిళలపై జరుగుతున్న హింసపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జార్ఖండ్ రాష్ట్రవ్యాప్తంగా సిపిఎం, వివిధ ప్రజాసంఘాలు పెద్దఎత్తున ఆందోళనలు చేశాయి. బీరేన్‌సింగ్ దిష్టిబొమ్మలను తగలబెట్టాయి. మహారాష్ట్రలోని మరోల్ తదితర ప్రాంతాల్లో సిపిఎం, ఐద్వా, డివైఎఫ్ఐ ఆధ్వర్యాన ఆందోళన నిర్వహించారు.

ప్రధాని దేశానికి క్షమాపణ చెప్పాలి
సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కెకె శైలజ

ఆడపిల్లలను వీధుల్లో ఊరేగించి సామూహిక అత్యాచారం చేసి చంపే దేశంగా భారతదేశం దిగజారిపోయిందని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కెకె శైలజ విమర్శించారు. మహిళలు, బాలికల గౌరవాన్ని కాపాడడంలో విఫలమైనందుకు ప్రధాని జాతికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అల్లర్లకు సహకరిస్తున్న మణిపూర్ ముఖ్యమంత్రిని వెంటనే బర్తరఫ్ చేయాలన్నారు, మణిపూర్‌లో జరిగిన సామూహిక అత్యాచారం, హత్యకు వ్యతిరేకంగా తలస్సేరిలో మహిళా అసోసియేషన్ జిల్లా కమిటీ నిర్వహించిన నిరసన ర్యాలీని ఆమె ప్రారంభించారు. మణిపూర్ కాలిపోతుంటే మోడీ విదేశాల్లో పర్యటిస్తున్నారని అన్నారు. స్వాతంత్ర్య సమరయోధుడి భార్యను ఆమె ఇంట్లోనే కాల్చివేసి, కార్గిల్ యుద్ధ సైనికుడి భార్యను వివస్త్రను చేశారని విమర్శించారు. డబుల్ ఇంజన్ ప్రభుత్వం మహిళల, యువతుల గౌరవాన్ని కాపాడలేకపోయిందని అన్నారు. ఇంటర్నెట్‌ను నిలిపివేయడం ద్వారా మణిపూర్‌లో ఏం జరుగుతుందో ప్రపంచానికి తెలియకూడదని మోడీ భావించారని చెప్పారు.

అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వలేదు

- మోడీపై మణిపూర్ బిజెపి ఎమ్మెల్యే నిరసన గళం
- మానవత్వం చూపలేదని మండిపాటు

ఇంఫాల్ : మణిపూర్‌కు చెందిన బిజెపి ఎమ్మెల్యే పవోలియన్‌లాల్ హోకిప్ ప్రధాని నరేంద్ర మోడీపై విమర్శనాస్త్రాలు సంధించారు. హింసాకాండతో రాష్ట్రం అట్టుడుకుతుంటే మోడీ అమెరికాలో పర్యటించడాన్ని తప్పుపడుతూ సమస్య ప్రాధాన్యతను ఆయన ఏ మాత్రం అర్థం చేసుకోలేదని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో పరిస్థితిని చక్కదిద్దడంలో కేంద్రం విఫలమైందని విమర్శించారు. మణిపూర్ హింసపై మోడీ తొలిసారిగా పెదవి విప్పిన విషయాన్ని ప్రస్తావిస్తూ '79 రోజుల పాటు పట్టించుకోలేదు. హింస చెలరేగుతున్న తరుణంలో వారం రోజులు కూడా సుదీర్ఘ సమయమే' అని చెప్పారు. న్యూస్‌లాండ్రీ సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో మోడీపై హోకిప్ నేరుగా విమర్శలు చేశారు.

అమెరికా పర్యటనకు ముందు ప్రధానిని కలుసుకునేందుకు తాను చేసిన ప్రయత్నం ఫలించలేదని హోకిప్ తెలిపారు. ప్రజలు మారణహోమానికి బలవుతుంటే సమస్యను పరిష్కరించడంలో మానవత్వం చూపలేదని మండిపడ్డారు. ప్రజా ప్రతినిధిగా ప్రధాని అపాయింట్‌మెంట్ కోరానని, అయితే ఆయన నుంచి స్పందన రాలేదని చెప్పారు. ఇప్పటికి కూడా పరిస్థితి తీవ్రతను ప్రధానికి వివరించే అవకాశం కోసం ఎదురు చూస్తూనే ఉన్నామని అన్నారు. రాష్ట్రం నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న పది మంది కుకీ ఎమ్మెల్యేలలో హోకిప్ ఒకరు. కుకీలకు ప్రత్యేక పాలనా వ్యవస్థను ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. చిన్, కుకీ, మిజో, జోమీ గిరిజన తెగలను కాపాడడంలో తమ ప్రభుత్వం విఫలమైందని మండిపడ్డారు. రాష్ట్రంలోని మైనారిటీ తెగలపై మెజారిటీ మైతీలు నిరాటంకంగా సాగిస్తున్న హింసకు రాష్ట్ర ప్రభుత్వం మద్దతు ఇస్తోందని ఆరోపించారు. కుకీ మహిళలపై లైంగిక దాడి జరిగిన విషయం తనకు తెలియదని ముఖ్యమంత్రి బీరేన్ చేసిన ప్రకటనపై వ్యాఖ్యానిస్తూ ఇది వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకేనని అన్నారు. రాష్ట్రంలో హింసకు మైతీలు, పోలీసు కమాండోలే కారణమని నిందించారు. మణిపూర్ విషయంలో పార్టీ అభిప్రాయంతో విభేదించడాన్ని ప్రస్తావిస్తూ కొన్ని అంశాలలో పార్టీ వైఖరికి భిన్నంగా వ్యవహరించాల్సిన అవసరం ఉన్నదని హోకిప్ చెప్పారు.

ఆఫ్ఘన్‌లో ఆకస్మిక వరదలు

- 26కు చేరిన మృతుల సంఖ్య
- 40 మంది గల్లంతు

కాబూల్ : మధ్య ఆఫ్ఘనిస్థాన్‌లో ఈ నెల 18న సంభవించిన ఆకస్మిక వరదల్లో మరణించినవారి సంఖ్య 26కు చేరుకుంది. 40 మంది గల్లంతయ్యారు. ఈ విషయాన్ని ఆఫ్ఘనిస్థాన్ విపత్తు నిర్వహణ అధికారులు ఆదివారం వెల్లడించారు. ఎడతెరిపి లేని భారీ వర్షాలతో మధ్య ఆఫ్ఘనిస్థాన్‌లో ఈ నెల 18వ తేదీ అర్ధరాత్రి ఆకస్మిక వరదలు సంభవించాయి. దేశవ్యాప్తంగా వరదల కారణంగా శుక్రవారం నుంచి ఇప్పటి వరకూ 31 మంది మరణించినట్లు చెప్పారు. ఆస్థులకు, వ్యవసాయ భూములకు తీవ్ర నష్టం వాటిల్లిందని తెలిపారు. 604 నివాస గృహాలు పూర్తిగా నాశనమయ్యాయని, వందలాది ఎకరాల వ్యవసాయ భూములు నష్టానికి గురయ్యాయని అధికారులు పేర్కొన్నారు. ఆఫ్ఘనిస్థాన్‌లో గత నాలుగు నెలల్లో ప్రకృతి విపత్తుల కారణంగా మొత్తంగా 214 మంది ప్రజలు మరణించారు.

మీకోసం

దాల్చిన చెక్క, పసుపు, జాపత్రి, లవంగాలను సమానంగా తీసుకుని బాగా నూరి అందులో తేనె కలిపి పూటకు ఒక టీస్పూన్ చొప్పున తీసుకుంటే జలుబు త్వరగా తగ్గుతుంది.

జీవన సౌరభం

జీవితంలో ప్రతిరోజూ నిన్నటి కన్నా ఎక్కువ విషయాలు నేర్చుకుంటూ ఉండాలి.

JEEVANA జీవన the family

పల్లె ప్రకృతి వనం

రామాపురం చుట్టుపక్కల ప్రాంతమంతా పచ్చని చెట్లు, పూలు, పండ్ల తోటలతో కళకళలాడుతూ ఉండేది. అడవి జంతువులన్నీ అక్కడే సేదతీరేవి. ఒకసారి రోడ్డు వెడల్పు పేరుతో ఆ చెట్లను, పండ్లు, పువ్వుల తోటలను పూర్తిగా నరికివేశారు. దీంతో, పచ్చగా ఉన్న ఆ ప్రాంతమంతా ఎడారిగా మారిపోయింది. అడవి జంతువులకు నిలువ నీడ లేకుండా పోయింది. ఆహారం కరువైంది. ఆకలితో అలమటించిన జంతువులన్నీ తమకు ఈ గతి పట్టించిన మనుషులకు తగిన గుణపాఠం చెప్పాలని నిర్ణయించుకున్నాయి.

అనుకున్నదే తడువుగా దశల వారీగా రామాపురంపై దండయాత్రకు బయలుదేరాయి. కోతులు ఇళ్లలోకి చొరబడి నానా బీభత్సం చేశాయి. తరువాత ఎలుగుబంట్లు, ఏనుగులు, చివరకు పెద్ద పులి కూడా గ్రామంలోకి చొరబడి ప్రజలను భయభ్రాంతులకు గురిచేశాయి. గ్రామస్తులంతా చాలా భయపడిపోయారు. ప్రతిరోజూ ఇలా ఎందుకు జరుగుతోంది? పండిన పదార్థాలను తిననివ్వకుండా జంతువులు ఎందుకు ఇలా చేస్తున్నాయి? అంటూ ఆలోచనల్లో పడ్డారు.

అప్పుడు ఊళ్లో ఓ పెద్దాయన 'చెట్లను నరకడం వలనే మనకీ గతి పట్టింది. మనం అడవి జంతువులకు నిలువ నీడ లేకుండా చేశాం. అందుకే అవి మన మీద ప్రతీకారం తీర్చుకుంటున్నాయి. కాబట్టి మనమంతా 'పల్లె ప్రకృతి వనాన్ని' ఏర్పాటు చేద్దామ'ని చెప్పాడు. పెద్దాయన నిర్ణయానికి ఊరంతా అంగీకరించి ప్రతి ఒక్కరూ పల్లె ప్రకృతి వనం పేరుతో ఊరికి పక్కనే ఓ ప్రాంతాన్ని ఎంచుకుని అక్కడ పండ్లు, కాయలు, చెట్లను నాటారు. వాటిని సంరక్షించుకునే బాధ్యత కూడా తీసుకున్నారు. కొన్ని నెలల తర్వాత ఆ ప్రాంతమంతా పచ్చటి వనంలా తయారైంది. క్రమక్రమంగా అడవి జంతువుల రాక తగ్గింది. అవి అక్కడే ఉండి సంతోషంగా గడుపుతున్నాయి. రామాపురం గ్రామస్తులు సంతోషించి ఇకపై చెట్లను నరక కూడదని నిర్ణయించుకున్నారు. తమ ఉపాయం పారి, మనుషుల్లో మార్పు వచ్చినందుకు జంతువులు సంతోషించాయి.

- యాడవరం చంద్రకాంత్ గౌడ్,
94417 62105

కనుక్కోండి చూద్దాం

ఆంగ్ల మాసములో కొన్ని పదాలు దాగి ఉన్నాయి. ఆధారాలతో వాటిని గడులలో నింపుట

January	జాడి	J	A	R		
February	భయం	F	E	A	R	
March	పొట్టేలు	R	A	M		
April	గాలి	A	I	R		
May	నా యొక్క	M	Y			
August	వాయువు	G	A	S		
September	కలుసుకొను					
October	మంచం					
November	నరం					
December	తేనెటీగ					

పిల్లలూ, ఇక్కడ కొన్ని ఇంగ్లీషు నెలల పేర్లు ఇచ్చాం. వాటి పక్కనే ఇచ్చిన తెలుగు పదాలకు సరిపోయే ఇంగ్లీషు పదాలు అందులోనే ఉన్నాయి. ఉదాహరణకు కొన్ని ఇచ్చాం.. మిగిలినవి మీరు రాయండి.

నేను గీసిన బొమ్మ

వై రేవతి,
7వ తరగతి,
రాయిలాపూర్, మెదక్ జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

అందమైన ఎడ్ల బండి... అద్దాల్లో ఉండునండి...

ఒకప్పుడు ఇలాంటి వర్షాకాలం వచ్చిందంటే- పొలాల్లో ఎద్దులు పూన్చిన నాగళ్లు హల్‌చల్ చేసేవి. పంటలు వేయటానికి నేలను సిద్ధం చేసేవి. అలాగే, పొలాన పండిన పంటను ఎడ్లబళ్లు ఇళ్లకు, మార్కెట్లకు తరలించేవి. వ్యవసాయంలో కీలకపాత్ర పోషించిన ఎద్దు, ఎడ్ల బళ్లు ఇప్పుడు దాదాపుగా కనుమరుగయ్యాయి. అయితే, ఆ ఎడ్లను, ఎడ్లబళ్లను మన కళ్లముందు సజీవ రూపాలుగా నిలుపుతున్నారు రహంతుల్లా. అచ్చమైన టేకుతో అతడు రూపొందిస్తున్న ఈ కళారూపాలు ఇప్పుడు గొప్ప ఆదరణ పొందుతున్నాయి.

తాత ఇస్మాయిల్ స్ఫూర్తితో ...

ఆకలి కష్ట పడటాన్ని అలవాటు చేస్తుంది. ఆలోచన బతకటాన్ని నేర్పిస్తుంది. లక్ష్యం జీవితాన్ని విజయపథాన నడిపిస్తుంది. ఇందుకు వండ్రంగి పనిచేసే రహంతుల్లాఖాన్ జీవితం నిదర్శనం. తాను ఎన్నో కష్టాలు.. మరెన్నో బాధలు వాటిని మనసులో దిగమింగుకున్నారు. విజయం కావాలంటే గమనం మార్చుకోవాల్సిందేనని భావించారు. గృహాలంకరణకు ఉపయోగించే వస్తువులను తయారుచేస్తూ జీవనోపాధి పొందుతున్నారు.

పశ్చిమ గోదావరి జిల్లా కాళ్ల మండలం కాళ్లకూరుకు చెందిన రహంతుల్లా ఖాన్ తొమ్మిదో తరగతి వరకూ మాత్రమే చదివారు. తల్లిదండ్రులు ఆయూన్‌ఖాన్, అఫ్రీన్నీసా. తండ్రి టైలరింగ్ వృత్తిలోనూ, తల్లి గృహిణిగా ఉన్నారు. రహంతుల్లాఖాన్‌కు ముగ్గురు అన్నతమ్ముళు, ఇద్దరు సోదరీమణులు.

కలిదిండి మండలం కోట కలిదిండి అమ్మమ్మ ఊరు. రహంతుల్లా విద్యాభ్యాసమంతా అక్కడే జరిగింది. ఆరుగురుతో సంసారాన్ని ఈదటం తల్లిదండ్రులకు భారంగా ఉందని భావించిన రహంతుల్లాఖాన్ జీవితంలో ఎదగాలంటే తను కొత్తగా ఏదో ఒకటి చేయాలని భావించి 'ఎద్దులబండి' బొమ్మలను గీయాన్ని వృత్తిగా ఎంచుకున్నాడు.

తాత బాటకు ఆధునికత జోడించి ...

రహంతుల్లా తొమ్మిదో తరగతి అయ్యాక చదువు ఇక ముందుకు సాగదని భావించాడు. చదువుకు స్వస్తిచెప్పి తాత మహమ్మద్ ఇస్మాయిల్ బాటలో (ఆయన నాటు ఎడ్లబళ్లతయారు చేసేవారు) పయనిస్తూ అలంకరణలో ఆకర్షణీయంగా ఉండే గృహోపకరణాలను తయారు చేయటం మొదలు పెట్టాడు. టేకు కలపకు తుది మెరుగులు దిద్ది పాలిష్‌తో అద్భుతాలు సృష్టించాడు. మొదట్లో ఆర్థిక ఇబ్బందులు తాండవ నాట్యం చేశాయి. అప్పులు చేసి తన వృత్తికి అవసరమైన పనిముట్లు, యంత్ర సామగ్రి కొనుగోలు చేశారు. దుకాణాన్ని బాడుగకు తీసుకున్నారు. ఎంతో ఓపికతో నిత్య నూతనంగా పనిచేస్తూ ఎంతో ఆకర్షణీయంగా ఉండే చెక్క పనిముట్లు తయారు చేస్తున్నారు. ఇంటి తలుపులు, కిటికీలు, డైనింగ్ టేబుళ్లు, మంచాలు, వ్యవసాయానికి కావాల్సిన నాగలి, కాడిమేడి, బండి ... ఇలా రకరకాల వస్తువులు తయారుచేస్తూ మార్కెట్లో విక్రయిస్తున్నారు.

ఎడ్లబళ్లకు మంచి గిరాకీ

రహంతుల్లా బొమ్మలు సృజనాత్మకతకు ప్రతిరూపంగా నిలుస్తుండటంతో ప్రభుత్వ, ప్రయివేటు సంస్థలు, ఆఫీసులు, పెద్ద కార్యాలయాల్లో టీపాయిలు, షోకేసుల్లో పెట్టుకోవటానికి కొనుగోలు చేస్తున్నారు. గతంలో ఇళ్లల్లో వాడుకోవడానికి వస్తువులన్నీ టేకుతో చేసినవే దొరికేవి. మళ్లీ పాత రోజులను గుర్తుకు తేస్తూ వాటిని తయారు చేస్తున్నారు రహంతుల్లాఖాన్. పనితనానికి నైపుణ్యం జోడించి ఆధునికతకు అద్దం పట్టే విధంగా వివిధ కళాకృతులు నచ్చే విధంగా తయారు చేస్తుండటంతో అందరినీ ఇట్టే ఆకర్షిస్తున్నాయి.

ఆరేళ్ల శిక్షణతో నైపుణ్యం

రహంతుల్లా ప్రారంభంలో కైకలూరులో రాజులపూడి నాగరాజు వద్ద ఆరేళ్లపాటు వడ్రంగి పనిలో శిక్షణ పొందారు. వినియోగించే ఎడ్ల బండ్లు, మంచాలు, కుర్చీలు, డ్రైనింగ్ టేబుళ్ల వంటివి తయారు చేయడం నేర్చుకున్నాడు. భీమవరం పరిసర ప్రాంతాల్లో ఎడ్ల బండి తయారీ కార్పెంటరీ షాపులు లేవు. రహంతుల్లాఖాన్ ఇది తెలుసుకుని కాళ్ళకూరులో కార్పెంటరీ షాపు ఏర్పాటు చేశారు. ఇప్పుడు అక్కడే తాను తయారు చేసిన రకరకాల వస్తువులను విక్రయిస్తున్నారు. వ్యవసాయం, ఆక్వా రైతులు, ఇంతకుముందు ఎడ్ల బండి వాడే రైతులు కూడా ఎడ్లబండ్ల బొమ్మలను చూసి కొనుగోలు చేస్తున్నారు. దేశ విదేశాల్లో ఉన్న పిల్లలకు పెళ్ళిళ్లు, ఇతర శుభకార్యాలు, దుకాణాల ప్రారంభం తదితర సందర్భాల్లో బహుమతులుగా ఈ బొమ్మలను పంపుతున్నారని రహంతుల్లా ఖాన్ తెలిపారు.

ఆర్డర్లపైనా తయారీ..

సైజును బట్టి, పనితనాన్ని బట్టి ఈ ఎండ్ల బండి ధర పలుకుతుంది. టేకుతో తయారుచేసిన ఎడ్ల బండి చిన్న సైజులో రూ.7000, పెద్దది రూ.30 వేలకు విక్రయిస్తున్నారు. రోజ్‌వుడ్‌తో తయారుచేసిన చిన్నఎడ్ల బండి రూ 14 వేలు, పెద్ద ఎడ్ల బండి రూ 45 వేల ధర పలుకుతోంది. టీపాయ్ టేకుతో అయితే రూ.30 వేలు, రోజ్‌వుడ్‌తో తయారుచేసిన రూ.45 వేలు చొప్పున ఆర్డర్లపై తయారుచేసి విక్రయిస్తున్నారు. చాలామంది రైతులు ఇళ్లల్లో, అపార్ట్‌మెంట్లల్లో టేకు, రోజువుడ్‌తో తయారుచేసిన వాటికి ప్రాధాన్యత ఇస్తున్నారు. టేకు, రోజ్‌వుడ్‌లతో తయారు చేసిన ఎడ్లబండ్లు ఆకర్షణంగా ఉంటున్నాయి. వాటికి మంచి గిరాకీ లభిస్తోంది.

- గొట్టేటి శ్రీనివాసులు,
9397139966,
కాళ్ల మండలం, పశ్చిమ గోదావరి జిల్లా,

నలుగురు మెచ్చుకునేలా జీవిస్తున్నా ...



కైకలూరులో రాజులపూడి నాగరాజు వద్ద వడ్రంగి పని నేర్చుకున్నాను. చెక్కతో ఆకృతులు చేయడం అంత సులభం కాదు. నేర్చుకోవడానికి ఓపిక, పట్టుదల కావాలి. ప్రస్తుతం ఈ వృత్తిలో కూడా యాంత్రీకరణ వినియోగం పెరిగింది. కొన్ని పనులు చేతితో మరికొన్ని పనులు యంత్రాలతో చేస్తాను. కాలం మారడంతో చాలామంది వడ్రంగి పనిచేసేవారు ఉపాధి కోసం వేరే ఊళ్లకు వెళ్లిపోతున్నారు. ప్రస్తుతం ఈ పనులు చేతితో చేయడానికి ఎవరూ ఇష్టపడడం లేదు. ఈ పని నేర్చుకునే వారు కూడా అరుదు. వేరే పని చేయలేక ఈ వృత్తినే నమ్ముకున్నా. రోజుకి ఎనిమిది గంటలు పనిలో నిమగ్నమై తయారు చేస్తున్నా. తాత నాటు ఎడ్లబండ్లు తయారుచేసేవారు. నేను టేకు కలపతో ఎద్దుల బండ్లు తయారుచేస్తున్నా. ఉత్పత్తులకు మంచి గిరాకీ మార్కెట్లో ఉంటోంది.

- రహంతుల్లా ఖాన్,
వడ్రంగి, కాళ్లకూరు.

ముఖ్య పాత్రల్లోకి చిన్న నటులు

తండ్రి, తాత, పెదనాన్న, బాబాయ్.. వారసులుగా తెలుగు ఇండస్ట్రీలో పుట్టగొడుగుల్లాగా హీరోలు పుడుతూనే ఉన్నారు. ఒక్క చిరంజీవి కుటుంబం నుండే పది మందికి పైగా ఈ జాబితాలో ఉన్నారు. ఇక కృష్ణ, కృష్ణంరాజు, బాలకృష్ణ, నాగార్జున, వెంకటేష్ వారసులూ రెండో తరం వారసులుగా చలామణి అవుతున్నారు. ఇంతమంది మధ్య దర్శకులు, నిర్మాతలు, బయ్యర్ల వారసులుగా కూడా చాలామంది కనిపిస్తున్నారు. అయితే.. వీళ్లందరిలో.. ఈ హీరోల పక్కన చిన్న చిన్న పాత్రలు వేస్తూ కనిపించిన నటులు... ఇప్పుడు ప్రధాన పాత్రల్లోకి, ముఖ్య బాధ్యతల్లోకి మారి అందరి చూపు తమవైపు తిప్పుకుంటున్నారు.

టాలెంట్ ఉన్నా అవకాశాలు రాక, ఇవ్వక ఉన్న నిరుత్సాహపరులు ఇండస్ట్రీలో కోకొల్లలు. వారందరికీ ఇప్పుడు ఈ నటులు చీకట్లో వెలుగురేఖలా కనిపిస్తున్నారనడం అతిశయోక్తి కాదు. ప్రియదర్శి, రాహుల్ రామకృష్ణ, సత్య, అజయ్, సప్తగిరి, వెన్నెల కిషోర్, షకలక శంకర్, సుధీర్, శ్రీను, ఆది వంటి వారు ఈ జాబితాలో ముందువరుసలో నిలుస్తున్నారు.

ప్రియదర్శి :

2016లో విడుదలైన 'టెర్రర్' చిత్రంతో ఉగ్రవాది పాత్రతో ఇండస్ట్రీకి పరిచయమయ్యాడు ప్రియదర్శి. అదే సంవత్సరం వచ్చిన 'పెళ్లి చూపులు' సినిమాలో హీరో ఫ్రెండ్ పాత్రలో తనదైన కామెడీతో అలరించాడు. ఆ తరువాత వరుసగా వరుణ్‌తేజ్ 'తొలిప్రేమ', నాని 'నేల టికెట్', 'నోటా' 'రంగుల రాట్నం', 'ఉన్నది ఒకటే జిందగీ', 'ఒకే ఒక జీవితం', 'గ్యాంగ్ లీడర్', 'జాతి రత్నాలు' వంటి అనేక చిత్రాల్లో చిన్నా, పెద్దా పాత్రల్లో కనిపించాడు. తండ్రి ప్రొఫెసర్, తల్లి కూడా విద్యావంతురాలు. చెల్లి నేవీలో ఉద్యోగి. విద్యావంతుల కుటుంబంలో పుట్టి, పోస్టు గ్రాడ్యుయేట్ చేసిన ప్రియదర్శికి నటనంటే అమితాసక్తి. ఆ ఆసక్తితోనే వచ్చిన ప్రతి చిన్న అవకాశాన్ని వినియోగించుకుంటూ ఇండస్ట్రీలో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని ఏర్పాటు చేసుకున్నాడు. నటన ప్రారంభించిన తొలినాళ్లలోనే 'పెళ్లి చూపులు' చిత్రంతో ఉత్తమ కామెడీ అవార్డు సొంతం చేసుకుని ప్రతిభ గల నటుడిగా గుర్తింపు తెచ్చుకున్నాడు. ఆ తరువాత 2019లో 'మల్లేశం' చిత్రంలో ఆయన నటనలో మరో కోణం చూశారు ప్రేక్షకులు. కామెడీ పాత్రల్లోనే కాక, సీరియస్ లుక్‌లో కూడా తన నటనతో మెప్పించాడు. ఆ తరువాత వెబ్‌సిరీస్‌లతో ఆకట్టుకున్నాడు. ప్రియదర్శి నటనకు విమర్శకుల నుండి కూడా ప్రశంసలు వచ్చేవి. కెరియర్‌లో వరుస చిత్రాలతో దూసుకుపోతున్న ఈ నటుడు తాజాగా చేసిన 'బలగం' సినిమా ఇండస్ట్రీ హిట్‌గా నిలిచింది.

రాహుల్ రామకృష్ణ :

తరుణ్ భాస్కర్ దర్శకత్వంలో 'సైన్మా' అనే షార్ట్ ఫిలిం ద్వారా ఇండస్ట్రీకి పరిచయమయ్యాడు రాహుల్. ఆ తర్వాత 'జయమ్ము నిశ్చయమ్ము' సినిమాతో వెండితెరపై కనిపించాడు. 'అర్జున్ రెడ్డి' సినిమాలో విలక్షణ నటనతో ప్రేక్షకుల చూపు తనవైపు తిప్పుకున్నాడు. ఇక అప్పటి నుండి వెనక్కితిరిగి చూసుకోలేదు. చిన్నా పెద్దా సినిమాల్లో విభిన్న పాత్రల్లో నటిస్తూ అలరిస్తున్నాడు. రాహుల్ నటించిన సినిమాల జాబితా పెద్దదే. 'విమానం', 'ఓరి దేవుడా' చిత్రాల్లో విలక్షణ నటన కనబరిచాడు. తాజాగా 'ఇంటింటి రామాయణం' చిత్రంలో ప్రధాన పాత్రలో నటించి మెప్పించాడు.

సత్య : ఆంధ్రప్రదేశ్ అమలాపురంలో పుట్టిన సత్య సినిమాలపై ఆసక్తితో ఇండస్ట్రీ వైపు అడుగులు వేశారు. అసిస్టెంట్ డైరెక్టర్‌గా కెరియర్ ప్రారంభించారు. 'ద్రోణ' చిత్రం, 'అమృతం' టీవీ సీరియల్ సత్య తొలి ప్రాజెక్టులు. 2011లో 'పిల్ల జమీందార్' చిత్రంతో వెండితెరపై కనిపించారు. ఆ తరువాత 2013లో 'స్వామి రారా', 2019లో 'మత్తు వదలరా' వంటి చిత్రాల్లో తన విలక్షణ నటనతో ప్రేక్షకులకు దగ్గరయ్యాడు. విమర్శకుల ప్రశంసలు అందుకున్నాడు. 2021లో 'వివాహ భోజనంబు' చిత్రంతో హీరోగా మారాడు. ఆ తరువాత కూడా చిన్న,పెద్ద పాత్రలతో పెద్ద బ్యానర్ సినిమాల్లో కనిపిస్తూనే ఉన్నాడు.

సప్తగిరి :

'ఎ ఫిల్మ్ బై అరవింద్' చిత్ర అసిస్టెంట్ డైరెక్టర్‌గా కెరియర్ ప్రారంభించిన సప్తగిరి ఆ తరువాత చిన్న చిన్న పాత్రల్లో వెండితెరపై కనిపించారు. 'పరుగు' చిత్రం నటుడిగా అతని తొలి సినిమా. ఆ తరువాత 'ప్రేమ కథా చిత్రమ్', 'వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్' చిత్రాల్లో నటనకు గాను మంచి గుర్తింపు వచ్చింది. 'దృశ్యం', 'మనం', పవర్, ఎక్స్‌ప్రెస్ రాజా, సోగ్గాడే చిన్ని నాయనా, మజ్ను తదితర చిత్రాల్లో చిన్నా, పెద్ద పాత్రల్లో కనిపించి కడుపుబ్బ నవ్వించాడు. 2016లో 'సప్తగిరి ఎక్స్‌ప్రెస్' అనే చిత్రంతో హీరోగా కనిపించాడు. ఆ తరువాత కూడా వరుసగా సినిమాలు చేస్తూ వస్తున్నాడు. అడపాదడపా కామెడీ పాత్రల్లో కూడా కనిపిస్తున్నాడు.

సుధీర్ :

చిన్న చిన్న మ్యాజిక్ షోలతో ప్రస్థానం మొదలుపెట్టి బుల్లితెరపై జబర్‌దస్త్ ప్రోగ్రామ్‌లో స్టార్ కమెడియన్‌గా ఎదిగిన సుధీర్ వెండితెరపై కూడా తనదైన ముద్ర వేసుకున్నాడు. అడపాదడపా హీరో ఫ్రెండ్ పాత్రలు చేస్తూ 'సాఫ్ట్ వేర్ సుధీర్'తో హీరోగా కనిపించాడు. 'త్రీమంకీస్', 'గాలోడు', 'వాంటెడ్ పండుగాడ్' వంటి సినిమాల్లో నటించి వెండితెర ప్రేక్షకులకు కూడా దగ్గరయ్యాడు.

గెటప్ శ్రీను :

జబర్దస్త్ ప్రోగ్రామ్‌లో సుధీర్ టీమ్‌లో నటించిన శ్రీను వైవిధ్య గెటప్‌ల్లో ప్రేక్షకులను ఆశ్చర్యానికి గురిచేసే నటనను కనపరిచాడు. ఆ తరువాత వెండితెరపై కూడా చిన్న చిన్న పాత్రల్లో కనిపించేవాడు. సుధీర్ ప్రధాన పాత్రల్లో తెరకెక్కిన 'రాజు యాదవ్' చిత్రంలో విలక్షణ నటన కనబరిచి వెండితెరపై కూడా అభిమానులను సంపాదించుకున్నాడు.

షకలక శంకర్ :

శ్రీకాకుళం జిల్లాకు చెందిన శంకర్ జబర్దస్త్ ప్రోగ్రామ్ నుండి వెండితెరపై కనిపించిన మొట్టమొదటి నటుడు. పెయింటింగ్ పనులు చేసుకుంటూ సినిమా స్టూడియోల్లో ఆఫీస్‌బాయ్‌గా, ప్రొడక్షన్ బాయ్‌గా పనిచేశాడు. ఆ తరువాత కామెడీ షోలో కనిపించి తనదైన కామెడీతో ప్రేక్షకులకు దగ్గరయ్యాడు. వెండితెరపై మొదట్లో చిన్న చిన్న పాత్రల్లో నటిస్తూ పెద్ద హీరోల సినిమాల్లో కామెడీ చేశాడు. తాజాగా శంకర్ హీరోగా పలు సినిమాలు తెరకెక్కాయి.

నటనపై మక్కువతో ఇండస్ట్రీలోకి అడుగుపెట్టి తమకంటూ ప్రత్యేక స్థానం ఏర్పరచుకున్న ఈ నటులు ముందు మరిన్ని అవకాశాలతో ప్రేక్షకులను మెప్పించాలని కోరుకుందాం.

ఎమర్జింగ్ ఆసియా కప్ విజేత పాకిస్తాన్

ఫైనల్లో భారత్‌పై ఘన విజయం

కొలంబో : ఆసియా పురుషుల ఎమర్జింగ్ కప్‌ను పాకిస్తాన్ కైవసం చేసుకుంది. ఆదివారం కొలంబోలో జరిగిన ఫైనల్లో భారత్‌పై పాకిస్తాన్ 128 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. పాకిస్తాన్ విధించిన 353 పరుగుల లక్ష్య ఛేదనలో భారత్ ఘోరంగా విఫలం చెందింది. 40 ఓవర్లలో కేవలం 224 పరుగులకే ఆలౌటయింది. భారత జట్టులో అభిషేక్ శర్మ 61 పరుగులు, యాశ్ ధూల్ 39 పరుగులు, సాయి సుదర్శన్ 29 పరుగులు చేసినా.. మిగిలిన బ్యాటర్లు పెద్దగా రాణించలేకపోయారు. దీంతో భారత్‌కు లక్ష్య ఛేదనలో ఓటమి తప్పలేదు.

ఆదివారం తుదిపోరులో ముందుగా టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన పాకిస్థాన్‌లో బ్యాటర్లు రెచ్చిపోయారు. ఓపెనర్లు అర్ధ సెంచరీలతో కదం తొక్కారు. సైం అయూబ్ 59 పరుగులు చేయగా, సాహిబ్జాద ఫర్హాన్ 65 పరుగులు చేశారు. తరువాత వచ్చిన ఓమైర్ యూసఫ్ 35 పరుగులు చేయగా, ఇక ఈ తరువాత తయ్యబ్ తాహర్ సెంచరీతో కదం తొక్కాడు. 71 బంతులు ఎదుర్కొన్న తాహీర్ 12 ఫోర్లు, నాలుగు సిక్స్‌లతో 108 పరుగులు చేశాడు. దీంతో నిర్ణీత 50 ఓవర్లు ముగిసే సరికి పాకిస్తాన్ జట్టు ఎనిమిది వికెట్ల నష్టానికి 352 పరుగులు చేసింది. ప్లేయర్ ఆఫ్ మ్యాచ్‌గా తాహీర్ నిలవగా, ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌ను భారత్‌కు చెందిన నిశాంత్ సింధూ గెలుచుకున్నాడు.

కొరియా ఓపెన్ గెలిచిన సాత్విక్-చిరాగ్ జోడి

న్యూఢిల్లీ: భారత స్టార్ డబుల్స్ జోడి సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టిలు కొరియా ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ విజేతగా నిలిచారు. ఆదివారం జరిగిన పరుషుల డబుల్స్ ఫైనల్లో ఇండోనేషియాకు చెందిన టాప్ సీడ్ ఫజర్ అల్‌ఫయాన్-ముహమ్మద్ రియాన్ జంటపై 17-21, 21-13, 21-14 తేడాతో విజయాన్ని సాధించారు. ఈ మ్యాచ్‌లో తొలి గేమ్‌ను 17-21తో ఓడిపోయినప్పటికి పుంజుకున్న సాత్విక్-చిరాగ్ శెట్టి జోడి ప్రత్యర్థిని ఓడించి చాంపియన్స్‌గా నిలిచారు. ఇదివరకు థాయిలాండ్ ఓపెన్ (2019), ఇండియా ఓపెన్ (2022) గెలిచాడు. ఈ ఏడాది ప్రారంభంలో స్విస్ ఓపెన్ సూపర్ 300 టైటిల్ గెలిచిన అతను ఇండోనేషియా ఓపెన్ సూపర్ 1000 టోర్నమెంట్‌లో గెలిచి చరిత్ర సృష్టించిన సంగతి తెలిసిందే.

టీమిండియా కెప్టెన్‌పై ఐసిసి చర్యలు

దుబాయ్ : భారత మహిళా క్రికెట్ జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్‌పై ఐసిసి చర్యలకు ఉపక్రమించింది. బంగ్లాదేశ్‌తో ఈ నెల 22న జరిగిన మూడో వన్డేలో అంపైర్ నిర్ణయంపై అసహనం వ్యక్తం చేస్తూ.. బ్యాట్‌తో వికెట్లను కొట్టినందుకు గాను, అలాగే ప్రజెంటేషన్ సెర్మనీ సందర్భంగా అంపైర్లపై తీవ్రస్థాయి ఆరోపణలు చేసినందుకు గాను హర్మన్‌కు ఐసీసీ జరిమనా విధించింది. హర్మన్ వ్యవహరించిన తీరును దురుసు ప్రవర్తనగా పేర్కొన్న ఐసిసి.. ఆమె మ్యాచ్ ఫీజ్‌లో 75 శాతం కోత విధిస్తున్నట్టు ప్రకటించింది. హర్మన్ ప్రవర్తనను లెవెల్ 2 అఫెన్స్ కింద పరిగణించిన ఐసీసీ.. ఆమెకు 4 డీ మెరిట్ పాయింట్లు కేటాయిస్తున్నట్టు వెల్లడించింది. జరిమానాలో 50 శాతం ఆన్ ఫీల్డ్ దురుసు ప్రవర్తనకు, 25 శాతం ప్రజెంటేషన్ సెర్మనీ సందర్భంగా ఆమె వ్యవహరించిన తీరుకు కేటాయించినట్టు ఐసిసి తెలిపింది. అలాగే 3 డీమెరిట్ పాయింట్లు ఆన్ ఫీల్డ్ దురుసు ప్రవర్తనకు, ఓ డీమెరిట్ పాయింట్ ప్రజెంటేషన్ సెర్మనీ సందర్భంగా ఆమె వ్యవహరించిన తీరుకు కేటాయించినట్టు వివరించింది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68